తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-2-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 27 పేజీలు: 10+4 వెల: 6.50



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ




## గెలిచేశారు

జింబాబ్వేపై భారత్ ఘన విజయం

ఆటలో

# న్యాయవ్యవస్థపై ఎన్‌సిఇఆర్‌టి కుట్ర



- తప్పుడు ముద్ర వేసి విచారమా?
- ఉద్దేశపూర్వకంగానే చేశారు..
- రక్తం చిందింది అంటూ 'సుప్రీం' ఆగ్రహం
- వివాదాస్పద పాఠ్యపుస్తకంపై నిషేధం
- విదేశాల్లో, ఆన్‌లైన్‌లో విక్రయించడంపైనా..
- ఎన్‌సిఇఆర్‌టి బాధ్యత వహించాలి..
- మరింత లోతైన విచారణ జరగాలి
- కేసును క్లోజ్ చేయం: ధర్మాసనం
- కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సిఇఆర్‌టికి నోటీసులు
- తదుపరి విచారణ మార్చి 11 వాయిదా

'ఎన్‌సిఇఆర్‌టి ప్రయోగించిన బుల్లెట్‌తో న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోంది. కోర్టుల విశిష్ట చరిత్రను వివరించాల్సింది పోయి వ్యవస్థను అణచివేసేలా పాఠాలు రాయడం సరికాదు. యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పట్ల అగౌరవం కలిగించేలా ఈ పాఠ్యాంశం ఉంది. మీరు మొత్తం బోధనా సమాజానికి, విద్యార్థులకు న్యాయవ్యవస్థ అవినీతిపరుడని బోధిస్తే ఏ సందేశం వెళ్తుంది. బాధ్యులెవరో తేలేవరకు ఈ విషయాన్ని వదిలిపెట్టబోం. న్యాయవ్యవస్థ అధిపతిగా, జవాబుదారీతనం నిర్ధారించడం నా విధి. జవాబుదారీతనం వచ్చే వరకు తాను విచారణ ప్రక్రియను కొనసాగిస్తాం. దీని వెనుక ఉన్న వ్యక్తులు ఎవరో తాము తెలుసుకోవాలనుకుంటున్నాం'

\- జస్టిస్ సూర్యకాంత్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

5



బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటాం

\- కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి



రాహుల్ బొజ్జా ఇ. శ్రీధర్ ఎన్. శ్రీధర్ సంజయ్ కుమార్

సుపరిపాలన దిశగా అడుగులు

## ప్రక్షాళన!

భారీగా ఐఎఎస్‌ల బదిలీలు

ఏక కాలంలో 45 మందికి స్థానచలనం

ఇరిగేషన్ నుంచి జిఏడికి రాహుల్ బొజ్జా

ఇరిగేషన్ కార్యదర్శిగా ఇ.శ్రీధర్ నియామకం

ఐటి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్. శ్రీధర్

పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 45 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. పలువురికి అదనపు బాధ్యతలు సైతం అప్పగించింది. ముఖ్యంగా ఐటీ, పరిశ్రమలు, రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి వంటి కీలక శాఖల్లో సీనియర్ అధికారుల మార్పు జరగడం విశేషం. ఈ బదిలీల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలును పటిష్టంగా,పగడ్బందీగా చేయాలని >>2

# ఇక అంతా ఏఐ

## పాఠశాల స్థాయి నుంచే విద్యాబోధన

ఎఐ సాంకేతికతపై ఉపాధ్యాయులు, లెక్చరర్లకు స్వల్పకాలిక శిక్షణ

రాష్ట్రవ్యాప్తంగా 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు

పైలెట్ ప్రాజెక్టు తరహాలో నియోజకవర్గానికి ఒకటి

ఇంటర్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్

వర్సిటీలకు నిధులపై నివేదికివ్వండి

విద్యా శాఖపై సమీక్షలో సిఎం రేవంత్

ముఖ్యమంత్రికి విద్యా విధానం నివేదిక

'చట్టబద్ధత కల్పన' బాధ్యతలు కేశవరావుకు అప్పగింత

ఫీజుల నియంత్రణపై ఉన్నత కమిటీ






గురువారం హైదరాబాద్‌లో 'తెలంగాణ విద్యా విధానం' నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌కు అందజేస్తున్న కమిషన్ సభ్యులు. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు కేశవరావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి26:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో (హైదరాబాద్ నగరం వెలుపల) తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఈ ఏడాది నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. తరగతి గదులు, క్రీడా మైదానం, ఇతర అన్ని రకాల వసతులు, బోధనా సిబ్బంది, రవాణా సౌకర్యం కలిగి ఉన్న రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలోనే ఈ వంద స్కూళ్లు ఉండాలని సీఎం ఆదేశించారు. విద్యా శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి >>2

## ఆధిపత్యం చలాయించొద్దు

సేవాభావంతో పనిచేయండి: గ్రూప్ 1, గ్రూప్ 2 అధికారులకు సిఎం రేవంత్ దిశానిర్దేశం 7



సిబిఎస్‌సి సహా అన్ని స్కూళ్లలో

## తెలుగు తప్పనిసరి

1 నుంచి పది వరకు బోధించాలని ఆదేశాలు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి26:** రాష్ట్రంలోని విద్యావ్యవస్థలో మాతృభాష తెలుగుకు పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భవిష్యత్ తరాలకు తెలుగు భాషా సౌరభాన్ని అందించడమే లక్ష్యంగా, వచ్చే 2026-27 విద్యా సంవత్సరం నుండి రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగును కచ్చితంగా ఒక సబ్జెక్టుగా బోధించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేవలం స్టేట్ బోర్డు పాఠశాలలకే పరిమితం కాకుండా, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ వంటి అంతర్జాతీయ ప్రమాణాలతో నడిచే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లోనూ మాతృభాషను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం అనేక కార్పొరేట్ పాఠశాలల్లో మార్కుల వేటలో పడి తెలుగును విస్మరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కేవలం >>2

## మూసీ గోస.. బిజెపి భరోసా..

బాధితులకు అండగా ఉంటామన్న కమలనాథులు

పునర్జీవ ప్రాజెక్టుకు డిపిఆరే లేదు

బఫర్ జోన్ పెంచి అక్రమ నిర్మాణాలనడం దారుణం

మూసీ సుందరీకరణకు మేము వ్యతిరేకం కాదు

బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు





లంగర్‌హౌస్ వద్ద మూసీ బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి చీఫ్ రాంచందర్‌రావు

**నార్సింగి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** రాజధాని హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు, మూసీ సుందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను బిజెపి అడ్డుకొని తీరుతుందని రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్.రామచంద్రారావ్ పేర్కొన్నారు. గురువారం బిజెపి ఆధ్వర్యంలో మూసీ గోస... బిజెపి భరోసా... పేరుతో ఇళ్లు కోల్పోతున్న బాధితులను బిజెపి నాయకులు పరామర్శించారు. బాధితులతో మాట్లాడి వారి బాధలు సావధానంగా విన్నారు. అనతంతరం రామచంద్రయ్య మాట్లాడుతూ గాంధీ సరోవర్ ప్రాజెక్టు, మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం పేదలను భయాందోళనకు గురి చేస్తుందన్నారు. ఆర్మీ, ఏయిర్‌ఫోర్స్, నేవీలలో పని చేసి పదవీ విరమణతో >>2



జెరూసలెంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో కలిసి మీడియా సమావేశంలో ప్రధాని మోడీ

## త్వరలో భారత్- ఇజ్రాయెల్ స్వేచ్ఛా వాణిజ్యం

అణు ఇంధనం, అంతరిక్ష రంగాల్లోనూ సహకారం

సంయుక్త అభివృద్ధి, ఉత్పత్తిపై కలిసి సాగుతాం: ప్రధాని మోడీ

జెరూసలెంలో నెతన్యాహుతో ద్వైపాక్షిక చర్చలు

భారతదేశ యుపిఐ వినియోగంపై ఒప్పందం

క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ భాగస్వామ్యం

గొప్ప శక్తులుగా భారత్- ఇజ్రాయెల్: ప్రధాని

ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్‌తో భేటీ

భారత్ పర్యటనకు రావాలని ఆహ్వానం 5

సంక్షేమం - అభివృద్ధికే

## 'పద్దు' ప్రాధాన్యం!



సేద్యం, సాగుకు కేటాయింపులు పెంపు

ఆరు గ్యారెంటీలకు మరిన్ని నిధులు

బడ్జెట్ ప్రణాళికపై ముమ్మర కసరత్తు

రైతులకు బోనస్, ఇందిరమ్మ ఇళ్లకు రాయితీలు

మహిళలకు 2,500 ఆర్థిక సాయం అందించేందుకు బడ్జెట్‌లో కేటాయింపు?

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** అసెంబ్లీ తేదీలు ఖరారు కావడంతో, అందరి దృష్టి కొత్త బడ్జెట్‌లో వ్యక్తిగత విభాగాలకు చేసే కేటాయింపులపైనే ఉంది. కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులపై రాష్ట్రం వ్యక్తం చేసిన నిరాశను దృష్టిలో ఉంచుకుని, సంక్షేమం మరియు అభివృద్ధి మధ్య సమతుల్యతను రాష్ట్రం ఎలా సాధిస్తుందో అనేది ఆసక్తికరమైంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి వ్యయం రూ.3.15 లక్షల కోట్ల నుండి రూ.3.22 లక్షల కోట్ల వరకు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్థిక శాఖ అధికవర్గాల సమాచారం మేరకు వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రధానంగా సంక్షేమం మరియు అభివృద్ధిపై కేంద్రీకరించింది. వ్యవసాయం, నీటిపారుదల, పంచాయతీ రాజ్, మునిసిపల్ పరిపాలనకు ఎక్కువ నిధులు కేటాయించే అవకాశం ఉంది. అలాగే ఇందిరమ్మ ఇళ్లకు తగిన కేటాయింపులు, సన్న వరి పండించే రైతులకు బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు, వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి మహిళలకు రూ.2500 రూపాయలు, పెన్షన్లను రూ.4 వేలకు పెంపు వంటి అంశాలపై దృష్టి సారించింది. అదే సమయంలో, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఇతర కేంద్ర ప్రభుత్వ వికేంద్రీకరణల ద్వారా గరిష్ట నిధులను పొందడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. తద్వారా రుణాలపై ఆధారపడటమే కాకుండా, వడ్డీ చెల్లింపు భారం ఆ మేరకు తగ్గుతుందని అంచనా వేస్తోంది. ఇదే సమయంలో ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దగా లాభాలు రాకపోవడంతో కేటాయింపుల తుది నిర్ణయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని రాష్ట్ర >>2

2

## కులవివక్షపై హక్కుల కమిషన్ సీరియస్

4 వారాల్లోగా నివేదిక ఇవ్వండి

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీకి నోటీసులు

సర్వే భవన్తు సుఖిన:




## ఇన్‌స్టాలో మోడీ క్రేజ్

10 కోట్లు దాటిన ఫాలోయర్లు

తొలి రాజకీయ నేతగా సరికొత్త రికార్డు

మోడీ అగ్రస్థానం, ట్రంప్ రెండోస్థానం 5

2



ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతో భేటీ అయిన జగ్గారెడ్డి

## 'పెద్ద'లకు అవకాశం ఇవ్వండి

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు జగ్గారెడ్డి విజ్ఞప్తి



గురువారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన హిమాచల్‌ప్రదేశ్ మంత్రి విక్రమాదిత్య సింగ్

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన హిమాచల్ మంత్రి విక్రమాదిత్య సింగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి26:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని గురువారం సాయంత్రం హిమాచల్ ప్రదేశ్ ప్రజా పనులు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి విక్రమాదిత్య సింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో జరిగిన సమావేశంలో రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## మూసీ గోస.. బిజెపి భరోసా..

>> వచ్చిన డబ్బులను వెచ్చించి ఇళ్లు కొన్నారని, నేటికీ ఈఎంఐలు చెల్లిస్తున్నారని తెలిపారు. పేద ప్రజలు పైసా పైసా కూడబెట్టికుకొని ఇళ్లు కొన్నారని పేర్కొన్నారు. కూరగాయలు అమ్మి జీవనం సాగిస్తున్న అన్నదాతల భూమిని సైతం లాక్కుంటామంటూ నోటీసులివ్వడం దారుణమన్నారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, రైతుబంధు బకాయిలు చెల్లించేందుకు డబ్బులు లేవంటున్న సీఎం రేవంత్‌రెడ్డి రూ.4.వేల కోట్లు అప్పు చేసి గాంధీ సరోవర్‌ను నిర్మించాల్సిన అవసరం ఉందా? అని ప్రశ్నించారు. మధు పార్క్ అపార్టుమెంట్‌లో 450.మంది, విఘ్నేశ్వర కాలనీలో 100. ఇళ్లు తొలగిస్తామని నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. 12.మీటర్లున్న బఫర్‌జోన్‌ను ఏకపక్షంగా 50.మీటర్లకు పెంచి, పేదలను రోడ్డుపాలు చేయడంను బిజెపి వ్యతిరేకిస్తుందన్నారు. ప్రభుత్వ భూములనే 150.కోట్లకు వేలం వేస్తున్న సర్కారు అదే రీతిలో ప్రజలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలా కాదని 60.గజాల ప్లాట్లను ఇస్తామంటే బాధితులకు రాజకీయంగా, న్యాయపరంగా బిజెపి అండగా ఉండి ఉద్యమిస్తుందని హెచ్చరించారు. గాంధీ విగ్రహ ఏర్పాటుకు, మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదని, ప్రజల ఇళ్లు, ఆస్థులకు ఇబ్బందులు కలుగకుండా చేస్తే మేమూ సహకరిస్తామన్నారు. మూసీలోకి వచ్చే డ్రైనేజిని ఎస్టీపిల ద్వారా శుద్ధి చేసి మంచినీటిని పారించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గడ్డపార పట్టుకొని ప్రజల ఇళ్లను ధ్వంసం చేస్తుందన్నారు. సాధారణ ప్రజల ఆస్థులను కూలస్తున్న హైడ్రా ఎంఐఎం అక్రమ ఆస్థులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కారు రూ.4.వేల కోట్ల రుణంను పొందేందుకు ప్రజల ఇళ్లను కూల్చేందుకు సిద్దపడడం మూర్ఖపు చర్య అన్నారు. ఇంకా డిపిఆర్ కూడా లేని ఈ ప్రాజెక్టుకు ఎవరు రుణం ఇస్తారు? ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుకు బిజెపి మద్దతు ఇస్తుందని, దీని ప్రారంభోత్సవానికి రాజ్‌నాథ్‌సింగ్ వస్తున్నారని బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. మూసీని ప్రక్షాళన చేస్తామని బిఆర్ఎస్ వాళ్లే ప్రక్షాళన అయ్యారన్నారు. అనంతరం ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మూసీని శుద్ధి చేయాలంటే ముందు నగరంలోని నాలాలు, చెరువులను ఎస్టీపిలు నిర్మించి శుద్ధి చేసి ఆ నీటిని మాత్రమే మూసీలో ప్రవహింప చేయడంపై సర్కారు దృష్టి సారించాలన్నారు. దీనికి వేల కోట్ల రుణం తీసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. అనంతరం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలను రోడ్డుపాలు చేసే సర్కారు నిర్ణయంను బిజెపి ఆది నుంచి వ్యతిరేకిస్తుందన్నారు. పేదలకు అన్యాయం చేస్తే బిజెపి చూస్తూ ఊరుకోదని, అండగా నిలబడి పోరాడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమురయ్య, జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్‌గౌడ్, మహాలింగంగౌడ్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'పెద్ద'లకు అవకాశం ఇవ్వండి

### కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు జగ్గారెడ్డి విజ్ఞప్తి

**హైదరబాద్,ఫిబ్రవరి 26,ప్రభాతవార్త:** కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రాజ్యసభ ఎంపి అభ్యర్థులుగా తెలంగాణకు చెందిన వి.హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లను ఎంపిక చేయాలని సిఫార్సు చేయడానికి గురువారం ఢిల్లీకి చేరుకొని ప్రయ్నాతలు ముమ్మరంగా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని కలిసి రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై తన అభిప్రాయం చెప్పాలని ప్రయత్నించినప్పటికి రాహుల్ బిజీబిజీగా ఉండటంతో జగ్గారెడ్డి గురువారం కలుసుకోలేక పోయారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సులువుగా లభించడంతో ఆయనకు తెలంగాణలోని తాజా రాజకీయ పరిణామాలను వివరించారు. పనిలో పనిగా జగ్గారెడ్డి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలలో హనుమంతరావుకు, జెట్టి కుసుమ కుమార్‌కి రాజ్యసభ ఇవ్వాలని కోరారు. రాహుల్‌గాంధీ నిర్ణయంమేరకు రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక ఉంటుందని ఖర్గే సమాధానం ఇచ్చారు. అనంతరం ఢిల్లీలో విలేఖరులతో కాంగ్రెస్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ విహెచ్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పటిష్టతకు వయోభారం మరిచి పనిచేస్తున్నారని, ఫ్రీడంఫైటర్ ఫ్యామిలీ నుంచి వచ్చిన గాంధేయవాది జెట్టి కుసుమకుమార్‌లకు రాజ్యసభ అభ్యర్థిత్వం అభ్యర్థించడానికి ఢిల్లీకి వచ్చానని తెలిపారు.తెలంగాణకు చెందిన ఖాళీఅయిన రాజ్య సభ స్థానాలలో అభ్యర్థుల ఎంపిక విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, తెలంగాణ ఇంచార్జీ మీనాక్షి నటరాజ్ తో కూడా మాట్లాడాననీ, వి హనుమంతరావుకి. జెట్టి కుసుమ కుమార్ కి రాజ్యసభ ఇవ్వాలని కోరారనీ తెలిపారు. ఇదే విషయంను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీనీ, మల్లికార్జున్ ఖర్గేనీ కలవడానికి ఢిల్లీ వచ్చాననీ ఆయన విలేఖరులకు వివరించారు. రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉన్నారనీ అందువల్ల గురువారం కలుసుకోలేక పోయాననీ,ఎఐసిసి చీఫ్ మల్లికార్జున ఖర్గేను కలిసి వి హనుమంతరావుకి. జెట్టి కుసుమ కుమార్ కి రాజ్యసభ ఇవ్వాలని కోరాననీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే ఆ ఇద్దరికి రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని వారి సేవలు కుటుంబ నేపథ్యం వివరిస్తూ కోరాననీతెలిపారు. జెట్టి కుసుమ కుమార్ యూత్ కాంగ్రెస్ లీడర్ , స్టూడెంట్ లీడర్ కమ్మ సామాజిక నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని కమ్మ నాయకుడుగా అవకాశం ఇవ్వాలని జగ్గారెడ్డి కోరినట్లు తెలిపారు. జెట్టి కుమార్ ఫ్యామిలీ ఫ్రీడమ్ ఫైటర్స్, వల్ల కుటుంబం నుంచి అందరు కాంగ్రెస్ లోనే ఉన్నారని రెడ్డి చెప్పారు. హనుమంతరావు తెలంగాణలో అనేక ముఖ్యమంత్రులతో పని చేశారు, మూడు సార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారు రాజీవ్ గాంధీ , సోనియాగాంధీ ఆయనకు అవకాశాలు ఇచ్చారు వయసులో పెద్ద వ్యక్తి చురుకైన వ్యక్తి కాబట్టి మరో సారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఎఐసిసి చీఫ్‌ఖర్గే మాత్రం కమిటీలో నా ప్రతిపాదనలు చర్చిస్తామని హామీ ఇచ్చారని తెలపారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక సూచనలు చేస్తామని ఐతే రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని జగ్గారెడ్డి అన్నారు.

# ఇక అంతా ఏఐ

>> ఎ.రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన విద్యకు చిరునామాగా తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని సీఎం పేర్కొన్నారు. ఇందుకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల తరహాలో నిర్మించాలని సీఎం ఇంజినీర్లను ఆదేశించారు. వీటి నిర్మాణంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని, ఏడాదిలో క్యూర్ పరిధిలో నిర్దేశించుకున్న 12 ఇంటిగ్రేటెడ్ నూతన పాఠశాలల నిర్మాణం పూర్తి కావాలని సీఎం ఆదేశించారు. నగరంలోని భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లలో ఉండే అన్ని వసతులు ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో ఉండాలని సీఎం తెలిపారు. క్యూర్‌లో అప్‌గ్రేడ్ చేయనున్న 17 పాఠశాలలు, అదనపు గదులు, ఇతర వసతులు కల్పించనున్న 164 పాఠశాలల పనుల్లో ఎటువంటి రాజీ పడకూడదని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో 99 రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాల్లో వారం రోజులు విద్యా సంబంధిత అంశాలకు కేటాయించాలని సీఎం సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాఠశాలలు, కళాశాలలను సందర్శించి అవసరమైన వసతుల కల్పన, ఇతర అంశాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.కృత్రిమ మేథ (ఏఐ) ప్రపంచాన్ని శాసిస్తున్న నేపథ్యంలో పాఠశాల స్థాయి నుంచి దాని బోధనకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఏఐపై ఉపాధ్యాయులు, లెక్చరర్లకు స్వల్పకాలిక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏఐతో ప్రపంచ వ్యాప్తంగా వచ్చే మార్పులను తెలుసుకొని దాని ద్వారా వచ్చే అవకాశాలు మన విద్యార్థులే అందిపుచ్చుకునేలా మన సన్నద్ధత ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. సాంకేతిక విద్యా విధానంలో అందుకు అనుగుణమైన మార్పులను తీసుకురావాలని సీఎం పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. బ్రేక్ ఫాస్ట్ అందజేతకు సంబంధించి అధికారులు, హారేకృష్ణమిషన్ ప్రతినిధులకు సీఎం పలు సూచనలు చేశారు. బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు ప్రతి విద్యార్థికి పాలు అందజేయాలని.. ఇందుకు పాలను విజయా డెయిరీ నుంచి సేకరించాలని సీఎం ఆదేశించారు. విద్యార్థులకు ఎన్ని క్యాలరీలు అందజేస్తున్నామనేది తెలుసుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పుస్తకాలతో పాటు ఈ ఏడాది నుంచి కిట్ అందజేయాలని అందులో స్కూల్ బ్యాగ్, పెన్నులు, పెన్సిళ్లు, షార్పనర్లు, రంగుల పెన్సిళ్లు, జామెట్రీ బాక్సులు, డిక్షనరీ, బూట్లు, సాక్సులు ఉండాలని సీఎం తెలిపారు. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని బడ్జెట్‌లో పొందుపర్చేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. పాలిటెక్నిక్ కళాశాలలు, ఏటీసీల్లో ఏఐ ఆధారిత కోర్సులు వెంటనే ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కాలం చెల్లిన కోర్సులను తొలగించాలన్నారు. పాలిటెక్నిక్, ఏటీసీల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి వెంటనే వివిధ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభించేలా చూడాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాలకు నిధులు కేటాయిస్తామని సీఎం తెలిపారు. ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు కేటాయించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. మిగతా యూనివర్సిటీలకు ఎంత నిధులు అవసరమనే దానిపై నివేదిక సమర్పించాలని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డిని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు సంబంధించి తెలంగాణ ప్రైవేటు పాఠశాలల ఫీజు రెగ్యులటరీ మానిటరింగ్ కమిషన్ తమ నివేదికలోని అంశాలను సిఎం రేవంత్ రెడ్డి ఎదుట ఉంచింది. వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాలు, తెలంగాణలో తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. సావధానంగా విన్న సిఎం.రేవంత్ రెడ్డి జిల్లా స్థాయిలో కలెక్టర్, డీఈవోల నేతృత్వంలో పాఠశాలలను పరిశీలించి ఫీజుల నిర్ణయంపై నివేదిక సమర్పించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ స్థాయిలోని కమిటీ తుది కమిటీగా ఉండి నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. అలాగే ఫీజు నియంత్రణకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు, మేధావులు, సామాజికవేత్తల అభిప్రాయ సేకరణకు ముసాయిదాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తెలంగాణ విద్యా విధానంపై తాము రూపొందించిన నివేదికను తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు... ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి సమర్పించారు. అమెరికా, వియత్నాం, మలేసియా దేశాల్లో స్వయంగా పర్యటించడంతో పాటు వివిధ దేశాలు, పలు రాష్ట్రాల్లోని అత్యుత్తమ విధానాలను పరిశీలించి నివేదిక రూపొందించినట్లు విద్యా కమిషన్ ఛైర్మన్, సభ్యులు సీఎంకు తెలియజేశారు. నివేదికలోని ఒక్కో అంశంపై ఛైర్మన్ మురళి సుదీర్ఘంగా వివరించారు. సావధానంగా ఆలకించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆయా అంశాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ పలు సూచనలు చేశారు. అనంతరం నివేదికలో చట్టబద్ధత కల్పించాల్సిన అంశాలు... వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయదగిన అంశాలపై నివేదిక రూపొందించే బాధ్యతను ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేశవరావు నేతృత్వంలోని కమిటీకి ముఖ్యమంత్రి అప్పగించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేశవరావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శిగా యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సమగ్ర శిక్ష నోడల్ ఆఫీసర్, డి.నాగరాజు, ఉస్మానియా విశ్వ విద్యాలయం వీసీ ప్రొఫెసర్ మొలుగారం కుమార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పీ.ఎల్.విశ్వేశ్వరరావు, డాక్టర్ చారకొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డి, ప్రొఫెసర్ పద్మజా షా, కార్తీక్ సుబ్రహ్మణ్యన్, వీర వాసవి, డాక్టర్ జెన్నత్‌ఫర్ అజ్మీ సయ్యద్, డాక్టర్ ఎన్.వెంకటేష్, షేక్ జావేద్ అఫ్రోజ్, డాక్టర్ జే.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం - అభివృద్ధికే 'పద్దు' ప్రాధాన్యం!

>> ప్రభుత్వం నిర్ణయించింది. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను నెరవేర్చడంపై దృష్టి పెడుతూ, ప్రధానం కాని రంగాలకు కేటాయింపులను హేతుబద్ధీకరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ముఖ్యంగా మూసీ నది పరిసర ప్రాంతాల అభివృద్ధికి గణనీయమైన కేటాయింపులు జరుగుతున్నాయి.

ప్రస్తుత ఆర్థికంలో రూ.1,500 కోట్లు కేటాయించగా, అందులో రూ.375 కోట్లు మూసీ నదీ తీర అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్‌కు భూసేకరణ, ఇతర ఖర్చుల కోసం విడుదల చేసింది. ఇక ప్రస్తుత 2025-26 బడ్జెట్ అంచనాలో 67 శాతం మేర లక్ష్యం చేరుకుంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మూడు క్వార్టర్లకు గాను ఆదాయ రూ.1.9 లక్షల కోట్లు ప్రభుత్వ ఖజానాకు చేరింది. ఇది బడ్జెట్‌లో అంచనా వేసిన రూ.2.84 లక్షల కోట్లలో 67.01 శాతంగా నమోదైంది. అలాగే వసూళ్లలో మూడింట ఒక వంతు రూ.65,930 కోట్ల రుణాల రూపంలో ఉంది. మూడవ త్రైమాసికం ముగిసే వరకు పన్ను ఆదాయాలు రూ.1.13 లక్షల కోట్లు సమకూరగా, బడ్జెట్ అంచనాలలో రూ.1.75 లక్షల కోట్లుగా అంచనా వేసింది. ఆదాయ వసూళ్ల అంచనాలలో 80 శాతం కంటే ఎక్కువగా ఉన్నాయి. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని చివరి త్రైమాసికంలో ప్రధానంగా మార్చి నెలలో పన్ను ఆదాయాలు గణనీయంగా మెరుగుపడతాయని ఆర్థిక శాఖ అధికారులు నమ్మకంతో ఉన్నారు. ఇక కేంద్ర పన్నులలో తన వాటాగా రూ.14,982 కోట్లు రాష్ట్ర ఖజానాకు చేరగా, ఇది బడ్జెట్ అంచనాల్లో రూ.21,195 కోట్లలో 70.9 శాతం మేర సాధించినట్లయింది. అయితే ఈ నాల్గవ త్రైమాసికంలో ఈ మొత్తం పెరిగే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం నుండి పన్ను రాబడి /స్వీకరణలలో తగ్గుదలకు అవకాశం లేకుండా కేటాయింపులు, మొత్తం వ్యయం వాస్తవికంగా ఉండేలా కొత్త బడ్జెట్‌కు కసరత్తు జరుగుతోంది.

## వారం - వర్జ్యం

27-02-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
ఏకాదశి రా.10.34
ఆరుద్ర ఉ.10.49
వర్జ్యం : రా.10.12-11.43
దు.ఉ.8.49-9.36, మ.12.45-1.32
శుభసమయం:ఉ.5.00-6.00,సా.6.00-7.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** మీరు చేయని పొరపాటుకు మిమ్ములను దోషులుగా నిర్ణయించే విషయములో తగు జాగ్రత్తలను పాటించండి.

**వృషభం:**ఆధ్యాత్మిక కార్యక్రమములకు, శుభకార్యములకు, ధనమును బాగా ఖర్చు చేస్తారు. బదిలీలు. వాహన సౌలభ్యం.

**మిథునం:** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నూతన భాషలను అభ్యసించే ప్రయత్నాలు చేస్తారు. వస్త్రలాభం.

**కర్కాటకం:**వృత్తి యందు బాధ్యతలు పెరగటంతో సమయమునకు విశ్రాంతిని తీసుకోలేరు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**సింహం:**వివాదాస్పద వ్యవహారములు పరిష్కారమౌతాయి. టెండర్స్ అతి కష్టము మీద మీకు అనుకూలముగా వస్తాయి.

**కన్య :**పెట్టుబడి పెట్టినవారికి ఏకకాలంలో భాగములను ఇవ్వవలసివస్తుంది. అనేక నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**తుల :** వ్యాపారములో అధునాతన సాంప్రదాయములను సంస్కరణలను ప్రవేశపెడతారు. ఆర్థికాభివృద్ధిని సాధిస్తారు.

**వృశ్చికం:** సమన్యాయంతో వ్యవహరిస్తారు. హక్కుల కోసం పోటీపడతారు. మనోధైర్యం కలిగి ఉంటారు.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**ధనుస్సు:** చిన్ననాటి స్నేహితులను, తండ్రి సమకాలికులను కలుసుకొనుట జరుగు తుంది. కొన్ని జ్ఞాపకములు మనోవ్యథకు దారితీస్తాయి.

**మకరం:** అవకాశము ఉండి సమాచారము అందని లోపమువలన ఆత్మీయులకు సాయపడలేనందుకు విచారిస్తారు.

**కుంభం:**సహోదర వర్గముతో ఏకత్వమును సాధించు యత్నములు ఓ దశకు చేరుకుంటాయి. విహారయాత్రలు.

**మీనం:** ముఖ్యమైన కార్యక్రమముల చర్చలు, అమలు చేయు పనులు వాయిదా పడుతాయి.శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



జెరూసలేంలో గురువారం ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

## కులవివక్షపై హక్కుల కమిషన్ సీరియస్

### 4 వారాల్లోగా నివేదిక ఇవ్వండి.. నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీకి నోటీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్‌లో జరిగిన కుల వివక్ష, పోలీసుల నిర్లక్ష్యంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. ఈ ఘటనపై నాలుగు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. న్యాయవాది వినోద్ హిందుస్థానీ దాఖలు చేసిన ఫిర్యాదుపై స్పందించిన కమిషన గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీకి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై తీసుకున్న చర్యల నివేదికను నాలుగు వారాల్లోగా సమర్పించాలని స్పష్టం చేసింది. కాగా న్యాయవాది ఫిర్యాదులో ఈనెల 18న కుమ్మెర మల్లన్న స్వామి జాతర సందర్భంగా చిలుకేశ్వరం చంద్రకళ కుటుంబాన్ని ఆలయంలోకి ప్రవేశాన్ని నిరాకరించడంతో పాటు, రెండు నెలల పసికందును ఉద్దేశపూర్వకంగా తొక్కడంతో ఆ శిశువు మరణించిందని తెలిపారు. నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులు నిర్లక్ష్యం వహించడాన్ని తప్పుపడుతూ కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులు నాగర్‌కర్నూల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లినప్పుడు, నిందితులకు ఉన్న రాజకీయ పలుకుబడి కారణంగా ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడానికి అధికారులు నిరాకరించారని ఆరోపించారు. పోలీసులు రాజ్యాంగ రక్షణలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను సైతం ఉల్లంఘించారని కమిషన్ గుర్తించిందని న్యాయవాది వెల్లడించారు నిందితులను అరెస్టు చేయడం, విధి నిర్వహణలో విఫలమైన పోలీసు అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, బాధితులకు రక్షణతో పాటు పరిహారం అందించాలని కమిషన్ పేర్కొందని వివరించారు.

## కుమ్మెర గ్రామంలో రజక కుటుంబంపై జరిగిన దాడిపై విచారం వ్యక్తం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, బిసి కమిషన్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 26:** కుమ్మెర గ్రామంలో రజక కుటుంబంపై జరిగిన దాడిపై బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ సభ్యులు విచారం వ్యక్తం చేశారు. కుమ్మెర గ్రామంలో బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించిన తెలంగాణ బీసీ కమిషన్.. గురువారం సెక్రటేరియట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో భేటీ అయింది. బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, కమిటీ సభ్యులు తిరుమల గిరి సురేందర్, జయ ప్రకాష్, బాలలక్ష్మీ ్మలు మంత్రిని కలిశారు. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో రజక కుటుంబంపై జరిగిన దాడి ఘటనపై క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం జరిగిన ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివరాలను వివరించారు. రజక కుటుంబంపై జరిగిన దాడిపై మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ విచారం వ్యక్తం చేశారు. దాడి ఘటనపై కమిషన్ రూపొందించిన నివేదికను ప్రజలు, ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోతానని మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ కమిషన్ ఛైర్మన్, సభ్యులకు తెలిపారు.

## విద్యార్థుల భవిష్యత్తును చిదిమేయకండి: జాజుల శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్ ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** ఫీజుల రీయింబర్స్‌మెంట్ సమస్యను కేవలం ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు, ప్రభుత్వానికి మధ్య ఉన్న వివాదంగా చూడవద్దని, ఇది 22 లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని బీసీ జేఏసీ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఫీజుల నిధుల విడుదల విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులనే ప్రస్తుత ప్రభుత్వం కూడా చేస్తోందని ఆయన విమర్శించారు. బకాయిలు రాకపోవడంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 22 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 16న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యేలోపు ఫీజుల బకాయిలు విడుదల చేయకపోతే, వేలాది మంది విద్యార్థులతో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## అన్ని స్కూళ్లలో తెలుగు తప్పనిసరి

>> స్కోరింగ్ కోసమే అరబిక్, సంస్కృతం వంటి భాషలకు ప్రాధాన్యతనిస్తూ, తెలుగును అటకెక్కిస్తున్న తీరుపై ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కనీసం తెలుగులో చిన్న వాక్యాన్ని కూడా సరిగ్గా చదవలేకపోవడం భాషా సంక్షోభానికి దారితీస్తోందని గుర్తించిన సర్కారు, తెలుగు తప్పనిసరి అమలు చట్టం2018ని కఠినంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. గతంలో కోవిడ్ కారణంగా 9,10 తరగతులకు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేస్తూ, 2025-26లో 9వ తరగతికి, 2026-27 నాటికి 10వ తరగతికి ఈ నిబంధనను వర్తింపజేయనుంది. కాగా,విద్యార్థులపై పనిభారం పడకుండా ప్రభుత్వం ఒక వినూత్న మార్పును ప్రవేశపెట్టింది. ఇతర బోర్డుల విద్యార్థుల కోసం కఠినమైన సింగిడి పుస్తకాలకు బదులుగా, అత్యంత సరళంగా ఉండే వెన్నెల పాఠ్యపుస్తకాలను రూపొందించింది. కేవలం ఇతర రాష్ట్రాల నుండి వచ్చి 8వ తరగతి ఆపై తరగతుల్లో చేరే విద్యార్థులకు మాత్రమే ఈ నిబంధన నుండి మినహాయింపు ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై భారీ జరిమానాలు విధిస్తామని, చట్టపరమైన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. ప్రతి పాఠశాల తగినంత మంది తెలుగు ఉపాధ్యాయులను నియమించుకోవాలని, ఎస్‌సీఈఆర్‌టీ నిర్దేశించిన పుస్తకాలనే బోధించాలని స్పష్టం చేయడంతో, రాష్ట్రవ్యాప్తంగా తెలుగు భాషకు కొత్త ఊపిరి పోసినట్లయింది.

# ప్రక్షాళన!

>> సర్కార్ భావిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృ ష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు. దీనిప్రకారం సీనియర్ ఐఏఎస్ అధికారుల విభాగంలో సంజయ్‌కుమార్ ఐటీ శాఖ నుండి పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు బదిలీ అయ్యారు. ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీధర్ బాధ్యతలు చేపట్టనున్నారు. విపత్తు నిర్వహణ వంటి అత్యవసర విభాగాలలకు సీనియర్ ఐఏఎస్ ఎం దాన కిషోర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించడం ద్వారా అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించేలా యంత్రాంగాన్ని సిద్ధం చేసింది. అలాగే రాహుల్ బొజ్జాకు జిఏడీ వ్యవహారాలతో పాటు, వెనుకబడిన సంక్షేమ శాఖ బాధ్యతలను కూడా అప్పగించింది. ఇదే సమయంలో జిల్లా పరిపాలనలోనూ ప్రభుత్వం భారీ ప్రక్షాళన చేపట్టింది. సుమారు 10 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించడం దనఖవరా స్థానిక పరిపానలో నూతన ఉత్తేజాన్ని నింపాలని భావిస్తోంది. కరీంనగర్ కలెక్టర్‌గా చిత్రా మిశ్రా, సిరిసిల్లా కలెక్టరుగా గరిమా అగర్వాల్, కొత్తగూడెంకు అంకిత్, హన్మకొండకు చాహత్ బాజ్‌పాయ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నియామకాల్లో యువ అధికారులకు ప్రాధాన్యత లభించడం విశేషం. ఇక సంక్షేమ, అభివృద్ధి పథకాల పర్యవేక్షణ కోసం ప్రత్యేక విభాగాలను బలోపేతం చేశారు. సవ్యసాచి ఘోష్‌కు ఫ్లాగ్‌షిప్ స్కీమ్స్ బాధ్యతలు, డి దివ్యకు ప్రజావాణి స్టేట్ నోడ్ అధికారి బాధ్యతలు అప్పగించడం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చూపుతున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది. విద్యుత్, మౌలిక సదుపాయాల కల్పనలోనూ మార్పులు చోటు చేసుకున్నాయి. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండిగా పనిచేస్తున్న ముషారఫ్ ఫరూకీని కొత్తగా ఏర్పాటు చేసిన మూడో విద్యుత్ పంపిణీ సంస్థకు నియమించగా, ఈయన ప్లేస్‌లో జితేష్‌ను బదిలీ చేశారు.

**బదిలీ అయిన ఐఏఎస్ అధికారులు**

1. పంచాయితీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్
2. ఫ్లాగ్‌షిప్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ స్కీమ్స్, సిఎస్సార్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్
3. విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, రెవెన్యూ శాఖ ఎం. దాన కిశోర్
4. ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్. శ్రీధర్
5. పొలిటికల్ శాఖ ప్రధాన కార్యదర్శిగా రాహుల్ బొజ్జా
6. సాగునీటి, సిఎడి కార్యదర్శిగా ఈ. శ్రీధర్
7. ఫైనాన్స్, ప్లానింగ్ శాఖ కార్యదర్శిగా డా. గౌరవ్ ఉప్పల్
8. ఎస్సీగుకులాల విద్యాలయాల సంస్థ కార్యదర్శి, ఎస్సీ అభివృద్ధి కమిషనర్‌గా బి. విజయేంద్ర
9. ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి. దివ్య
10. తెలంగాణ భవన్ (న్యూఢిల్లీ) సమన్వయ ప్రత్యేక కార్యదర్శిగా అద్వైత్ కుమార్ సింగ్
11. ఎండోమెంట్స్ డైరెక్టర్‌గా ఎం. హనుమంతరావు
12. ఫైనాన్స్ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా సిక్తా పట్నాయక్
13. జనగాం జిల్లా కలెక్టర్‌గా సందీప్ కుమార్ ఝా
14. 3వ డిస్కమ్ సిఎండి ముషరఫ్ అలీ ఫారూఖీ
15. లేబర్ శాఖ ప్రత్యేక కమిషనర్‌గా పమేలా సత్పతి
16. భువనగిరి జిల్లా కలెక్టర్‌గా అనురాగ్ జయంతి
17. కోఆపరేషన్ ప్రత్యేక కమిషనర్, రిజిస్ట్రార్‌గా రాహుల్‌రాజ్ పి.ఎస్
18. ఐటిఇ అండ్ సి శాఖ ప్రత్యేక కార్యదర్శిగా భవేష్ మిశ్రా
19. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండిగా జితేష్ వి. పాటిల్
20. గద్వాల్ జిల్లా కలెక్టర్‌గా రిజ్వాన్‌బాషా షేక్
21. ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా సంతోష్ బి.ఎం
22. నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా ప్రతీక్ జైన్
23. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా స్నేహ శబరిష్
24. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ ఎండిగా పి. కాత్యాయిని దేవి
25. నారాయణపేట అదనపు కలెక్టర్‌గా జి. ఫణీంద్రరెడ్డి
26. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్ర మిశ్రా
27. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా గరీమా అగర్వాల్
28. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా దీపక్ తివారీ
29. మెదక్ జిల్లా కలెక్టర్‌గా ప్రతిమా సింగ్
30. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా అంకిత్
31. హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా చాహత్ బాజ్‌పాయ్
32. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా ఖుష్బూ గుప్తా
33. జిహెచ్ఎంసి రాజేంద్రనగర్‌జోనల్ కమిషనర్‌గా మకరందు
34. మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌గా ఫైజాన్ అహ్మద్
35. హైదరాబాద్ మెట్రో జాయింట్‌ఎండిగా శివేంద్ర ప్రతాప్
36. జిహెచ్ఎంసి కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌గా పర్మార్ పింకేష్‌కుమార్ లలిత్‌కుమార్
37. వికారాబాద్ అదనపు కలెక్టర్‌గా ఉమా శంకర్ ప్రసాద్
38. నాగర్‌కర్నూల్ అదనపుకలెక్టర్‌గా జి.వి.శ్యామ్‌ప్రసాద్ లాల్
39. మంచిర్యాల అదనపు కలెక్టర్‌గా పి. చంద్రయ్య
40. వరంగల్ అదనపు కలెక్టర్‌గా వై.వి. గణేష్
41. సిద్ధిపేట అదనపు కలెక్టర్‌గా అబ్దుల్ హామీద్
42. నిర్మల్ అదనపు కలెక్టర్‌గా బి. వెంకటేశ్వర్లు
43. వనపర్తి అదనపు కలెక్టర్‌గా ఎన్. ఖీమ్యా నాయక్
44. ఇండస్ట్రీ, పెట్టుబడుల సెల్‌అదనపు సిఇఒగా విద్యాసాగర్
45. ప్రజావాణి అదనపు నోడల్ అధికారిగా ఎం. సురేందర్

# ప్రభుత్వ ప్రగతిని చూడలేని కెసిఆర్ అండ్ కో విషప్రచారం

వరుస ఎన్నికల్లో ప్రజల బుద్ధి చెబుతున్నా మారని బిఆర్ఎస్ వైఖరి

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో బిఆర్ఎస్ అవినీతికి బిజెపి సహకారం

కెసిఆర్ అసెంబ్లీకి రావాలి.. మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలి

మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి26:** రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు, ఉపఎన్నికలు, పంచాయితీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్ష బిఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని, దీనికి మరోవైపు బిజెపి నేతలు వంతపాడుతున్నారని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి ఆరోపించారు. గురువారం నాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ బలరాం నాయక్, రామ సహాయం రఘుమారెడ్డి, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, మాధవరెడ్డితో కలసి మాట్లాడారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ...2023 జులై 15న వెలుగుమట్లలో నాటి బిఆర్ఎస్ ప్రభుత్వమే పేదల ఇండ్లను కూలగొట్టించిందని చెబుతూ నాడు కూల్చివేత సంఘటనల ఫోటోలను ప్రదర్శించారు. అంతేకాక వెలుగుమెట్లలో పేదలకు ఇండ్లు తిరిగి కట్టిస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేసింది. కానీ ఇందిరమ్మ ప్రభుత్వం హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా అక్కడ ఆక్రమంగా ఉన్న ఇండ్లను తొలగించడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు అక్కడ అర్హులైన పేదలకు ఇంటి స్థలం, ఇళ్ల స్థలం ఇస్తాం. పేదలే ఇందిరమ్మ ప్రభుత్వం పేటెంట్ అని చెప్పారు. ఈవిషయంలో నిజంగా పేదలపై ఉంటే, బిఆర్ఎస్ బావ మరుదులు, ఫాంహౌస్‌లో ఉండి కుట్రలు చేస్తున్న కేసీఆర్ వెంటనే స్పందించి కాళేశ్వరంలో దోచుకున్న, దాచుకున్న సొమ్ములో కొంత భాగాన్ని బయటకు తీసి పేదలకు ఇళ్లు కట్టించి పాప పరిహారం చేసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాదని కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టి ఎనిమిదవ వింతగా ప్రచారం చేసుకుంది. వారి హయాంలోనే లక్షలది కోట్ల ప్రాజెక్ట్ కట్టడం, అవినీతి కారణంగా బీటలువారడం కూడా జరిగిందన్నారు. నాలుగేళ్లలో 168 టిఎంసీ నీరు ఇస్తామని చెప్పి దీనిలో 50 టిఎంసీల నీటిని సముద్రం పాలుచేశారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ బిఆర్ఎస్‌కు ఏటీఎంగా మారిందన్న బిజెపీ నేతలు బిఆర్ఎస్‌తో చేతులు కలిపారని పేర్కొన్నారు. జస్టిస్ ఘోష్ కమీషన్ నివేదిక ఇచ్చినా, అసెంబ్లీలో తీర్మానం చేసి సిబిఐ కి ఇచ్చినా ఇంతవరకు కేంద్రం కనీసం స్పందించలేదని, బిఆర్ఎస్ ప్రభుత్వం గతంలో వదిలేసిన ప్రాజెక్టులను మేం పూర్తి చేస్తున్నామన్నారు.. 16 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీకి కేసీఆర్, బావ బావమరుదులు వచ్చి మాట్లాడాలి. వారు గతంలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. మేం కచ్చితంగా అవకాశం ఇస్తాం.వచ్చి మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలి అని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..బిఆర్ఎస్ ప్రభుత్వం నీటి ప్రాజెక్ట్‌ల విషయంలో ఉత్తర తెలంగాణకు పూర్తిగా అన్యాయం చేసింది. 196 టిఎంసీల నీరు ఇస్తామని చెప్పి 168 టిఎంసీలకు పరిమితం చేసింది. 50 టిఎంసీలను సముద్రంలో కలిపింది. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది. మా ప్రభుత్వం వచ్చాక శ్వేత పత్రం ఇచ్చాం. కాళేశ్వరంపై చర్చించాం. కేంద్రం చర్యలు కోరాం. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 48వేల కోట్లు మిత్తిగా కట్టింది. కేంద్రప్రభుత్వం జరిగిన నిధులు ఇవ్వాలి అని కోరారు. మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ .. బిఆర్ఎస్ పార్టీ అవినీతికి పాల్పడినందును దేశంలోని ప్రాంతీయ పార్టీల్లోనే ధనిక పార్టీగా మారింది.సుమారు వెయ్యి కోట్ల రూపాయిల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఎలక్టోరల్ బాండ్లు దీనికి నిదర్శనం. కాళేశ్వరం ప్రాజెక్ట్ కారణంగా ఏర్పడిన నష్టాన్ని కేసీఆర్ నుంచి వసూలు చేయాల్సిన అవసరం ఉంది. కాంట్రాక్టర్లు, కాసుల కోసమే బిఆర్ఎస్ అనుకూల నీటిప్రాజెక్టలను చేపట్టిందని విమర్శించారు.



ఆలయ తిరువీధుల్లో స్వామి అమ్మవార్ల ఊరేగింపు సేవ

## గరుడ వాహనంపై విష్ణుమూర్తిగా స్వామి తిరువీధుల్లో విహారం

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్లను విష్ణుమూర్తి అలంకారంతో అలంకరించి గరుడవాహనంపై అధిష్టింపజేసి ఆలయ తిరువీధుల్లో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవాలను ఉదయం ఆలయ అర్చకులు వేద పండితులు, రుత్వికులు చదివిన పంచ సూక్తులు పంచ ఉపనిషత్తులతో స్వామిఅమ్మవార్లకు అభిషేకం గావించి పట్టువస్త్రాలను ధరింపజేసిన అనంతరం స్వామిఅమ్మవార్లను వివిధ రకాల పుష్పమాలికలతో శోభాయ మానంగా అలంకారం చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్ల అలంకార సేవకు ఆలయ ప్రధాన అర్చకులు కాందూరు వెంకటాచార్యులు హారతినిచ్చి స్వామి అమ్మవార్లను తిరువీధుల్లో భాజా భజంత్రీలతో, మంగళ వాయి ద్యాలతో రెండు గంటలపాటు ఊరేగింపును నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల అలంకార సేవను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి ఉపనిషత్తులను పారాయణం చేసి అనంతరం సేవను ఆలయంలోనికి తీసుకొని వెళ్లి భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు. అలంకార సేవలకు భక్తులు, స్థానికులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహమూర్తి ఇఒ భవానీ శంకర్ ప్రధానఅర్చకులు కాందూర్ వెంకటాచార్యులు, డిఇఒ దుర్బల భాస్కర్‌శర్మ, సురేంద్రఆచార్యులు, మాధవాచార్యులు, శ్రీధరాచార్యులు నరేష్‌కుమార్ ఆచార్యులు శ్రీనాథఆచార్యులు ఆలయ అధికారులు సీతా రామాచార్యులు, గజల్ రఘు తదితరులు పాల్గొన్నారు.

## వైస్‌ఛాన్సలర్ ఆచార్య ఎం.కుమార్

వైభవంగా కొలకలూరి పురస్కారాల ప్రదానం, పరిశోధక సన్మానం

# జ్ఞానానికి, సాహిత్యానికి పెద్దపీట వేస్తోన్న ఓయు



కొలకలూరి పురస్కార గ్రహీతలతో ఒయు, టియు ఉపాధ్యక్షులు ఎం.కుమార్, నిత్యానందరావులు, ఇనాక్ కుటుంబసభ్యులు

**హైదరాబాద్ (నాంపల్లి), ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ జ్ఞానా నికి, సాహిత్యానికి పెద్దపీట వేస్తోందని, ఎంతో చరిత్ర ఉన్న తెలుగుశాఖలో ఆచార్యులుగా పని చేసిన చాలామంది ఉపాధ్యక్షులయ్యారని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య ఎం.కుమార్ అన్నారు. అదేస్థాయిలో ఆచార్య కొలకలూరి ఇనాక్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి మొ దటి ఉపాధ్యక్షుడ య్యారని తెలిపారు. సాహిత్య తెలుగు రంగాల్లో విశేషంగా కృషి చేస్తున్న వారిని సత్కరిం చుకోవడం మనబాధ్యత న్నారు. కొలకలూరి ఇనాక్ సాహిత్య అనుభవం ఎనలేనిదని, తెలుగు సాహిత్యంలో దిగ్గజమని ఆయన పేరు మీదిస్తున్న ఈ పుర స్కారాలు సాహితీ లోకం లో అత్యంత ప్రతిష్టాత్మకమైనవన్నారు. సమాజంలో అణగారిని వర్గాల గొంతుకలను, సామాజిక వాస్తవ కథలను ప్రతిబింబించే రచనలకు ఈ పురస్కారాలివ్వడం గొప్ప ఆశయమని ప్రశంసించారు. ఇనాక్ తల్లిదండ్రుల పేరున పురస్కారాలివ్వడం చాలా అద్భుతమైన విషయం, గర్వించదగ్గదన్నారు. పుర స్కారాలు అందుకున్న వారందరికి శుభాభి నందనలు తెలిపారు. కొలకలూరి అనితా కిరణ్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో గురువారం రాత్రి కొలకలూరి పురస్కారాల ప్రదానం, పరిశోధక సన్మా నాలు వైభవంగా జరిగాయి. కుప్పం ద్రావిడ విశ్వవిద్యా లయం పూర్వ ఉపాధ్యక్షు రాలు, తిరుపతి శ్రీవేంకటేశ్వర మహిళా విశ్వవిద్యాలయం ఆంధ్రాచార్యులు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వ విద్యాలయం ఉపాధ్య క్షుడు ఆచార్య ఎం. కుమార్ ముఖ్య అతిథిగా, కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు ఆత్మీయ అతిథిగా, బెంగళూరు విశ్వవిద్యాలయం పూర్వ ఆంధ్రాచార్యులు ఆచార్య కట్టమంచి ఆశాజ్యోతి విశిష్ట అతిథి, ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు ప్రత్యేకాతిథి, ఆచార్య కొలకలూరి సుమకిరణ్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి మాట్లాడారు. తదుపరి అతిథుల చేతులమీదుగా రచయిత పలమనేరు బాలాజీ, రచయిత్రి స్వర్ణకిలారిలను ఘనంగా సత్కరించి శ్రీమతి కొలకలూరి భాగీరథి కథానికా పురస్కారాలు; రచయిత డా. బి.నాగేషును ఘనంగా సత్కరించి శ్రీమతి కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారం; విమర్శకుడు కెంగార మోహన్‌ను ఘనంగా సత్కరించి శ్రీకొలకలూరి రామయ్య విమర్శ పురస్కారం ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. అనంతరం తెలుగు విమర్శ పరిశోధనలు: ఆచార్య కొలకలూరి ఇనాక్‌స్థానం పరిశోధకుడు డా. గొల్ల చంద్రశేఖర్, పర్యవేక్షకులు ఆచార్య ఎస్.ఆర్.సదాశివరెడ్డి, ఆచార్య కొలకలూరి ఇనాక్-రంధి వలస నవలల్లో మానవ తావాదం పరిశోధకులు డా. టి.సోమశేఖర్ పర్యవేక్షకులు ఆచార్య శ్రీపురం యజ్ఞశేఖర్‌లను ఘనంగా పరిశోధక సన్మానించి అభినందించారు. అనంతరం తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు ఆచార్య కొలకలూరి ఇనాక్, కొలకలూరి పురస్కారాల నేపథ్యాన్ని సవివరపరిచి నిర్వాహకులను, పురస్కార స్వీకర్తలను అభినందించారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

ప్రతిపక్షాలు మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలి: మంత్రి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్న భిన్నం చేయడంతో పాటు కోట్లు రూపాయాలు కమీషన్లు తీసుకొని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్న భిన్నం చేశారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం గాంధీ భవన్లో. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మీడియా సెల్ కన్వీనర్ సామ రామ్మోహన్ రెడ్డి ,లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి ఎలక్ష్మన్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో అప్పులు తీసుకువచ్చిన నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనికి రూ. 47వేల కోట్లు వడ్డీ రూపంలో చెల్లించాల్సి వచ్చిందని మంత్రి అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో కమీషన్లు దండుకుందని అన్నారు. దేశంలోనే, ప్రపంచంలోనే ఎక్కడ లేని చెప్పారని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఒక్క చుక్క నీరు ఇవ్వలేదని మంత్రి అన్నారు. కాళేశ్వరంలో చేసిన అవినీతికి ఇతర దేశాల్లో అయితే కఠిన శిక్షలు విధించే వారని మంత్రి అన్నారు. మన రైతులకు సంబంధించి రైతు బంధు, మూసీ ప్రక్షళన గురించి ప్రధాన ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతున్నారని మంత్రి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేసిన పని వలన ప్రతి నెల రూ. 6వేల కోట్లు వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పాడిందని మంత్రి అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు చేసిన అప్పుతో ఇప్పటికే రూ. 47వేల కోట్లు చెల్లించాలమని మంత్రి తెలిపారు. రాష్ఠంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. బిఆర్ఎస్ నేతలు ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి తెలిపారు.

## అవయవ దానంచేసి అమరురాలైన గుండు సృజన



సృజన (ఫైల్)

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని జనకపూర్‌కు చెందిన గుండు సృజన (33) గురువారం (25న) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఆమె భర్త గుండు నాగరాజుతో కలిసి ఉద్యోగరీత్యా వియత్నాంలో నివసిస్తున్నారు. వీరికి ఐదేళ్ల కుమార్తె, 23 రోజుల పసికందు కుమారుడు ఉన్నారు. ప్రసవం కోసం స్వగ్రామానికి వచ్చిన సృజనకు కొద్ది రోజుల తరువాత అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే ఆమెను మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి మెదడు పనితీరు పూర్తిగా నిలిచిపోయిందని (బ్రెయిన్ డెడ్) నిర్ధారించారు. చికిత్స పొందుతూ గురువారం ఆమె తుది శ్వాస విడిచారు. మరణానంతరం ఆమె అవయవాలు ఇతరులకు ప్రాణాధారంగా మారాలని కుటుంబ సభ్యులు నిర్ణయించి గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలను రాష్ట్ర అవయవ దానం సమన్వయ సంస్థ జీవన్దన్ కు దానం చేశారు. సృజన చేసిన ఈ మహోన్నత అవయవ దానం పలువురికి ప్రాణాలు కాపాడే అవకాశం కల్పించనుంది. ఆమె ఆత్మకు శాంతి కలగాలని స్థానికులు సంతాపం వ్యక్తం చేశారు.

## 'పిఎం రాహత్' ప్రధాన ఉద్దేశం రోడ్డు ప్రమాద మరణాల తగ్గింపు

రవాణా శాఖ మంత్రులతో విడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర రోడ్లు రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాల వల్ల సంభవించే మరణాలను తగ్గించ డమే పీఎం రాహత్ పథకం ప్రధాన ఉద్దేశమని కేంనరద రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. పీఎం రహత్‌పై రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, రవాణా శాఖ సెక్రటరీలు, డీజీపీలతో కేంద్ర రోడ్ల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ నుండి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, జెటిసిలు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల సంభవించే మరణాలను తగ్గించడం పీఎం రాహత్ పథకం ప్రధాన ఉద్దేశమని కేంద్ర మంత్రి అన్నారు. 201 లా కమిషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన అధ్యయనం ప్రకారం ప్రమాదం జరిగిన తర్వాత గంట (గోల్డెన్ అవర్) లోపు బాధితుడిని ఆసుపత్రికి చేర్చితే 50 శాతం మరణాలు తగ్గించ వచ్చన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి బాధితుడికి రూ. 1.5 లక్షలు వరకు చికిత్స ఖర్చు భారం భరిస్తారని, ప్రమాదం జరిగిన తేదీ నుండి గరిష్టంగా ఏడు రోజుల వరకు ఈ కవరేజ్ వర్తిస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాల బాధితులకు ఈ సహాయం అందుతుందని, ప్రాణాపాయం లేని కేసులో 24 గంటల వరకు ప్రాణాపాయ స్థితిలో 48 గంటల వరకు స్థిరీకరణ చికిత్స అందించబడు తుందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లా డుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం రహత్ పథకంలో చేరడానికి తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా ఉందని సమావేశంలో తెలిపారు. ఈ పథకం ద్వారా మరణాలు తగ్గించవచ్చని తెలంగాణ ప్రభుత్వం రోడ్డు భద్రతా మాసోత్సవాలు ఘనంగా నిర్వహించి బోధన కల్పించిందన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం ప్రమాణ శాఖలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని తెలిపారు దేశంలో 29 రాష్ట్రాల్లో ఇప్పటికే వాహన సారథి అమలవుతుండగా ఇటీవల తెలంగాణ ప్రభుత్వం వాహన సారథిలో చేరిందని పేర్కొన్నారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా స్క్రాప్ పాలసీ అమలు చేస్తున్నామని తెలిపారు. ఈవి పాలసీ ద్వారా 100 టాక్స్ మినహాయింపు చేసినట్లు కేంద్ర మంత్రి గడ్కరికి వివరించారు. తెలంగాణలో ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్స్, ఆటోమేటిక్ డ్రైవింగ్ స్టేషన్స్, లైసెన్సుల జారీలో విప్లవత్మక మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు.

## రూ. 3 లక్షలు కొట్టేసిన సైబర్ కేటుగాళ్లు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త:** ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన బిజెపి నాయకుడు, పవర్ జిమ్ నిర్వాహకుడు ఖాండ్రే విశాల్ కు చెందిన బ్యాంక్ ఖాతా నుంచి రూ. 3,09,000 సైబర్ కేటుగాళ్ళు దొంగిలిచ్చారు. గురువారం భాదితుడు తెలిపిన వివరాల ప్రకారం రెండు రోజుల క్రితం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఒక్క సారిగా తన ఫోన్ కు మెసేజ్ లు రావడంతో గమనించగా సైబర్ దుండగులు రూ. 500ల నుండి రూ. 50 వేల వరకు ఇలా కొద్దికొద్దిగా కొంత డబ్బును బ్యాంక్ ఖాతాల నుండి డ్రా అయ్యాయని, తన ప్రమేయం లేకుండా బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు పోవడంతో అవక్కయ్యాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు...తాను ఎలాంటి లింకులను కూడా క్లిక్ చేయలేదని, అయిన కూడా తన బ్యాంక్ ఖాతా నుండి సైబర్ కేటుగాళ్లు డబ్బులను దండుకు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. అధికారులు స్పందించి తగు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ఇద్దరు మావోయిస్టులు మృతి

**చర్ల, పిబ్రవరి 26, ప్రభాతవార్త :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. ఘటనా స్థలం నుండి భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రావతి నది ప్రాంత అటవి ప్రదేశంలో మావోయి స్టులు ఉన్నారన్నా సమాచారంతో భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడటంతో కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌ను బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ స్వీకరించారు.

### కాంకేర్ జిల్లాలో సీనియర్ మావోయిస్టు మల్లేశ్ లొంగుబాటు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త:** ఛత్తీస్‌గడ్ కాంకేర్ జిల్లాలో ఎనిమిది లక్షల రివార్డు కలిగి ఉన్న సీనియర్ మావో మల్లేష్ మంగళవారం రాత్రి బిఎస్ఎఫ్ క్యాంపు ఎస్‌పి నిఖిల్ రఖేచా ఎదుట లొంగిపోయారు. ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులు లొంగుబాటు ఇటీవల పెరిగింది. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న బస్తర్ ప్రాంతంలో కాంకేర్ జిల్లా ఎస్పీ సమక్షంలో తన వద్ద ఉన్న ఎకె47 రైఫిల్స్‌వచ్చి లొంగిపోయే కీలక పరిణామం చోటుచేసుకుంది. మావోయిస్టు పార్టీ బస్తర్ కమిటీకి చెందిన డివిజనల్ కమిటీ మెంబర్ మల్లేశ్ పనిచేస్తున్నారు. ఆయనపై రూ.8 లక్షల రివార్డు కూడా ఉంది. ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకాలకు ఆకర్షితుడై, హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. బస్తర్ కమిటీలో మల్లేష్ అత్యంత కీలకమైన వ్యక్తిగా గుర్తింపు పొందారు.

# సినీఫక్కీలో గంజాయి తరలింపు

అడ్డుకట్ట వేసిన పోలీసులు

రూ.2.5 కోట్ల విలువైన సరకు స్వాధీనం

వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ



గంజాయిని చూపిస్తున్న పోలీసు అధికారులు

**కొత్తగూడెం క్రైమ్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** విశ్వసనీయ సమాచారం మేరకు చుంచుపల్లి పోలీసులు, సీసీఎస్ పోలీసులు చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు నిర్వహిస్తుం డగా ఒక ద్విచక్ర వాహనాన్ని, ఒక లారీని ఆపి తనిఖీలు చేపట్టడం జరిగింది. ఆర్జే 09 జీడీ 0686 నంబరు గల ఒక లారీ కొత్తగూడెం నుండి ఖమ్మం వైపుగా వెళుతుండగా కంటైనర్ ను తనిఖీ చేయగా కొబ్బరి పీచు బండిల్స్ మధ్యలో కవర్ చేసి 16 బ్యాగుల్లో 408.185 కేజీల నిషేధిత గంజాయిని అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు తేలింది. దీని విలువ సుమారుగా రెండు కోట్ల ఐదు లక్షల రూపాయలు ఉంటుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వివరాలు వెల్లడించారు. పట్టుబడిన నలుగురు వ్యక్తులను విచారించగా చింతూరు నుండి 20 కేఎం దూరంలో అటవీ ప్రాంతంలోగంజాయిని కొబ్బరి పీచు బండిల్స్ వీంధ్యలో లోడ్ చేసుకుని ఇట్టి గంజాయిని కొనుగోలు చేసి కంటైనర్లో గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా చుంచు పల్లి పోలీసులు పట్టుకోవడం జరిగింది. తదుపరి విచారణలో ఇట్టి గంజాయిని కొనుగోలు చేసిన, అమ్మిన వ్యక్తులపై కూడా కేసు నమోదు చేయడం జరుగుతుంది. అరెస్ట్ అయినా వారిలో మహారాష్ట్ర బీడ్ జిల్లా, గెవ్రాయి మండలం బెల్గావ్ గ్రామానికి చెందిన సూర్యవంశీ సంతోష్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం (కంటైనర్ డ్రైవర్) సంభాల్ జిల్లా, షాబాజు పుర్క లాన్, పాక్బారా మాన్సు ర్పూర్మాఫీ గ్రామానికి చెందిన మహమ్మద్ ఉమర్, దేబ్రత చక్రబర్తి (కలి మెల మండలం, మల్కాన్గిరి జిల్లా, (గంజాయిని రవాణా చేయడంలో సహకరిస్తున్న వ్యక్తి), నరత్తం రాయ్ (మన్యంకొండ గ్రామం, మోటు మండలం, మల్కాన్ గిరి జిల్లా ఒరిస్సా రాష్ట్రం. (గంజాయిని రావాణ చేయడంలో సహక రిస్తున్న వ్యక్తి) లు ఉన్నారు. వీరి వద్ద నుంచి 80 పాకెట్లలో ఉన్న 408.185 కేజలు, విలువ సుమారుగా రూ. 2,04,09,250 ఉంటుం దన్నారు. 2025 జనవరి నుండి ఇప్పటివరకు సుమారుగా 84 కేసులలో 33 కోట్ల 44 లక్షల రూపాయల విలువ గల 6688 కిలోల గంజాయిని జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. అంతేకాకుండా గంజాయి కేసులతో సంబంధం ఉన్న ముగ్గురు వ్యక్తులపై పీడియాక్టులను నమోదు చేసి జైలుకు తరలించడం జరిగిందన్నారు. మరో ముగ్గురికి సంబంధించిన ఆస్తులను కూడా జప్తు చేయడం జరిగిందని తెలిపారు. మరికొంత మందిపై పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు పోలీసులు జాబితాను సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఈ గంజాయిని పట్టుకోవడంలో కృషి చేసిన కొత్తగూడెం సీసీఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, సిబ్బంది, చుంచుపల్లి ఎస్సైలు రవికుమార్, ఉమ, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.


తెలంగాణ ప్రభుత్వం

పర్యవేక్షక ఇంజనీర్ వారి కార్యాలయం

నీటి పారుదల శాఖ సర్కిల్, మెదక్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నెంబర్ 18/SE/IC/MDK/2025-26, తేది: 28.02.2026.

మెదక్ జిల్లా హవేళిఘన్పూర్ మండలం, అనంతసాగర్ గ్రామం, ఊర చెరువు యొక్క అలుగుకు పడిన గండ్లను శాశ్వత పునరుద్ధరణ కొరకు తేది: 02.03.2026 నుండి 10.03.2026 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ: రూ.39.64 లక్షలు. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం www.tender.telangana.gov.in తేది: 02.03.2026 నుండి చూడగలరు.

సం/- పర్యవేక్షక ఇంజనీర్, నీటి పారుదల శాఖ సర్కిల్, మెదక్

DIPR.No.16063-PP/CL/Advt/1/2025-26, తేది: 26.02.2026




అవగాహన శిబిరంలో ట్రైనీ బీట్ అధికారులు

## రాబందుల ఆవాసం వద్ద అవగాహన శిబిరం

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** అటవి సంపద సంరక్షణలో భాగంగా రాబందుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఫారెస్ట్ బీట్ అధికారుల ట్రైనీ బ్యాచ్ క్షేత్ర పర్యటన నిర్వహించింది. పెంచికల్ పేట్ రేంజ్ పరిధిలోని రాబందుల ఆవాసంగా ప్రసిద్ధి చెందిన పాలరాపు గుట్ట ప్రాంతాన్ని గురువారం సందర్శించి, అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ పర్యటనకు కోర్స్ డైరెక్టర్ సాహు హాజరై శిక్షణార్థులతో కలిసి ఆవాస ప్రాంతాన్ని పరిశీ లించారు. రాబందుల నివాస స్థితి, వాతావరణ అనుకూలతలు, సహజ వనరుల పరిస్థితులపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్ఓ జగన్మోహన్ గౌడ్ శిక్షణ బీట్ అధికారులకు రాబందుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పర్యావరణ సమతుల్యంలో రాబందుల పాత్ర ఎంత కీలకమో వివరించారు. ఇటీవల కాలంలో రాబందులు అంతరించిపోతున్న కారణాలు, వాటి సంఖ్య తగ్గుదలకు దారి తీసిన అంశాలు, సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు. రాబందుల సంరక్షణపై ట్రైన్ అధికారులకు ప్రత్యక్ష అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో అటవీ సంరక్షణ మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయం వ్యక్తం అయింది.


pnb Housing Finance Limited Ghar Ki Baat

అనుబంధం-IV-A - స్థిరాస్తి/ల యొక్క ఇ-వేలం బహిరంగ విక్రయ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 యందు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6)కు ప్రొవిజో తో చదువబడు ... [illegible]

రిజిస్టర్డ్ కార్యాలయం: 9వ అంతస్తు, అంతరిక్ష భవన్, 22 కస్తూర్బా గాంధీ మార్గ్, న్యూఢిల్లీ-110001, ఫోన్: 011-23357171, 23357172, 23705414, వెబ్: www.pnbhousing.com

B.O. ఉప్పల్: ఫ్లాట్ నం.214, ఆర్‌టిసి బస్ డిపో ఎదురుగా, బుద్ధ నగర్ కాలనీ, పి ఉప్పల్, బుద్ధ నగర్, హైదరాబాద్, తెలంగాణ-500039., B.O. విజయవాడ: 39-3-1, 2వ అంతస్తు, అంజనేయులు జ్యూయలర్స్ పైన, ఎంజి రోడ్, విజయవాడ-520010. B.O. బంజారాహిల్స్ : వివి రాజా భవన్, 1వ అంతస్తు, డోర్ నం.8-2-269/4/సి & డి, రోడ్ నం.2, బంజారాహిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500034. B.O. కూకట్‌పల్లి: ఎంసిహెచ్ నం.15-24-173, రోడ్ నం.1, కెపిహెచ్‌బి కాలనీ, 2వ అంతస్తు, కూకట్‌పల్లి, హైదరాబాద్-500072

[illegible] ... M/s. PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ... www.pnbhousing.com చూడవచ్చును.

| రుణం నెం./రుణగ్రహీత పేరు/ సహ-రుణగ్రహీత/హామీదారు/చట్టబద్ధ వారసులు (A) | డిమాండ్ మొత్తం & తేది (B) | స్వాధీనత యొక్క స్వభావం (C) | తనఖాపెట్టబడిన ఆస్తుల వివరణ (D) | రిజర్వు ధర (RP) (E) | బయానా (RP యొక్క 10%) (F) | బిడ్ సమర్పణకు చివరి తేది (G) | బిడ్ ఇంక్రిమెంట్ రేటు (H) | ఇన్‌స్పెక్షన్ తేది మరియు సమయం (I) | వేలం తేది మరియు సమయం (J) | తెలిసిన అభ్యంతరాలు (K) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| HOU/UPL/0624/1266079 పొనెకంటి రాజశేఖర్/ఆకుల మహాలక్ష్మి B.O: ఉప్పల్ | రూ. 42,83,845.46 & 07.05.2025 | సింబాలిక్‌గా స్వాధీనం | ... 1వ అంతస్తు, 103.0, ... 34బి, ... గ్రామం, గండిపోచంపల్లి, 12, 13 నుండి 22,23, 24,25,26,33,34, హైదరాబాద్, తెలంగాణ-500080, ఇండియా | రూ. 4,133,000 | రూ. 4,13,300 | 30.03.2026 | రూ. 10,000 | 10.03.2026 ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. | 31.03.2026 మ.01.00 గం. నుండి మ.2.00 గం. | తెలియదు |
| NHL/HYD/0321/871347 కెవివి సత్యనారాయణ మూర్తి/కెఎస్‌వి భార్గవ్ సాయివాన్/శ్రీ సిద్ధి కళ్యాణ్ గార్డెన్ B.O: బంజారాహిల్స్ | రూ. 51,80,222.90 & 09.09.2025 | సింబాలిక్‌గా స్వాధీనం | ఫ్లాట్ నం.303 మరియు 304, ప్లాట్ నం.8&9, 5-6-48&5-6-48/1, సర్వే నం.150, ... రెసిడెన్సీ, దయాగూడ, కూకట్‌పల్లి, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా-500072 | రూ. 68,36,000 | రూ. 6,83,600 | 30.03.2026 | రూ. 20,000 | 10.03.2026 ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. | 31.03.2026 మ.01.00 గం. నుండి మ.2.00 గం. | తెలియదు |
| HOU/HYDK/0821/907426 శంకరరావు జి/శిరీషా రాయన B.O: కూకట్‌పల్లి | రూ. 50,06,324.30 & 12.05.2025 | భౌతికంగా స్వాధీనం | ఫ్లాట్ నం.507, 5వ ఎఫ్ఎల్ఆర్, ఆక్షయ ఫార్చ్యూన్ హైట్స్, సర్వే నం.166/4, బౌరంపేట, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మేడ్చల్, తెలంగాణ-500090, కెవి రంగారెడ్డి, ఇండియా | రూ. 47,97,000 | రూ. 4,79,700 | 30.03.2026 | రూ. 10,000 | 10.03.2026 ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. | 31.03.2026 మ.01.00 గం. నుండి మ.2.00 గం. | తెలియదు |
| NHL/HYD/0324/1238840/ HOU/HYD/0721/897631 తడకమల్ల కాశీనాథ్/పుష్పలత తడకమల్ల/రోహిత్ చంద్ర తడకమల్ల/ శ్రీ నటరాజ్ ట్రేడింగ్ కో B.O: బంజారాహిల్స్ | రూ. 1,91,57,381.20 & 08.11.2024 | భౌతికంగా స్వాధీనం | ఫ్లాట్ నం.4ఎ, 4వ ఎఫ్ఎల్ఆర్, ప్లాట్ నం.76 77 80 81, సర్వే నం.32, శ్రీనిధి గ్రాండ్, గుట్టల బేగంపేట్, గ్రామం శేరిలింగంపల్లి, హైదరాబాద్, తెలంగాణ-509311, హైదరాబాద్, ఇండియా | రూ. 1,63,38,000 | రూ. 16,33,800 | 16.03.2026 | రూ. 1 లక్ష | 04.03.2026 ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. | 17.03.2026 మ.01.00 గం. నుండి మ.2.00 గం. | తెలియదు |
| HOU/VJWD/1023/1176404 SKGM షరీఫ్/అతియా ఉన్నీసా/ఎలిమెంట్ ఇ7 రెస్టారెంట్ మరియు బార్/సలాం భాయ్ బిర్యాని B.O: విజయవాడ | రూ. 2,85,50,328 & 10.02.2025 | సింబాలిక్‌గా స్వాధీనం | Ptin నం.1010403168, మునిసిపల్ నం. 4/7/19/6 గల ఇల్లు, పాత నం.7/19/6 గ్రౌండ్, 1వ, 2వ అంతస్తులు, ఉప్పల్, రాఘవేంద్ర నగర్, ... మల్కాజ్‌గిరి, కెవి రంగారెడ్డి, తెలంగాణ, ఇండియా-500076 | రూ. 3,49,74,000 | రూ. 34,97,400 | 16.03.2026 | రూ. 2 లక్షలు | 04.03.2026 ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. | 17.03.2026 మ.01.00 గం. నుండి మ.2.00 గం. | తెలియదు |

* దీనికి తదుపరి వడ్డీ @ 18% P.A. వర్తించే తగు వ్యయములు, ఇన్సిడెంటల్ ఖర్చులు, ధర, ఛార్జీలు మొదలగు ... [illegible]

ప్రదేశము: హైదరాబాద్, తేది: 27.02.2026 సం/- అధీకృత అధికారి, PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

వార్త

ప్రపంచం తాలూకు రహస్యాల్ని అర్థం చేసుకోవాలంటే దీర్ఘకాలం పాటు శిక్షణాభ్యసనం సాగించాలి.

-అలివర్ గోల్డ్‌స్మిత్

# పౌష్టికాహార లేమిలో భారతావని!

ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, మరెన్ని లక్షల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని వెచ్చించినా, వెచ్చిస్తున్నా ప్రజలను పౌష్టికాహార లోపంనుండి గట్టెక్కించలేకపోతున్నారు. ఇప్పటికే దేశంలో కోట్లాది మంది పౌష్టికాహార లోపంతో రకరకాల సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రపంచ జనాభాలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న బాలల్లో ఇరవైఐదు శాతంపైగా భారతావనిలోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదికలు ఏనాటి నుంచో ఘోషిస్తున్నాయి. ఐదు సంవత్సరాల లోపు పిల్లల్లో దాదాపు నలభై శాతం మంది తక్కువ బరువుతో పుడుతున్నారని, వారిలో దాదాపు ఆరేడు శాతం మంది పిల్లలు పుట్టిన ఐదేళ్లలోపు మరణిస్తున్నారని ఎన్నో నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ భూమ్మీద పుట్టిన వారు ఎవరికైనా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటిది కన్నులైనా సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన ఆహారం అందక చనిపోతే దానికి బాధ్యత వహించాల్సింది పాలకపెద్దలే. తల్లీబిడ్డకు పోషకాహారం అందివ్వలేకపోవడం పాలకుల బాధ్యతారాహిత్యం కిందకే వస్తుంది. అందుకోసం దేశవ్యాప్తంగా కొత్త పథకాలు ప్రవేశపెట్టకపోతే పోయారు. ఉన్న పథకాలను ఏ మేరకు అమలు చేస్తున్నారో అర్హులైన వారిలో ఎంత మందికి అందిస్తున్నారో అవి ఏ మేరకు వారికి అందుతున్నాయో అధ్యయనం చేయడమే కాదు, పర్యవేక్షణ కూడా అవసరం. పర్యవేక్షణాలోపం కారణంగానే తల్లీబిడ్డలకు అందాల్సిన పౌష్టికాహారం పక్కదారి పడుతున్న విషయం ఎన్నోసార్లు వెలుగు చూసినా నిర్దిష్టమైన చర్యలు లేకపోవడంతో నిరాటంకంగా కొనసాగుతున్నది. భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా పౌష్టికాహార లోపం పెచ్చరిల్లిపోతున్నదనే చెప్పొచ్చు. ఇటీవల ప్రపంచ ఆహార నివేదిక వెల్లడించిన సమాచారం ప్రకారం పౌష్టికాహార లోపంతో బాధపడేవారి సంఖ్య దాదాపు ఎనభైకోట్లకుపైగా ఉంది. 2014తో పోలిస్తే ముప్పైశాతం అధికం. భారత్‌లో పౌష్టికాహారంలో ప్రధానంగా సూక్ష్మ పోషకాహార సమస్య అధికంగా ఉంది. 2018-20 మధ్యకాలంలో ముప్పైశాతం, భారత్‌లో పదహారుశాతం పాకిస్థాన్‌లో పదిహేడు శాతం ప్రజలు పోషకాహార సమస్యను ఎదుర్కొంటున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిలో మూడోవంతు భారత్‌లోనే ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడిస్తున్నది. భారత్‌లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారు. 1975లోనే ఆరేళ్లలోపు పిల్లలు, తల్లులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ఆనాటి కేంద్ర పాలకులు సమీకృత శిశు అభివృద్ధి పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రధానమంత్రి మాతృవందన యోజన, పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకం తదితర కార్యక్రమాలెన్నో కొనసాగుతున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు పిల్లలకు కోడిగుడ్లు కూడా అందిస్తున్నారు. ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నా భారత్‌లో పోషకాహారలోపం ఎందరినో పట్టిపీడిస్తున్నది. 2022లో ప్రపంచ ఆకలి సూచీలో భారత్ 121 దేశాల్లో 107వ స్థానంలోఉంది. పౌష్టికాహార లోపం కారణంగానే ఆరోగ్యపరంగా ముఖ్యంగా మహిళలల్లో, చిన్నారుల్లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఐదేళ్లలోపు పిల్లల్లో ముప్ఫై శాతానికి పైగా వయసుకు తగిన ఎత్తు పెరగడం లేదు. మరో పంతొమ్మిది శాతం తగిన బరువు ఉండడం లేదు. ముప్పైరెండు శాతం పిల్లలు ఎదుగుదల లోపాన్ని ఎదుర్కొంటున్నారు. జార్ఖండ్, మహారాష్ట్ర, అస్సాం, గుజరాత్, తదితర రాష్ట్రాల్లో పౌష్టికాహార సమస్యలు అధికంగా ఉన్నాయి. ఇంకోవైపు పదిహేనేళ్ల బాలికల నుండి యాభై యేళ్లలోపు ఉన్న మహిళలలో దాదాపు యాభైఏడు శాతం రక్తహీనతతో బాధపడుతున్నారు. ఎనభైశాతానికి పైగా సూక్ష్మపోషకాల కొరతను ఎదుర్కొంటున్నట్లు అంతర్జాతీయ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పోషకాలు కలిగిన బియ్యాన్ని అందించే కార్యక్రమం కొనసాగుతూనే ఉన్నది. పిల్లల్లో తీవ్రంగా ఉన్న పౌష్టికాహార లోపాన్ని నియంత్రించేందుకు ఒడిశా ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని ప్రకటించి అమలు చేస్తున్నది. పథకాలు, ఉద్దేశాలు అన్ని సక్రమంగా ఉన్నా సంతృప్తికలిగే విధంగా కన్పిస్తున్నా ఆచరణకు వచ్చేసరికి చాలావరకు లోటుపాట్లతో మునిగితేలుతున్నాయి. దళారుల ప్రమేయం పెరిగిపోతున్నది. వాస్తవంగా చూసినా భారత్‌లో గత దశాబ్దకాలంగా ఆహార ధాన్యాల ఉత్పత్తులకు కొరత లేదు. రికార్డు స్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. ప్రభుత్వాలు కూడా ఉచిత పథకాల ద్వారా నిరుపేదలకు చేయూతను అందిస్తూనే ఉన్నాయి. అయినా అందరికి రెండు పూటలా ఆకలి తీర్చుకునేందుకు తిండి గింజలు అందించలేకపోతున్నారు. మరొకపక్క పాఠశాలల్లో పారిశుద్ధ్య సౌకర్యాలు లేకపోవడంవంటి కారణాలతో అంటువ్యాధులు కేంద్రాలుగామారుతున్నాయి. మరుగుదొడ్లు లేకపోవడం, కనీస పరిశుభ్రత పాటించకపోవడంతో సమస్యలు విస్తరిస్తున్నాయి. ఇక సమగ్రశిశు అభివృద్ధి పథకం కింద మతాశిశు సంరక్షణ కోసం పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీలు లక్ష్యానికి దూరంగా ఉన్నాయని 'కాగ్' ఏనాటినుంచో హెచ్చరిస్తూనే ఉంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న అవకతవకలను, పక్కదారి పడుతున్న పథకాల గూర్చి ఎప్పటికప్పుడు వివరిస్తూనే ఉన్నది. అయినా ఆ నివేదికను పట్టించుకునేవారు లేరు. ఇవి పాలకులకు తెలియంది కాదు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త పథకాలగూర్చి ఆలోచించకపోయినా ప్రస్తుతం ఉన్న పథకాల్లోని లోపాలను సవరించి పర్యవేక్షణ పెంచితే కొంతవరకైనా లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం.

# ట్రంప్‌పై అభిశంసన?

**గతంలో కూడా ఇలాగే న్యాయమూర్తులను విమర్శించినప్పుడు హద్దు దాటితే అధ్యక్షుడినైనా అరెస్టు చేస్తామంటూ హెచ్చరించిన విషయాన్ని మరచి ట్రంప్ దిగజారుడు వ్యాఖ్యలు చేయడం అమెరికా అత్యున్నత న్యాయవ్యవస్థను, చారిత్రాత్మక ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమే కాగలదు. తనకున్న అధికారాలను, చట్టాలలోని అనుకూలమైన సెక్షన్లను ఉపయోగించి, అన్నిదేశాల దిగుమతులపై 15శాతం టారిఫ్‌లు విధించి, భారత్ కూడా ఈ కోవలోకే వస్తుందని, తాము భారత్‌కు సుంకాలు చెల్లించబోమని, భారత్ మాత్రం తమకు సుంకాలను చెల్లించాలనే వితండవాదంతో ట్రంప్ ఇంకా అహం భావంప్రదర్శిస్తున్నారు. ఏదిఏమైనా ట్రంప్ పాలన అమెరికా చరిత్రలోఒక దుస్స్వప్నంగా మిగిలిపోయే అవకాశముంది.**



సుంకవల్లి సత్తిరాజు

అమెరికా న్యాయ వ్యవస్థ అధర్మంపై గర్జించింది. అన్యాయంపై తిరగబడింది. నడుస్తున్న అమెరికా అర్థరహిత టారిఫ్ చరిత్రకు అర్థవంతమైన ముగింపు నిచ్చింది. 9 మంది న్యాయమూర్తులు గల అమెరికా ధర్మాసనం 6:3 వ్యత్యాసంతో అమెరికా ప్రభుత్వం విధించిన టారిఫ్‌లు చెల్లవంటూ విస్పష్టమైన తీర్పు నిచ్చింది. సుప్రీం తీర్పు ట్రంప్ అహంకారంపై సంధించిన అస్త్రంగా భావించాలి. ట్రంప్ విధానాలు అమెరికా భవిష్యత్తుకు శరాఘాతంగా మారిన నేపథ్యంలో వెలువడిన సుప్రీం నిర్ణయాన్ని ట్రంప్ శిరోధార్యంగా భావించక తప్పదు. అయితే తాజా పరిణామాలు ట్రంప్ అహాన్ని దెబ్బతీయడంతో చేసేదేమీ లేక పైకి డాంభికం ప్రదర్శిస్తూ, సుప్రీం తీర్పును తప్పుబడుతూ, సరికొత్త టారిఫ్‌లతో మరో నాటకానికి తెరదీసి, తన అహాన్ని సంతృప్తి పరచుకోవడానికి నానా అగచాట్లు పడుతున్నారు. ఎంతో చారిత్రక నేపథ్యమున్న అమెరికా ప్రజాస్వామ్య చరిత్రకు, రాజ్యాంగ వ్యవస్థకు డోనాల్డ్ ట్రంప్ పాలన ఒక మాయని మచ్చగా మారింది. ట్రంప్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా పరిణమించింది. పరుల పొట్టగొట్టి తన దేశ ఆర్థిక సౌధానికి పునాదులు వేసుకోవాలనుకోవడం అనుచితం. ఇతర దేశాల బలహీనతలను తమకు అనుకూలంగా మలచుకుని, టారిఫ్‌లతో బెదిరించి, దారికి తెచ్చుకోవడం అత్యంత దుర్మార్గం. న్యాయమూర్తులను కూడా బెదిరించి, ఏదో సాధించాలనుకున్న ట్రంప్‌కు తీవ్ర నిరాశ ఎదురైనది. ట్రంప్ నామినేట్ చేసిన ఇరువురు న్యాయమూర్తులు కూడా టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ న్యాయాన్ని నిలబెట్టడంలో నిష్పక్షపాతంగా వ్యవహరించారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లవలన అమెరికాలో ధరలు ఆకాశాన్నంటాయి. ద్రవ్యోల్బణం వేగం పుంజుకుంది. అమెరికా ప్రజల బ్రతుకులు పెనం మీద నుంచి పొయ్యిలో పడిన చందంగా మారిపోయాయి. అమెరికాలో నిరుద్యోగం ప్రబలింది. ఈ అంశాలను పక్కన బెట్టి తాను విధించిన ప్రతీకార సుంకాల వలనే అమెరికా ఆర్థిక వ్యవస్థ బలపడిందని ట్రంప్ బుకాయించడం విడ్డూరం. భారతీయ వస్తువులపై అమెరికా 50శాతం సుంకాలు విధించగా, అందులో 25 శాతం రష్యా నుండి చమురు కొంటున్నందుకు భారత్ పై అమెరికా అదనంగా విధించినసుంకం. ఇటీవల ఇండో యు.ఎస్‌ల మధ్య కుదిరిన ట్రేడ్ డీల్‌లో రష్యా చమురు కొనుగోలు నిలిపి వేస్తామనే కారణంగా భారత్ ఎగుమతి చేసే వస్తువులపై సుంకాన్ని 18 శాతానికి తగ్గించడం జరిగింది. అయితే ఇప్పుడు వెలువడిన తీర్పు వలన భారత్‌పై 15 శాతం సుంకాలు వర్తిస్తాయని అమెరికా చెబుతున్నా, ఆఖరికి జీరో సుంకాలే భారత్‌కు వర్తించే పరిస్థితులు రావచ్చు. అయితే ఇంకా సంతకాలు కూడా జరగని ట్రేడ్‌డీల్ కు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ లో మార్పులకు భారత్ పట్టుబడుతుందా? లేక ట్రంప్ వత్తిడికి తలొగ్గి ట్రేడ్‌డీల్ యథాతథంగా కొనసాగిస్తుందా? అనే అంశం పై త్వరలోనే స్పష్టత రావచ్చు. ప్రపంచ దేశాలపై విధించిన టారిఫ్‌లపై అమెరికా న్యాయస్థానంలో వాదనలు ముగిసి తీర్పు వచ్చే తరుణంలో అమెరికాతో భారత్ హడావిడిగా ట్రేడ్ డీల్ కుదుర్చుకోవడంలో భారత్ వ్యూహాత్మక తప్పిదం చేసింది. అనేక దేశాలు ఇప్పటికే ట్రంప్‌ను లెక్కచేయకుండా, ట్రంప్ వత్తిడికి లొంగకుండా వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఇప్పటివరకు ట్రంప్ విధించిన టారిఫ్‌లు అంతిమంగా అమెరికా ప్రజలను కకావికలం చేసాయి. ట్రంప్ టారిఫ్ వ్యూహాల ఫలితంగా ఇప్పటివరకు సుమారు 175 బిలియన్ డాలర్లు అమెరికా ఖాతాలో చేరినట్టు అంచనా. ఈ మొత్తం అమెరికా రీఫండ్ చేస్తుందా? ఎవరికి రీఫండ్ చేస్తుంది? అమెరికా ప్రజలకా? దిగుమతి చేసిన దేశాలకా? కంపెనీలకా? ఒకవేళ సుంకాలను తిరిగి చెల్లిస్తే, ఇప్పటికే అప్పులతో, డాలర్ ఆధిపత్యంతో బెదిరిస్తూ నెట్టుకొస్తున్న



అమెరికా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదముంది. అమెరికా ప్రజలు దారుణ పరిస్థితుల్లోకి నెట్టబడ్డారు. ఈ డబ్బంతా తిరిగి ఇవ్వగలిగే స్థితిలో అమెరికా లేదు. ఇప్పటికే ట్రంప్ టారిఫ్‌లతో హడలెత్తిపోయిన అమెరికా ప్రజలు సుప్రీం తీర్పుతో తమపై విధించిన పన్నులను రీఫండ్ చేయాలని వాదిస్తున్నారు. పలు కార్పొరేట్ కంపెనీలు, అమెరికాలోని వివిధ రాష్ట్రాలు రీఫండ్ కోసం డిమాండ్ చేస్తున్నాయి. అయితే ట్రంప్ మాత్రం టారిఫ్‌ల భారం అమెరికా ప్రజలపై పడలేదని, అమెరికాకు తమ వస్తూత్పత్తులను ఎగుమతి చేసిన దేశాలపై మాత్రమే పడిందని చెప్పడం అతిశయోక్తిగా చెప్పక తప్పదు. తనకు వ్యతిరేకంగా తీర్పు వెలువడిన నేపథ్యంలో తీవ్రమైన భావోద్వేగంలో ట్రంప్ న్యాయమూర్తులను అభ్యంతరకరమైన, పరుష పదజాలంలో దూషించడం తగని పని. న్యాయస్థానం మీద కోపంతోట్రంప్5 నెలలపాటు అమల్లో ఉండేలా విదేశీ వస్తువులపై 15శాతం సుంకాలు విధిస్తూ హడావిడిగా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేసారు. ఈ నేపథ్యంలో భారత్ అమెరికాల మధ్య జరగవలసిన వాణిజ్య చర్చలు వాయిదా పడ్డాయి. తమకు భారత్ 15శాతం సుంకాలు చెల్లించాలని, తమకు మాత్రం జీరో సుంకాలు వర్తిస్తాయని ట్రంప్‌చెప్పడం వాణిజ్య ఒప్పందంలోనిఅన్యాయాన్ని, అసమతుల్యతను సూచిస్తున్నది. అమెరికాకు చెందిన ప్రఖ్యాత ఆర్థికవేత్త జెఫ్రీ సాచ్స్ తాజా పరిణామాల దృష్ట్యాభారత్ పాత ఒప్పందాన్ని వదిలేసి, అమెరికాతో సరికొత్త ఒప్పందం కుదుర్చుకోవాలని చేసిన సూచనను భారత్ పరిగణలోకి తీసుకోవాలి. ట్రంప్ కూడా టారిఫ్‌ల విషయంలో పట్టువిడుపు ధోరణి ప్రదర్శించడం మంచిది. ఇప్పటికే అమెరికా ప్రజలు, రిపబ్లికన్ పార్టీ ప్రతినిధులు ట్రంప్ పట్ల విసిగి వేసారి పోయారు. కొద్దినెలల్లో జరిగే యునైటెడ్ స్టేట్స్ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ చాప చుట్టేసే అవకాశముంది. రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్ సంవత్సర కాలంలోనే ప్రజల మద్దతు కోల్పోయారు. కేవలం 39 శాతం ప్రజల మద్దతు గల ట్రంప్ చరిత్రలో అత్యంత చెడ్డ వ్యక్తిగా మిగిలి పోయే అవకాశముంది. ఏదిఏమైనా ట్రంప్ పూర్తికాలం అధికారంలో కొనసాగడం దుర్లభం. ట్రంప్‌ను ఇంపీచ్ చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుత తీర్పుకేవలం అమెరికన్లకు మాత్రమే కాకుండా అమెరికాకు తమ వస్తువులు ఎగుమతి చేస్తున్న పలుప్రపంచ దేశాలకు భారీ ఊరట కలిగించిందనే చెప్పాలి. సుంకాలను విధించే హక్కు కాంగ్రెస్‌కే ఉందని, అధ్యక్షుడికి లేదని అమెరికా సుప్రీం కోర్టు పేర్కొన్న నేపథ్యంలో భారత దేశం ఈ విషయంలో ఏం చేస్తుందో చెప్పలేం. వాణిజ్యఒప్పందం పై భారత్ పునరాలోచించాలి. ఇరు పక్షాలు జీరో సుంకాలనే అమలు చేయాలి. మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా పేర్కొంటున్న భారత్‌ఈయూ దేశాల మధ్య కుదిరిన ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ వెంటనే అమలు జరగాలని, వీలైతే ఈ జూలై నుంచే అమల్లోకి రావాలని ఈయూ దేశాలు బలంగా వాంఛిస్తున్నాయి. భారత్ అమెరికాల మధ్య కుదిరిన ఇంటిరిమ్ ట్రేడ్ డీల్ పరిస్థితి దోలాయమానంగా మారింది. ప్రస్తుత పరిస్థితులను విశ్లేషిస్తున్నామని, భారత్ పేర్కొన్నా, భారత్ పై 15శాతం టారిఫ్‌లు కొనసాగుతాయని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో భారత్ ఇందుకు అంగీకరిస్తుందా?లేదా ఫ్యాక్ట్ షీట్‌లో ట్రంప్‌మరిన్ని మార్పులు చేస్తారా? వేచిచూడాలి. టారిఫ్‌ల వలన అమెరికాలో నిరుద్యోగం తగ్గిందని, స్టాక్ మార్కెట్లు దూసుకు పోతున్నాయని, సుప్రీం తీర్పు అమెరికా ప్రయోజనాలకు భంగకరమని, ఇందులో విదేశీ ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని పేర్కొంటూ, న్యాయమూర్తులను మూర్ఖులుగాను, స్వప్రయోజనాల కోసం లొంగిపోయి తీర్పు నిచ్చారని వాదించడం ట్రంప్ మూర్ఖత్వానికి పరాకాష్ట. గతంలో కూడా ఇలాగే న్యాయమూర్తులను విమర్శించినప్పుడు హద్దు దాటితే అధ్యక్షుడినైనా అరెస్టు చేస్తామంటూ హెచ్చరించిన విషయాన్ని మరచి ట్రంప్ దిగజారుడు వ్యాఖ్యలు చేయడం అమెరికా అత్యున్నత న్యాయవ్యవస్థను, చారిత్రాత్మక ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమే కాగలదు. తనకున్న అధికారాలను, చట్టాలలోని అనుకూలమైన సెక్షన్లను ఉపయోగించి, అన్నిదేశాల దిగుమతులపై 15శాతం టారిఫ్‌లు విధించి, భారత్ కూడా ఈ కోవలోకే వస్తుందని, తాము భారత్‌కు సుంకాలు చెల్లించబోమని, భారత్ మాత్రం తమకు సుంకాలను చెల్లించాలనే వితండవాదంతో ట్రంప్ ఇంకా అహం భావంప్రదర్శిస్తున్నారు. ఏదిఏమైనా ట్రంప్ పాలన అమెరికా చరిత్రలోఒక దుస్స్వప్నంగా మిగిలిపోయే అవకాశముంది. ●

> ఎప్పుడైతే బాధ్యత మొత్తం మన భుజస్కంధాలపై మోపబడుతుందో అప్పుడు మనం అత్యుత్తమంగా, అత్యున్నతంగా పనిచేస్తాం.
>
> స్వామి వివేకానంద



> పోగొట్టుకున్న ధనాన్ని తిరిగి సంపాదించుకోవచ్చు. కానీ పోగొట్టుకున్న కాలాన్నితిరిగి సంపాదించలేం. కనుక ధనం కన్నా కాలం విలువైనది.
>
> సైరన్



# ప్రజావాక్కు



### మంచి నీటి సౌకర్యం కల్పించాలి

**ఉత్తరాంధ్రలో** జిల్లాలో అతిసారంతో మూడు దినాల్లో76 కేసులు నమోదైఒకరి మరణంకూడా జరిగింది. ముఖ్యమంత్రి సత్వరఆదేశాలతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. వెంటనే పదిలక్షలు పరిహారం చెల్లించారు. ఈ చర్య ఎంతో విలువైనది. పట్టణంలోని కొన్ని వీధులలో పైపుల ద్వారా నీరు వస్తుంది. కానీ ఆ పైపుల బిగింపు వేరుగా ఊడిపోవడం, లేక పైప్‌లైన్ పగలడం వల్ల మురికి నీరు మంచి నీటి పైపుల్లోకి వెళుతుంది. దీంతో త్రాగే నీరు పరిశుభ్రత ఉండదు. వీటిని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగాలు వెంటనే రిపేర్లు చేయించాలి. గమనించిన ప్రజలు కూడా స్థానిక కార్యాలయానికి తెలియజేయాలి. అందరూ సహకరిస్తే సమస్య ఇంత మందికి ఒకేసారి రాదు.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### నైతిక విలువలపై అవగాహన కల్పించాలి

**ప్రతిరోజు** ప్రతి విద్యా సంస్థలలో ప్రార్థన సమయంలో విద్యార్థులకు ఒక ముఖ్యమైన విషయం గురించి అవగాహన కల్పించాలి. విజ్ఞానం, పోటీపరీక్షలు, జనరల్ నాలెడ్జి, ఉన్నత విద్యా అవకాశాలు, ఆర్థిక సామాజిక రాజకీయ అంశాలు, నైతిక విలువలపై అవగాహన కల్పించాలి. నేటి విద్యార్థులను భవిష్యత్తులో భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడానికి గాను విద్యార్థులకు ఆసక్తి అభిరుచి కలిగే విధంగా ప్రతిరోజు ప్రార్థన సమయంలో ఒక లెక్చరర్ టీచర్ టాక్‌గా ప్రతిరోజు బోధించాలి. ప్రతిరోజు టీచర్ టాక్‌లో మాట్లాడే వారిని ప్రోత్సహించే విధంగా ప్రిన్సిపాల్ ఇతర సిబ్బంది సన్మానించి గౌరవించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### కాలుష్య నియంత్రణ చేపట్టాలి

**దేశ రాజధాని** ఢిల్లీలో కాలుష్యం ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంది. ప్రభుత్వం ఎన్ని వాయుకాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టినా తగ్గినట్టుతగ్గి మళ్లీ పెరుగుతుంది. ఢిల్లీలో మాత్రమే కాకుండా ఇప్పుడు ముంబయిలో కూడా వాయుకాలుష్యం విపరీతంగాపెరుగుతుంది. దీనిని నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలుచేపట్టాలి. ప్రస్తుత పరిస్థితుల్లో గాలిలోకిప్రవేశించి వాతావరణాన్ని కలుషితం చేసే పొగలు చాలా ప్రమాదం.

- బి.రాజేశ్వర్, హైదరాబాద్

### మందుల ధరలు తగ్గించాలి

**రోగం** మనిషిని శారీరకంగా మాత్రమేకాకుండా ఆర్థికంగా కూడా దెబ్బతీస్తుంది. ఆ బలహీనతనేలాభంగా మార్చుకునే వ్యవస్థలు ఉన్నంతకాలం ఆరోగ్యం అనే భావన మాటలకే పరిమితం అవుతుంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఔషధవ్యాపారంలో అక్రమ లాభాల వ్యవహారం కొన్ని మందులపై వెయ్యి ఎనిమిది వందల శాతం వరకు లాభం వసూలు చేస్తున్నారన్న వాస్తవం మన ఆరోగ్య వ్యవస్థలోని దోపిడీని బయటపెట్టింది. ఔషధ ధరల నియంత్రణకు చట్టాలున్నప్పటికీ అవి ప్రజలరక్షణకు సరిపడేలా అమలవడం లేదు. ధరల నియంత్రణ, లాభాల పరిమితి, పంపిణీ పర్యవేక్షణ అన్నీకాగితాలకే పరిమితమయ్యాయి. తయారీదారుడి నుంచి చిల్లర విక్రేత వరకు ప్రతి దశలో లాభాలు పెంచుకుంటూ చివరికి రోగి జేబుపై భారాన్ని మోపుతున్నారు. మందు అనేది ఎంపికకాదు, అది ప్రాణాలతో ముడిపడి ఉంటుంది. ఆ అవసరాన్ని ఆసరాగా చేసుకుని ధరలు పెంచడం మానవీయంగా ఘోరమైన నేరం.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### గ్రామీణ రోడ్లను బాగు చేయాలి

**గ్రామీణ** రోడ్లుగుంతలమయంగా మారి, కంకరతేలి ప్రమాదాలు జరిగే విధంగా తయారయ్యాయి. అదే విధంగా రోడ్ల వెంట కంపచెట్లు పెరిగి వాహనదారులు గాయపడేవిధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాలలో ప్రమాదకరంగా దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలి. కనీసం గుంతలలో మట్టినైనా నింపి వాహన దారులు ప్రమాదాలకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలి. వర్షాకాలం నాటికి రోడ్లు బాగుపడితే మంచిది. లేకుంటే ప్రజలు ఇంకా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. కనుక రోడ్లను వెంటనే బాగు చేయాలి.

-టి. యోగేందర్, నల్గొండ జిల్లా

### పేదలకు చేయూతనివ్వాలి

**పేద ముస్లింలను** ప్రభుత్వం ఆదుకోవాలి. చాలామంది ముస్లింలకు రెక్కాడితేకానీ డొక్కాడని పరిస్థితి ఉంది. చాలా మంది ముస్లింలు ఇంటి నుంచి బయటికి వెళ్లితే కానీ ఇల్లు గడవని పరిస్థితి ఉంది. చాలామంది చిరువ్యాపారాలు చేసుకుంటున్నారు. అలాంటి వారికి బ్యాంకురుణాలు మంజూరు చేస్తేచేయూత లభిస్తుంది. ఇప్పటివరకు చాలా మంది ముస్లింలకు సొంత ఇల్లు లేదు. అలాంటి వారిపైప్రత్యేక దృష్టిని పెట్టాలి.

-షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

# ఇ ఓటింగ్.. ఒక విప్లవాత్మక అడుగు

ఎక్కులూరి నాగార్జున్ రెడ్డి

భారతీయ ప్రజాస్వామ్యంలో కీలక ఘట్టమైన ఎన్నికల ప్రక్రియను డిజిటల్ యుగానికి అనుగుణంగా మార్చడంలో బీహార్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక చారిత్రాత్మక ముందడుగు వేసింది. ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026లో కృత్రిమ మేధ ఆధారిత ఇ ఓటింగ్ వ్యవస్థను ప్రదర్శించి దేశవ్యాప్త చర్చనీయాంశం చేసిన ఈ మోడల్, ఇప్పటికే మున్సిపల్ ఉపఎన్నికల్లో విజయవంతంగా అమలు చేసి, రాబోయే శాసనసభ ఎన్నికలకు విస్తరించాలని సిద్ధమవుతోంది. ఇది విజయవంతమైతే ఇతర రాష్ట్రాలు కూడా ఈ మార్గం అనుసరించడం ఖాయం. ఇది కేవలం సాంకేతిక ఆవిష్కరణ కాదు, ప్రజాస్వామ్యాన్ని మరింత సమగ్రం, సమానం, సులభం చేసే సామాజిక న్యాయం. ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలో ఓటు వేయాలనే కోరిక ఉన్నప్పటికీ అనివార్య పరిస్థితులు అడ్డుకుంటున్నాయి. వలస కార్మికులు, దూరప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు, వృద్ధులు, గర్భిణులు, వికలాంగులు - ఈ వర్గాలు పోలింగ్ బూత్‌లకు చేరుకోవడం కష్టం. ఫలితంగా పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తగ్గుతోంది. భౌతిక పరిమితులు ప్రజాస్వామ్యానికి ఆటంకం కాకూడదని బీహార్ ఎన్నికల సంఘం గుర్తించి, స్మార్ట్‌ఫోన్ ఆధారిత ప్రత్యేక యాప్ ద్వారా ఇంటి నుంచే ఓటు వేసే సౌలభ్యం కల్పించింది. ఇది డిజిటల్ ఇండియా దృష్టికోణానికి పూర్తిగా అనుగుణమైన అడుగు. ఓటు హక్కును జీవన వాస్తవాలకు అనుగుణంగా మార్చడం ద్వారా ప్రతి పౌరుడి భాగస్వామ్యాన్ని నిజం చేస్తుంది. ఈ వ్యవస్థ ఆధార్ లింక్‌కు బదులు ఎలక్షన్ ఫోటో ఐడెంటిటీ కార్డు (ఎపిక్) డేటాబేస్‌ను ఉపయోగించడం గోప్యతను కాపాడుతుంది. ఫేషియల్ రికగ్నిషన్, లైవ్‌నెస్ డిటెక్షన్, డివైస్‌లెవల్ వెరిఫికేషన్, బ్లాక్‌చెయిన్ ఆధారిత ఎన్‌క్రిప్షన్ - ఈ బహుళస్థాయి రక్షణ వ్యవస్థ నకిలీ ఓట్లకు అవకాశం ఇవ్వదు. ప్రతి ఓటు ఎన్‌క్రిప్ట్ అయి బ్లాక్‌చెయిన్‌లో రికార్డ్ అవుతుంది. కాబట్టి దాన్ని మార్చడం లేదా తొలగించడం అసాధ్యం. స్మార్ట్ కాంట్రాక్ట్స్ ఈవీఎం మాదిరిగా ఓట్ల




లెక్కింపును స్వయం చాలకంగా చేస్తాయి. ఎన్నికల అధికారి డిజిటల్ సిగ్నేచర్, టూఫ్యాక్టర్ అథెంటికేషన్, హ్యాష్ వెరిఫికేషన్ లేకుండా డీక్రిప్షన్ సాధ్యం కాదు. ఏఐ ఆధారిత ఓసీఆర్ లెక్కింపు వ్యవస్థ మానవ తప్పిదాలను తగ్గించి, ఫలితాలను సత్వరం వెలువరిస్తుంది. వీడియో రికార్డులు, ఆడిట్ లాగ్స్ ద్వారా ఏ దశలోనైనా ధ్రువీకరణ సాధ్యం. ఇలాంటి బహుళ రక్షణలు ఇ ఓటింగ్‌ను నమ్మదగినదిగా, పారదర్శకంగా చేస్తాయి. అయితే, ఏ వినూత్న వ్యవస్థ అయినా సవాళ్లు లేకుండా ఉండదు. డిజిటల్ లిటరసీ తక్కువగా ఉన్న బీహార్‌లో వృద్ధులు, తొలిసారి ఓటు వేసేవారికి యాప్ వినియోగం కష్టం కావచ్చు. పాత ఎపిక్ ఫోటోలు, మసక వెలుతురు, లోరెజల్యూషన్ కెమెరాలు, ఇంటర్నెట్ అంతరాయాలు ధ్రువీకరణలో అడ్డంకులు కలిగించవచ్చు. రిటర్నింగ్ అధికారులకు డీఎస్‌సీ టోకెన్లు, బ్యాలెట్ అన్‌లాక్ వంటి వాటిపై ప్రత్యేక శిక్షణ అవసరం. గోప్యత, పారదర్శకతపై రాజకీయ నాయకుల నుంచి వ్యతిరేకత రావచ్చు. కానీ బీహార్ ఎన్నికల సంఘం నమూనా ఓటింగ్, పబ్లిక్ డెమోల ద్వారా నమ్మకం సంపాదించడం చాలా సరైన వ్యూహం. ఈ సవాళ్లను అధిగమించడం ద్వారా ఈ వ్యవస్థ మరింత బలపడుతుంది. బీహార్ ఈ చొరవతో దేశ ఎన్నికల చరిత్రలో కొత్త అధ్యాయం రాస్తోంది. ఇది విజయవంతమైతే ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగి, నిజమైన ప్రజాసమ్మతి ప్రతిబింబిస్తుంది. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఈ మోడల్‌ను జాతీయ స్థాయిలో అధ్యయనం చేసి, ఎన్‌ఆర్‌ఐలు, వలస కార్మికులకు విస్తరించాలి. హైబ్రిడ్ మోడల్ (రిమోట్ + బూత్), నిరంతర సైబర్ ఆడిట్స్, సమగ్ర అవగాహన కార్యక్రమాలు చాలా అవసరం. డిజిటల్ ప్రజాస్వామ్యం కేవలం సాంకేతికత కాదు, అది ప్రతి పౌరుడి ఓటు హక్కును నిజం చేసే సామాజిక బాధ్యత. బీహార్ చూపిన మార్గం భారతదేశం మొత్తం అనుసరించాల్సిన మార్గం. జాగ్రత్తగా, పారదర్శకంగా అమలు చేస్తే ఇఓటింగ్ నిజమైన గేమ్ ఛేంజర్ కానుంది. ఈ అడుగు భారత ప్రజాస్వామ్యాన్ని 21వ శతాబ్దపు డిజిటల్ యుగానికి తీసుకెళ్లే చారిత్రక మైలురాయి అవుతుంది. ●

# పశు సంపద పెంచితేనే.. స్వచ్ఛమైన పాలు

మిద్దె సురేష్

ప్రస్తుతం ప్రచారంలో ఉన్న వార్త కల్తీ పాలు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మదిలో మెదులుతున్న సందేహం పిల్లలు త్రాగే పాల మొదలు ఇంట్లో వంటకు వాడే పదార్థాల వరకు కల్తీనే అని చెప్పవచ్చు. పెద్ద పెద్ద హోటల్స్ కూడా ప్రామాణికాలు పాటించడం లేదని ఫుడ్ కమీషన్ వారే తెలిపారు. మనం తీసుకునే ఆహార పదార్థాల నుండి ఆరోగ్యానికై వేసుకునే మందుల వరకు కల్తీ దీంట్లో ఇప్పుడు ప్రధానమైన అంశం కల్తీ పాలు. వివిధ రసాయనాలతో నాసిరకం పదార్థాలతో పాలు తయారు చేస్తున్నారని ఆరోపణ, దాంట్లో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో కల్తీ పాలు తాగి ఆస్పత్రి పాలు అయిన చిన్నారుల, పెద్దల పరిస్థితి చూస్తూనే ఉన్నాం. అనారోగ్యులు శక్తి కోసం పాలు తీసుకుంటారు, ఆ పాలలో కూడా నాణ్యత లేదు అంటే వారి ఆరోగ్య పరిస్థితి ఏంటో మనమే అర్థం చేసుకోవాలి. పెరిగిన ప్రపంచీకరణలో అంతరించిపోతున్న పశు సంపద పెరుగుతున్న జనాభాకు సరిపోను మంచి పాలు అందడం లేదు. వీటిలో స్వచ్ఛమైన పాలు ఏవో కల్తీ ఏవో తెలియకా కల్తీ పాలు త్రాగి అనేక రోగాల బారిన పడుతున్నారు. స్వచ్ఛమైన గేదే పాలు చూద్దామన్న కనిపించడం లేదు. దాదాపు రెండు దశాబ్దాల క్రింతం గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద వ్యవసాయంతో తులతూగుతూ రైతులకు ఆర్థిక ఆదాయంతో వెన్నుదన్నుగా నిలిచింది. క్రమంగా పెరిగి ప్రపంచీకరణలో వ్యవసాయ భూమి తగ్గడంతో పాటు వ్యవసాయం చేసే వారు కూడా తగ్గుతున్నారు. రైతులకు జీవనాధారమైన వ్యవసాయం భూమిని నమ్ముకొని సాగు చేసిన అధిక దిగుబడి రాక తప్పని పరిస్థితులలో అనేక రసాయన ఎరువులు వాడుతున్నారు, ఇలా వాడకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సేంద్రియ ఎరువులు రైతులకు అందుబాటులోకి తీసుకు వచ్చి వాటిపై అవగాహన కల్పించాలి. రసాయనాలతో పండించిన పంటలో నాణ్యతతో పాటు రుచిని కూడా కోల్పోతుంది. ప్రస్తుత సమాజంలో కొంత మందికి వ్యవసాయ భూమి ఉన్న వ్యవసాయం చేయడానికి నామోషిగా భావిస్తూ ఉద్యోగాలకై పట్టణ ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు కానీ భవిష్యత్తు కాలంలో వ్యవసాయానికి ప్రాధాన్యత పెరుగుతుంది. దాంట్లో ముఖ్యంగా సేంద్రియ వ్యవసాయానికి డిమాండ్ పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే ఇప్పటికీ సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన కూరగాయలు, పంటకు అధిక ప్రాధా



న్యత ఇస్తున్నారు ప్రజలు. భవిష్యత్తు కాలంలో కూడా రసాయనాలు లేకుండా పండించిన పంటకు మంచి ఆధారణ ఉంటుంది. సేంద్రియ వ్యవసాయం పెరుగుతే పశు సంపద కూడా పెరుగుతుంది. ఎందుకంటే వ్యవసాయానికి పశు సంపదకు అవినాభావ సంబంధం ఉంటుంది. పశు సంపదను ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు రైతులకు రాయితీలు ఇస్తున్న సద్వినియోగం చేసుకోవడము లేదు. భవిష్యత్తుతరం యువ రైతులదే కాబట్టి వారు సంపూర్ణ అక్షరాస్యులు. వారికి పరిజ్ఞానంతో అభివృద్ధి గడించాలని కోరుకుంటూ, రైతులు నష్టపోకుండా సేంద్రియ వ్యవసాయం, పశు సంపదను పెంచుతూపోతే లాభాల బాటలో ముందుకుపోయే అవకాశం ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్లాస్టిక్‌ను రసాయనాలను అదుపు చేయాలని చెప్పుతునే సేంద్రియ వ్యవసాయానికి పెద్దపీట వేస్తుంది, అదే విధంగా వ్యవసాయం చేయడానికి ముందుకు వస్తున్న యువతకు ప్రభుత్వాలు వెన్నుదన్నుగా నిలబడితే భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన పాలు ఆహార పదార్థాలు అందించవచ్చు. పాడిరైతులకు అనేక రాయితీలు, సంక్షేమం ప్రభుత్వం అందిస్తున్న వాటిపై అవగాహన లేక ఉపయోగించుకోవడం లేదు. రైతులకు రాయితీ సంక్షేమం చేరువ చేసే బాధ్యత సంబంధించిన వ్యవసాయ అధికారులపైనే ఉంది. ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలో రైతు సదస్సులు నిర్వహించాలి. పశు సంపద పెంపుదలకు లక్ష్యంతో పని చేయాలి ప్రభుత్వాలు. కల్తీని నియంత్రిస్తేనే నిజమైన పాడి. రైతులకు న్యాయం కూడా జరుగుతుంది. ప్రజా ఆరోగ్యం కుదట పడుతుంది. వ్యవసాయం లాభదాయకమైనప్పుడు వ్యవసాయ ఉత్పత్తులను చేయడానికి యువతరం ముందుకు వస్తుంది. కల్తీపాలతోపాటు కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసే వారిపై కఠినమైన చర్యలు తీసుకునే విధంగా కొత్త చట్టాలు తీసుకువచ్చినప్పుడే ప్రజలకు నాణ్యమైన పోషకాహారం అందించగలం. ప్రపంచంలో 33 శాతం పశు సంపద భారత దేశంలో ఉన్న ప్రజలందరికి సహజమైన పాలు దొరకటం లేదు. యాంత్రిక పెరుగుదల వల్ల సాంప్రదాయ పశు సంపద, వ్యవసాయం క్రమంగా పల్లె ప్రాంతాలలో మందగిస్తుందని చెప్పాలి. వ్యవసాయ ఆధారిత ప్రాంతాలైన ఆంధ్ర, తెలంగాణలో కూడా స్వచ్ఛమైన పాలకొరత ఉందని చెప్పడానికి ప్రస్తుత సంఘటనలే నిదర్శనం. గేదే పాలు సాధారణమైన ధర ఉన్న ఆవు, మేక, గొర్రె పాలకు విపరీతమైన డిమాండ్ ఉంది, అందుకే పాడి పంటల వైపు యువత రావాలి. భవిష్యత్తులో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు పశు, వ్యవసాయంతో విరివియాలని ఆశిద్దాం. ●

**మన వి** ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# ఇన్‌స్టాలో మోడీ ఫాలోవర్లు 10 కోట్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించారు. 100 మిలియన్ల (10 కోట్లు) ఫాలోవర్ల మైలు రాయిని దాటిన తొలి ప్రపంచ నేతగా ఆయన చరిత్రకెక్కారు. 2014లో ఇన్‌స్టాగ్రామ్ లో చేరిన మోదీ, దశాబ్ద కాలంలో ఈ అరుదైన ఘనతను సాధించడం విశేషం. ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాధినేతలతో పోలిస్తే ప్రధాని మోదీ ఫాలోవర్ల సంఖ్య అత్యధికంగా ఉంది. రెండో స్థానంలో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (43.2 మిలియన్లు) కంటే మోదీకి రెట్టింపునకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. తర్వాతి ఐదుగురు

## ప్రపంచ రికార్డు సృష్టించిన భారత ప్రధాని

ప్రపంచ నేతల ఫాలోవర్ల సంఖ్యను కలిపినా కూడా మోదీ సంఖ్యను అందుకోలేకపోవడం గమనార్హం. ఈ జాబితాలో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో (15 మిలియన్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూలా (14.4 మిలియన్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. దేశీయంగా కూడా ఇతర రాజకీయ నాయకుల కంటే మోదీ చాలా ముందంజలో ఉన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్య మంత్రి యోగి ఆదిత్యనాథ్ సుమారు 16.1 మిలి



యన్ల ఫాలోవర్లతో రెండో స్థానంలో ఉండగా, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 12.6 మిలియన్లతో మూడో స్థానంలో కొనసాగుతున్నారు. ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలోనూ మోదీకి భారీ ఫాలోయింగ్ ఉంది. ఎక్స్ (ట్విట్టర్)లో ఆయనకు 106.2 మిలియన్ల మంది, ఫేస్‌బుక్‌లో 54 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. సోషల్ మీడియా లోనే కాకుండా, ప్రపంచ నేతల ఆమోద రేటింగుల్లోనూ మోదీ అగ్రస్థానంలో నిలుస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి ఆరంభంలో అమెరికాకు చెందిన మార్నింగ్ కన్సల్ట్ సంస్థ నిర్వహించిన సర్వేలో మోదీ 67 శాతం అప్రూవల్ రేటింగ్‌తో మొదటి స్థానంలో నిలిచారు. ఇదే సర్వేలో ట్రంప్ 40 శాతం రేటింగ్‌తో 11వ స్థానంలో ఉన్నారు.



# ట్రంప్‌కు షాక్

## అక్రమ వసలదారుల తరలింపు అక్రమం

## తప్పుపట్టిన ఫెడరల్ కోర్టు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరో ఎదురుదెబ్బ తగిలింది. అక్రమ వలసదారులను ఇతర దేశాలకు తరలించడాన్ని అక్కడి ఫెడరల్ కోర్టు తప్పుబట్టింది. ట్రంప్ కార్యవర్గం నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ మసాచుసెట్స్‌లోని యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి బ్రియాన్ మర్ఫీ ఈ మేరకు తీర్పునిచ్చారు. అధికారం చేపట్టినప్పటి నుంచి అక్రమ వలసదారులపై ట్రంప్ కొరడా ఝుళిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వలసదారులను యుఎస్ నుంచి గ్వాటమాల, దక్షిణ సూడాన్, కోస్టారికా వంటి ఇతర దేశాలకు తరలించారు. తరలింపు ఎదుర్కొంటున్న వలసదారులు దీనిపై కోర్టులో దావా వేయగా, తాజాగా న్యాయస్థానంలో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా అక్రమ వలసదారులకు ముందస్తు నోటీసులు, తగిన సమయం ఇవ్వకుండా వారికి సంబంధం లేని వేరే దేశాలకు తరలించడం చట్టవిరుద్ధమని తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ట్రంప్ యంత్రాంగానికి 15 రోజుల పాటు సమయం ఇచ్చింది.

# కాలపరీక్షను తట్టుకొన్న భారత్-ఇజ్రాయెల్ బంధం

## ఇరుదేశాల మధ్య పలు అవగాహన ఒప్పందాలు

## ఇక ఇజ్రాయెల్‌లో కూడా యుపిఐ సేవలకు ఎంఒయు

**జెరూసలెం, ఫిబ్రవరి 26:** భారత్ ఇజ్రాయెల్ మధ్య సంబంధాలు సవాళ్లను తట్టుకుని కాలపరీక్షకు నిలిచాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. పరస్పర విశ్వాసం, ప్రజాస్వామ్య విలువలపై ఏర్పడిన ఈ బంధం ఎంతో బలమైనదని పేర్కొన్నారు. ఇరు దేశాల భాగస్వామ్యాన్ని శాంతి, ఆవిష్కరణ, శ్రేయస్సు కోసం ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచుతూ చారిత్రక నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. జెరూసలేంలో గురువారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహుతో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోడీ మాట్లాడారు. ఇరుదేశాల మధ్య పలు కీలక అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) జరిగాయి. కృత్రిమ మేధ, క్వాంటం, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లో సహకారాన్ని వేగవంతం చేసేందుకు క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ పార్ట్‌నర్‌షిప్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్‌లో యూపీఐ సేవలను వినియోగించేందుకు ఒప్పందం కుదరడం సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయ రంగంలో సహకారానికి సుదీర్ఘ చరిత్ర ఉందని, దీన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు ప్రధాని చెప్పారు. ఇజ్రాయెల్ సహకారంతో భారత్‌లో ఏర్పాటు చేసిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ విజయవంతం కావడంతో వాటి సంఖ్యను 100కు పెంచుతామన్నారు. స్వేచ్ఛా



వాణిజ్య ఒప్పందానికి తుది రూపు ఇస్తామని పేర్కొన్నారు. మొత్తంగా 27 రంగాల్లో పరస్పర సహకారం అందించేందుకు ఉభయదేశాలు సిద్ధం కావడం హర్షణీయ మన్నారు. ఉగ్రవాదంపై ఇరుదేశాల వైఖరి స్పష్టంగా ఉందని, దానికి ప్రపంచంలో చోటు లేదని మోదీ స్పష్టంచేశారు. గాజా శాంతి ప్రణాళిక ద్వారా శాంతికి మార్గం ఏర్పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇచ్చిందని పునరుద్ఘాటించారు. తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ ఇజ్రాయెల్ చారిత్రక గడ్డపై అడుగుపెట్టడం గర్వంగా, భావోద్వేగంగా ఉందని మోదీ అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్ నెస్సెట్‌లో ప్రసంగించే అవకాశం కల్పించినందుకు, స్పీకర్ మెడల్‌తో సత్కరించినందుకు ఆ దేశ ప్రధాని నెతన్యాహుకు, ఇజ్రాయెల్ ప్రజలకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన చిన్నదే అయినప్పటికీ, అది అసాధారణంగా ఫలవంతమైందని, హృదయాలను కదిలించిందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. గురువారం జెరూసలేంలో చర్చల అనంతరం ఏర్పాటు చేసిన మీడియా మీట్‌లో మాట్లాడుతూ ఒక అద్భుతమైన పర్యటన. పర్యటన ముగింపు కూడా అంతే అద్భుతంగా ఉంది. నిన్న ఇజ్రాయెల్ పార్లమెంట్ నెస్సెట్‌లో మోదీ చేసిన ప్రసంగం అందరి కళ్లను చెమర్చేలా చేసిందని నెతన్యాహుఅన్నారు. ఇరు దేశాల్లోని ప్రతిభావంతుల మధ్య సహకారం గురించి చర్చించామని, వాటిని నిర్దిష్ట ప్రణాళికలుగా మారుస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా భారత్‌లో ప్రభుత్వ స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన ప్రకటించారు. భారత పర్యటనకు రావాలని ఇజ్రాయెల్‌ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ప్రధానిమోడీ ఆహ్వానించారు. ఇది ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. మోడీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం చాలా సమర్థవంతంగా పనిచేస్తోందని నెతన్యాహు కితాబిచ్చారు. ఆవిష్కరణలను అందిపుచ్చుకున్న వారికే భవిష్యత్తు ఉంటుంది. భారత్, ఇజ్రాయెల్ గర్వించదగిన ప్రాచీన నాగరికతలు భవిష్యత్తును అందిపుచ్చుకోవడానికి మేం నిశ్చయించుకున్నాం. కలిసికట్టుగా మరింత అభివృద్ధి సాధించగలమని అన్నారు. ప్రెసిషన్ అగ్రికల్చర్, ప్రెసిషన్ ఎడ్యుకేషన్ వంటి రంగాల్లో కలిసి పనిచేయడం ద్వారా ప్రతి ఒక్కరి సామర్థ్యాన్ని వెలికితీయవచ్చని నెతన్యాహు అన్నారు.

# స్వరం మార్చిన కెనడా

**ఒట్టావా, ఫిబ్రవరి 26:** జస్టిన్ ట్రూడో హయాంలో ఒడుదొడుకులకు గురైన భారత్-కెనడా సంబంధాలు మళ్లీ గాడిన పడుతున్నాయి. ప్రస్తుత ప్రధాని మార్క్ కార్నీ భారత్‌తో స్నేహానికి మొగ్గు చూపుతున్నారు. ఆయన మన దేశ పర్యటనకు రానున్నారు. ఇలాంటి సమయంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. మన ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను కెనడా అధికారులు వెనక్కి తీసుకున్నారు. రెండేళ్ల క్రితం.. కెనడా ఎన్నికల్లో విదేశీ శక్తులు జోక్యం చేసుకున్నాయంటూ అక్కడి విపక్షాలు ఆరోపించాయి. దాంతో అప్పటి ట్రూడో ప్రభుత్వం ఒక స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేసింది. ఆ క్రమంలో జరగిన దర్యాప్తులో భారత్ పేరును చేరుస్తూ కెనడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంతో రెండు దేశాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. అయితే ఈ ఆరోపణలను భారత్ ఖండించింది. ఇతర దేశాల ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకోవడం భారత్ విధానం కాదని తేల్చి చెప్పింది. అది జరిగిన కొన్ని రోజులకే ట్రూడో ఎత్తులకు షాక్ తగిలింది. కెనడా రాజకీయాల్లో భారత్ ఎలాంటి జోక్యం చేసుకోలేదని దర్యాప్తులో తేటతెల్లమైంది. 2021 నాటి ఎన్నిక




లను ప్రభావితం చేసేలా న్యూఢిల్లీ ప్రయత్నాలు చేసినట్లు తమ దృష్టికి రాలేదని కెనడాలో ఎన్నికలను పర్యవేక్షించిన ఓ సీనియర్ అధికారి కమిషన్‌కు వెల్లడించారు. ఇప్పుడు ఆ ఎన్నికల జోక్యం అంశంపైనే కార్నీ ప్రభుత్వం స్పందించింది. తమ దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో భారత్ జోక్యాన్ని తాము విశ్వసించడం లేదని కెనడా అధికారి వెల్లడించారు. అదే విశ్వసిస్తే తమ ప్రధాని భారత పర్యటనకు వెళ్లే అవకాశమే లేదన్నారు. 'ఈ అంశాలపై మేం భారత ప్రభుత్వంతో సమగ్ర చర్చలు జరిపాం. విదేశీ జోక్యాన్ని నివారించేలా మా వద్ద మెరుగైన భద్రతా చర్యలు ఉన్నాయి' అని సదరు అధికారి మీడియాతో మాట్లాడారు.

# గంగమ్మ సాక్షిగా ఒక్కటైన మెక్సికో జంట



**వారణాసి, ఫిబ్రవరి 26:** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేవాళ్లు ఈ ప్రపంచంలోని చాలా దేశాల్లో ఉన్నారు. తాజాగా రూయిజ్ కాబోల్ , గొంజాలో మిగ్వెల్ జంట సైతం ఇదే ఆలోచనతో మెక్సికోనుంచి వారణాసికి వచ్చింది. అస్సీ ఘాట్ వద్ద నీటిపై తేలుతున్న పడవలో వేదమంత్రాల నడుమ అగ్ని సాక్షిగా వివాహం చేసుకున్నారు. మెక్సికన్ సంప్రదాయానికి భిన్నంగా విన్నూత రీతిలో ఈ జంట వివాహం జరిగింది. వరుడు ధోవతి, కుర్తా వేసుకుని తలపాగా ధరించగా వధువు బనారస్ చీరలో మెరిసిపోయింది. ఆచార్య దీపక్ పాండే పెళ్లి మంత్రాలు చదివారు. దేశ విదేశీ పర్యాటకులు ఘాట్ వద్ద గుమికూడి ఈ వేడుకను ఆసక్తిగా తిలకించారు. కొత్తజంటపై పలువురు పూలవర్షం కురిపించారు.



# తొమ్మిదేళ్ల విద్యార్థిని గుండెపోటుతో మృతి

**జైపూర్, ఫిబ్రవరి 26:** రాజస్తాన్‌లోని నగౌర్ జిల్లాలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్న 9 ఏళ్ల విద్యార్థిని గుండెపోటుతో మరణించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన సోమవారం ఉదయం గోటాన్ పట్టణంలో జరిగింది. తాల్నాపూర్‌కు చెందిన అయిదో తరగతి విద్యార్థిని దివ్య బపేడియా స్కూల్ మైదానంలో ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలింది. ఉదయం స్కూల్ ప్రార్థనలు జరగడానికి ముందు తోటి విద్యార్థులతో కలిసి ఆడుతూ కనిపించిన ఆ అమ్మాయి అకస్మాత్తుగా కిందపడిపోవడం అనుమానాలకు తావుతీసింది. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ఆ బాలికను స్కూల్ సిబ్బంది తీసుకెళ్లింది. అప్పటికే ఆ చిన్నారి మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. బహుశా గుండెపోటు వల్ల ఆ అమ్మాయి మరణించి ఉంటుందని డాక్టర్లు అనుమానం వ్యక్తం చేశారు. స్కూల్ ఆవరణలో దివ్య ఆడుకుంటున్న సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు సేకరించారు. ఆడుతూనే ఆమె ఒక్కసారి కిందపడిపోయినట్లు ఆ ఫుటేజ్‌లో ఉన్నది. గతంలో ఆ విద్యార్థినికి ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని, శరీరంపై గాయాలు కూడా లేవని, ప్రాథమిక అంచనా ద్వారా కార్డియాక్ అరెస్టు జరిగినట్లు తెలుస్తోందని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఇంచార్జీ డాక్టర్ సుక్రామ్ తెలిపారు. పోస్టుమార్టమ్ నిర్వహించేందుకు నిరాకరించడంతో ఆ బాలిక మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

# ఎన్సీఇఆర్టీ పుస్తకంపై తక్షణ నిషేధం

## సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను మంటగలిపేలా పాఠ్యపుస్తకాల్లో అభ్యంతరకర అంశాలను ప్రచురించిన ఎన్‌సీఈఆర్‌టీకి సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఎనిమిదో తరగతి సామాజిక శాస్త్ర పుస్తకంలో న్యాయవ్యవస్థలోని అవినీతిపై చేర్చిన అధ్యాయాన్ని తీవ్రంగా పరిగణించిన అత్యున్నత న్యాయస్థానం ఆ పుస్తకంపై తక్షణ నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది కేవలం పొరపాటు కాదు న్యాయవ్యవస్థను కించపరిచేలా చేసిన ఉద్దేశపూర్వక కుట్ర అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అత్యంత ఘాటైన పదజాలంతో విరుచుకుపడ్డారు. ఎన్‌సీఈఆర్‌టీ ప్రయోగించిన బుల్లెట్ తో న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోంది. కోర్టుల విశిష్ట చరిత్రను వివరించాల్సింది పోయి వ్యవస్థను అణచివేసేలా పాఠాలు రాయడం సరికాదు అని మండిపడ్డారు. యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పట్ల అగౌరవం కలిగించేలా ఈ పాఠ్యాంశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులెవరో తేలేవరకు ఈ విషయాన్ని వదిలిపెట్టబోమని, జవాబుదారీతనం ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. కోర్టు ఆగ్రహాన్ని గమనించిన కేంద్ర



ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బేషరుతుగా క్షమాపణలు కోరారు. ఈ పాఠ్యాంశాన్ని ప్రభుత్వం ఏమాత్రం సమర్థించడం లేదని, పబ్లిక్ నోటీసు ద్వారా క్షమాపణలు చెబుతామని వెల్లడించారు. ఇప్పటికే వివాదాస్పద పుస్తకాల పంపిణీని నిలిపివేసి, వెబ్‌సైట్ నుంచి కూడా ఆ పాఠాలను తొలగించామని కోర్టుకు వివరించారు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీకి కోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీలు ఈ వివాదాన్ని కోర్టు దృష్టికి తీసుకురావడంతో సుప్రీంకోర్టు దీనిని సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. ఈ కేసులో తదుపరి పరిణామాలు మార్చి 11న జరిగే విచారణలో వెల్లడికానున్నాయి.

# ఆపరేషన్ సింధూర్ ఎస్-400 రిలీజ్ చేసిన ఎయిర్‌ఫోర్స్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** ఎస్400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్‌కు చెందిన లైవ్ యాక్షన్ వీడియోను గురువారం భారతీయ వైమానిక దళం విడుదల చేసింది. గత ఏడాది పాకిస్థాన్‌తో జరిగిన ఆపరేషన్ సింధూర్ సమయంలో ఎస్400 మిస్సైల్ వ్యవస్థ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. అయితే తొలిసారి ఈ క్షిపణి ఫైరింగ్‌కు చెందిన వీడియోను రిలీజ్ చేస్తున్నట్లు ఐఏఎఫ్ పేర్కొన్నది. సైనిక చరిత్రలోనే ఈ మిస్సైల్ వ్యవస్థ ఓ రికార్డును స్థాపించినట్లు పేర్కొన్నది. చాలా దూరం నుంచి గగనతలం లోనే విమానాన్ని షూట్ చేసినట్లు ఐఏఎఫ్ తన వీడియో ద్వారా వెల్లడించింది. రష్యా తయారీకి చెందిన ఎస్400 డిఫెన్స్ సిస్టమ్ ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన ఓ యుద్ధ విమానాన్ని నేల కూల్చింది. సుమారు 300 కిలోమీటర్ల దూరం లో ఉన్న టార్గెట్‌ను ఎస్400 క్షిపణి కూల్చినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ భూభాగంలో ఆ విమానాన్ని కూల్చివేసినట్లు అంచనా వేస్తున్నారు. అయితే ఆ ఘటనకు చెందిన రాడార్ దృశ్యాలను ఈ వీడియో ద్వారా రిలీజ్ చేశారు. వాస్తవానికి ఈ వీడియోలో ఉన్నది ఆపరేషన్ సింధూర్‌కు చెందిన ఒరిజినల్ మిస్సైల్ ఫుటేజ్ కాదని, కానీ వాయు శక్తి విన్యాసాల ప్రమోషన్ కోసం ఈ వీడియోను రూపొందించినట్లు తెలుస్తోంది. రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో ఫిబ్రవరి 27వ తేదీ నుంచి వాయు శక్తి విన్యాసాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రమోషనల్ వీడియోను రిలీజ్ చేశారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్‌కు చెందిన డజన్ విమానాలను కూల్చినట్లు గత అక్టోబర్‌లో ఐఏఎఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ పేర్కొన్న విషయం తెలిసిందే.

# 20యేళ్ల స్నేహానికి గుర్తుగా అరుదైన పుష్పానికి మోడీ పేరు



**జెరూసలెం, ఫిబ్రవరి 26:** భారత ప్రధాని నరేంద్ర మోడీకి మరో అరుదైన గౌరవం దక్కింది. ఇజ్రాయెల్‌లోని ఓ ఫ్లవర్ గార్డెన్‌లో కొత్తగా అభివృద్ధి చేసిన వేగంగా పెరిగే తెల్లని క్రిసాంతిమం అనే పుష్పానికి ప్రధాని గౌరవార్థం 'మోడీ' అని నామకరణం చేశారు. 2017లో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇజ్రాయెల్‌కు వెళ్లిన మొదటి ద్వైపాక్షిక సందర్శన సందర్భంగా జరిగిన ప్రత్యేక సంజ్ఞగా పరిగణించబడింది. ప్రధాని మోడీ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కలిసి ఎయిర్ పోర్టు నుంచి జెరూసలెంకు వెళ్లే మార్గంలో ఈ ఫ్లవర్ ఫార్మ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆ ఫామ్‌లో కొత్తగా అభివృద్ధి చేసిన క్రిసాన్తిమమ్ అనే పుష్పానికి ప్రధాని గౌరవార్థం మోడీ అనే నామకరణం చేశారు. అనంతరం ఆయనకు పుష్పం మొదటి గుత్తిని అందచేశారు. ఇది ఇరు దేశాల మధ్య స్నేహం, వ్యవసాయ సహకారానికి చిహ్నంగా నిలిచింది. ఇక తాజాగా ప్రధాని మోడీ మరోసారి ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్నారు. రెండో రోజు పర్యటనలో భాగంగా ఆయన బిజీబిజీగా గడుపుతున్నారు. జెరూసలెంలో హోలోకాస్ట్ మెమోరియల్‌ను సందర్శించారు. నాజీల నరమేధంలో బలైన యూదులకు ఘన నివాళి అర్పించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుతో కీలక చర్చలు జరుపుతున్నారు మోడీ. కీలక ఒప్పందాలపై ఇరుదేశాలు సంతకాలు చేయబోతున్నాయి.



# ఛాబహార్‌కు నిధులు కేటాయింపులు సున్నా

## భారత్ బడ్జెట్ కేటాయింపులపై ఇరాన్ అసంతృప్తి

**టెహ్రాన్, ఫిబ్రవరి 26:** భారత వ్యూహాత్మక ప్రయోజనాలకు అత్యంత కీలకమైన ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవు ప్రాజెక్టు భవిష్యత్తుపై సందేహాలు మొదలయ్యాయి. కేంద్ర బడ్జెట్ 2026-27లో ఈ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపును పూర్తిగా తొలగించడంపై ఇరాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హిందూ మహాసముద్రాన్ని మధ్య ఆసియాతో అనుసంధానించే ఈ బంగారు ముఖద్వారం విషయంలో భారత్ తీసుకున్న నిర్ణయం నిరాశపరిచిందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వ్యాఖ్యానించారు. గత బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు కోసం మొదట రూ.100 కోట్లు కేటాయించి, ఆ తర్వాత సవరించిన అంచనాల్లో దాన్ని రూ.400 కోట్లకు పెంచిన కేంద్రం, ఈసారి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దౌత్య వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ ఆరోపణలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. తాము నిధులు నిలిపివేయలేదని, 10 ఏళ్ల ఒప్పందంలో భాగంగా చెల్లించాల్సిన 120 మిలియన్ డాలర్ల మొత్తాన్ని ఇప్పటికే పూర్తిగా చెల్లించేశామని స్పష్టం చేసింది. అందువల్ల ప్రస్తుతానికి కొత్తగా నిధులు కేటాయించాల్సిన అవసరం లేదని వివరించింది. ఈ నిర్ణయం వెనుక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన ఆంక్షల ప్రభావం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై కఠినంగా వ్యవహరిస్తామని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో భారత్ ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. చాబహార్ ప్రాజెక్టుకు ఉన్న ఆంక్షల మినహాయింపు గడువు కూడా ఏప్రిల్ 26తో ముగియనుండటం ఈ వాదనలకు బలం చేకూరుస్తోంది. పాకిస్థాన్‌తో సంబంధం లేకుండా ఆఫ్ఘనిస్థాన్, మధ్య ఆసియా దేశాలకు సరుకు రవాణా చేయడానికి భారత్‌కు చాబహార్ పోర్టు అత్యంత కీలకం. ఈ ప్రాజెక్టు నుంచి భారత్ వెనక్కి తగ్గితే, ఆ ప్రాంతంలో చైనా తన ప్రాబల్యాన్ని మరింత పెంచుకునే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సంక్షిప్తంగా..

## నేడు ప్రచండ్ యుద్ధ హెలికాప్టర్‌లో ముర్ము గగన విహారం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం రాజస్థాన్‌లో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా శుక్రవారం ఆమె జైసల్మేర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ ప్రచండ్‌లో గగన విహారం చేయనున్నారు. అనంతరం భారత్ - పాకిస్థాన్ సరిహద్దు సమీపంలోని పోఖ్రాన్‌లో వైమానిక దళం ఆధ్వర్యంలో వాయు శక్తి పేరిట నిర్వహించనున్న విన్యాసాలను వీక్షించనున్నారు.



## రన్యారావుకు మరిన్ని చిక్కులు

**బెంగళూరు, ఫిబ్రవరి 26:** అక్రమంగా బంగారం తరలించిన కేసులో అరెస్టయిన కన్నడ నటిరన్యారావు మరిన్ని చిక్కుల్లో పడింది. మొత్తం రూ.102 కోట్ల బంగారం స్మగ్లింగ్ కేసులో ఆమెపై ఆరోపణలు రాగా తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో ఆమె పేరు కూడా ఉంది. స్మగ్లింగ్ సిండికేట్ ఒక ఏడాదిలో 127 కిలోల బంగారాన్ని భారత్‌కు స్మగ్లింగ్‌చేసిందని ఆరోపణలువచ్చాయి. తమ హ్యాండ్లర్లు, ఆభరణాల వ్యాపారులు దానిని దేశీయమార్కెట్‌లోకి చొప్పించారని ఈడీ దర్యాప్తులో గుర్తించింది. దాంతో బెంగళూరులోని పీఎంఎల్ఏ కోర్టులో ఈడీఛార్జ్‌షీట్ దాఖలు చేసింది.అందులో రన్యారావు పేరుతోపాటు ఆమె సహాయకుడిగా భావిస్తోన్న తరుణ్ కొండూరు, బళ్లారికి చెందిన గోల్డ్ డీలర్ సాహిల్ జైన్ పేర్లను చేర్చింది.

## కేరళ స్టోరీ2 సినిమా విడుదలపై హైకోర్టు స్టే




**తిరువనంతపురం, ఫిబ్రవరి 26:** కేరళ స్టోరీ2 సినిమా విడుదలపై కేరళ హైకోర్టు స్టేవిధించింది. శుక్రవారం విడుదల కావాల్సిన కేరళ స్టోరీ2 సినిమాను నిలిపివేసింది. సెన్సార్ బోర్డు తీరుపై కేరళ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.సినిమాలో వివాదాస్పద అంశాలు ఉన్నాయని, సినిమా సరిగ్గా చూడకుండానే అనుమతి ఎలా ఇచ్చారంటూ సెన్సార్ బోర్డుపై కోర్టు మండిపడింది. ఫిర్యాదులను సెన్సార్ బోర్డు పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించింది. పిటిషనర్లు ఇంటీరియమ్ అప్లికేషన్ ద్వారా అదనపు డాక్యుమెంట్స్ సబ్‌మిట్ చేయడానికి అవకాశం కల్పించింది. 30 నిమిషాలకు పైగా వాదోపవాదాలు నడిచాయి. అనంతరం కోర్టు విచారణను వాయిదా వేసింది.



## ఇరాన్‌కు జెడి వాన్స్ వార్నింగ్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 26:** ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో యుఎస్ ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. సైనిక చర్యకు సంబంధించి తమ బెదరింపులను ఇరాన్ సీరియస్ తీసుకోవాలన్నారు. వాన్స్‌ఫ్యాక్స్ న్యూస్‌తో మాట్లాడుతూ చెత్త పాలకుల చేతుల్లో అణ్వాయుధాలు ఉండటం సరికాదంటూ ఇరాన్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. దౌత్య చర్చలను అమెరికా బలహీనతగా చూడొద్దంటూ హెచ్చరించారు. తమ అధ్యక్షుడు ట్రంప్ దౌత్యపరమైన మారాలనే ఇష్టపడతారంటూనే.. ఆయన వద్ద మరిన్ని ఎంపికలు కూడా ఉన్నాయంటూ బెదరింపులకు పాల్పడ్డారు. ఈ క్రమంలోనే గురువారం జెనీవాలో ఇరుదేశాలు మరోమారు చర్చలకు సిద్ధమయ్యాయి.

## మోడీ పర్యటన ముగిసిన వెంటనే ఇరాన్‌పై అమెరికా దాడి: ఒవైసీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి26:** రెండు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా ఇజ్రాయెల్ వెళ్లిన ప్రధానమంత్రి మోడీపై స్వదేశంలో రాజకీయ వేడి రాజుకుంది. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రధాని పర్యటన తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని పర్యటన ముగిసిన వెంటనే అంతర్జాతీయంగా పెనుమార్పులు సంభవించే అవకాశం ఉందంటూ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. మోడీ పర్యటన ముగిసిన వెంటనే ఇరాన్‌పై అమెరికా దాడి చేసే అవకాశం ఉందని అన్నారు.

## కొత్తరాజకీయ పార్టీపేరు త్వరలోనే వెల్లడిస్తా: శశికళ



**చెన్నై, ఫిబ్రవరి 26:** తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వి.కె. శశికళ తన రాజకీయ పునరాగమనాన్ని ఖాయం చేస్తూ సంకేతాలిచ్చారు. వారం రోజుల్లో తన కొత్త రాజకీయ పార్టీ పేరును వెల్లడిస్తానని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని ఆమె స్పష్టం చేశారు. చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడిన ఆమె, పార్టీ ప్రారంభానికి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

# ఇ-నామ్‌తో బాధలు ఇంతా అంతా కాదయా!

**నెలలో 15 రోజులపాటు సర్వర్‌డౌన్**

**వ్యవసాయ మార్కెట్లలో తరచూ నిలిచిపోతున్న క్రయవిక్రయాలు**

**నిజామాబాద్‌లో 4 రోజులుగా పనిచేయని ఇ-నామ్ సాఫ్ట్‌వేర్**

**నిలిచిపోయిన పసుపు కొనుగోళ్లు.. రైతుల తీవ్రఆగ్రహం**

**మార్కెట్ కమిటీ కార్యాలయంపై దాడి, ఫర్నీచర్ ధ్వంసం**

**హైదరబాద్, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త:** పోటీ ద్వారా రైతులకు మెరుగైన ధర కల్పించడం, బిడ్డింగ్‌లో పారదర్శకత కోసం వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇ-నామ్ (ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) వ్యవస్థ ప్రహసనంగా మారుతోంది. తరచూ సాంకేతిక సమస్యలతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ నెలా 10 నుండి 15 రోజులపాటు ఇ-నామ్ సర్వర్ పనిచేయకపోవడంతో వ్యవసాయ మార్కెట్లలో పంటల క్రయవిక్రయాలు తరచూ నిలిచిపోతున్నాయి. దీంతో ఇ-నామ్ పోర్టల్‌తో పోటీ పెరిగి తమ పంటలకు అధిక ధరలు రావడం అటుంచితే కనీసం గిట్టుబాటు ధరకు కూడా అమ్ముకోలేని పరిస్థితి నెలకొంటోంది. ఇ-నామ్ విధానంలో దేశంలోని ఎక్కడి వ్యాపారులైనా, ఎక్కడి పంటనైనా ధరలు ప్రతిపాదించి కొనుగోలు చేయొచ్చు. దీనివల్ల రైతుకు అత్యధిక ధరలు దక్కే అవకాశం ఉంది.

దాదాపు 8 ఏళ్ల కిందట ఇ-నామ్ పోర్టల్ ప్రారంభం కాగా అప్పటి నుంచీ వ్యాపారులుఆన్‌లైన్‌లోనే బిడ్డింగ్ దాఖలు చేస్తున్నారు. ప్రస్తుతం సేవలు నిలిచిపోవటంతో మార్కెయార్డుల్లో అధికారులు పాత పద్ధతిలోనే టెండర్లు నిర్వహిస్తున్నారు.

దీంతో స్థానిక వ్యాపారులు కోట్ చేసిన ధరలే ఖరారవుతున్నాయి. ఫలితంగా రాష్ట్రంలోని 57 ప్రధాన వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో రైతులు నష్టాలకే తమ పంటను వ్యాపారులు ఖరారు చేసిన ధరలకు విక్రయించాల్సి వస్తోంది. అధికారులను సంప్రదిస్తే నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ)లో సాంకేతిక సమస్యల వల్ల ఇ-నామ్ సేవలు నిలిచాయని, పునరుద్ధరణ జరుగుతుందని సెలవిస్తున్నారు.

**మార్కెట్ కమిటీ కార్యాలయంపై రైతుల దాడి**

రోజుల తరబడి ఇ-నామ్ పోర్టల్ సర్వర్ డౌన్‌కావడంతో నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు రైతులు కన్నెర్ర చేశారు. కొన్ని రోజులుగా పసుపుకు మద్దతు ధర లేకపోవడం, ఇ-నామ్ సర్వర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ పనిచేయకపోవడంతో అధికారులు రైతులు తెచ్చిన పసుపు పంటకు లాట్ నంబర్ కేటాయిండం లేదు. ఇ-నామ్ సర్వర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ పనిచేయకపోవడంతో రెండు రోజులుగా స్లాట్లు బుకింగ్ కావడం లేదు. దీంతో నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు కొనుగోళ్లు నిలిచిపోయాయి. రైతులు మూడు రోజులుగా పసుపు రాసుల వద్ద పడిగాపులుగాస్తూనే ఉన్నారు. ఓ వైపు ప్రతికూల వాతావరణం ఆందోళన కలిగిస్తుంటే మరో వైపు సర్వర్ సమస్యల పేరుతో కొనుగోళ్లు నిలిపివేయడంపై గురువారం అన్నదాతలు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. మార్కెట్ యార్డులో ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో మార్కెట్‌లోని కార్యాలయ అద్దాలను ధ్వంసం చేసి మరీ నిరసన తెలిపారు. వర్షంతో పాటు ఇతర కారణాలతో మార్కెట్‌కు సెలవులు, కొనుగోళ్ల తీవ్ర జాప్యం అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన పసుపుతో తామే నష్టపోయే పరిస్థితులు వస్తున్నాయని అంటున్నారు. వసతులు, టార్పాలిన్‌లు కావాల్సి నన్ని లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అయినా తమను పట్టించుకునే నాథుడే లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆందోళన విషయంలో తెలుసుకున్న పోలీసులు అక్క డకు చేరుకుని సముదాయించడంతో, కొనుగోళ్లు వేగవంతం చేస్తామని అధికారుల ప్రకటనతో రైతులు శాంతించి ఆందోళన విరమించారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

## అంబేద్కర్ భవన్‌ను కోచింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**

**హైదరాబాద్ (ముషీరాబాద్), ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ఎస్సీ విద్యార్థులకు అత్యు త్తమ కోచింగ్ అందించేందుకు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ భవన్‌ను మోడ్రన్ కోచింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. గురువారం 59 దళిత కుల సంఘాల నాయకులతో కలసి ఆయన అంబేద్కర్ భవన్‌ను, కాచిగూడలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శిం చారు. మంత్రి మాట్లాడుతూ దళితులకు ఉన్నత విద్య అందించటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కాచిగూడ హాస్టల్ కాంప్లెక్స్‌ను రెసిడెన్షియల్ అకడమిక్ సెంటర్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల కోసం కొత్త టెక్నాలజీతో డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ క్లాస్‌రూమ్స్ ఏర్పాటుచేయటమే కాకుండా అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, రిటైర్డ్ సివిల్ సర్వెంట్స్ గెస్ట్ లెక్చర్స్ తీసుకోవటంతోపాటు మాక్ టెస్టులు, ఇంటర్వ్యూ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడతామని తెలిపారు. కోచింగ్ తీసుకునే అభ్యర్థుల కోసం హాస్టల్, మెస్, స్టడీ హాల్స్ వంటి పూర్తి సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కోచింగ్ సెంటర్‌లు హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం కాకుండా, రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు విస్తరించేలా దీర్ఘకాలిక ప్రణాళిక చేస్తామని వెల్లడించారు. దళిత సంఘాల నేతలు తమ అభిప్రాయాలను తెలియచేస్తే, సీఎం దృష్టికి తీసుకువెళ్లి, అంబేద్కర్ భవన్ టవర్‌ను నిర్మించేందుకు త్వరలోనే చర్యలు చేపడతామని తెలిపారు. మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ అంబేద్కర్ భవన్‌ను ఆధునిక హంగులతో పునర్నిర్మించి, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవటం అభినందనీయమని కొనియాడారు.

## జర్నలిస్ట్‌ల అక్రెడిటేషన్ ఏప్రిల్ వరకూ పొడిగింపు : హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని జర్నలిస్ట్‌ల అక్రెడిటేషన్‌ను ఏప్రిల్ నెల వరకూ పొడిగించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, అక్రెడిటేషన్ కార్డుల నిబంధనల మార్పులపై తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం హైకోర్టు ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ప్రస్తుత అక్రెడిటేషన్ కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు కొనసాగించాలని ఆదేశించింది. ఈ పిటిషన్‌లో, జిఓ 252, సవరించిన జిఓ 103 వల్ల జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలు, సదుపాయాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఫెడరేషన్ పేర్కొంది. పిటిషనర్ తరఫున ప్రముఖ న్యాయవాది అడ్వొకేట్ బర్కత్‌అలీఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా ప్రత్యేక అడ్వొకేట్ జనరల్ కోర్టుకు వివరణ ఇస్తూ, జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు తాత్కాలికంగా రెండు నెలల పాటు అక్రెడిటేషన్ కార్డుల గడువు పొడిగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వాదనలను రికార్డులోకి తీసుకున్న హైకోర్టు, ప్రస్తుత అక్రెడిటేషన్ కార్డులు 2026 ఏప్రిల్ 30 వరకు చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. అలాగే, జిఓ 252, సవరించిన జిఓ 103పై లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రభుత్వం పూర్తిస్థాయి వివరణ సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మధ్యంతర ఉత్తర్వులతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్రెడిటేషన్ జర్నలిస్టులు ప్రభుత్వ కార్యక్రమాలు, సౌకర్యాలను ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించవచ్చని పేర్కొంది.



లిక్విడ్ గంజాయి తయారీ యూనిట్ వద్ద పోలీసులు

## లిక్విడ్(హాషిష్) గంజాయి తయారీపై కోరాపుట్ పోలీసుల మెరుపుదాడి

**రూ. 200 కోట్ల విలువైన గంజాయి ద్రావణం సీజ్**

**5 కోట్ల విలువైన గంజాయి పట్టివేత**

**ఎపి-ఒడిశా సరిహద్దుల్లో యూనిట్**

**చింతూరు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో లిక్విడ్(హషిష్) గంజాయి తయారి యూనిట్‌పై గురువారం అక్కడి పోలీసులు మెరుపు దాడి చేసి రూ. 200 కోట్ల విలువైన 1,800 లీటర్ల లిక్విడ్ గంజాయిని స్వాధినం చేసుకున్నారు. ఎపి-ఒడిశా సరిహద్దుల్లోని పాడువా పోలీసు స్టేషన్ పరిధిలోని జోలాపుట్ రిజర్వాయర్ సమీపంలోని అటవి ప్రాంతంలో ఈ గంజాయి యూనిట్‌ను కనుగొన్నారు.రోడ్డు మార్గాలను ఉపయోగించకుండా పడవలు ,కాలినడకన చేపట్టిన ఈ ఆపరేషన్ విజయవంతం కావటంతో ఈ సంచలనాత్మక ఘటన వెలుగులోకి వచ్చినట్టు డిఐజి కన్వర్ విశాల్ సింగ్ మిడియా తెలిపారు.ఈ ఆపరేషన్‌లో లిక్విడ్ గంజాయి(హాషిష్) యూనిట్‌తో పాటు దాదాపు రూ॥5కోట్ల విలువైన 200కేజిల గంజాయిని స్వాధినం చేసుకోని,లిక్విడ్ గంజాయి తయారికి వాడుతున్న సామాగ్రిని సీజ్ చేశారు.

అక్కడి పోలీసులు.సమీపంలోని నందపూర్ పోలీసు స్టేషన్‌కు గంజాయిని తరలించారు. అత్యంత మారుమూల రహస్య ప్రాంతంలో లిక్విడ్ గంజాయి తయారి యూనిట్ ఉన్నట్టు పసిగట్టిన కోరాపుట్ పోలీసులు అక్కడి యస్.పి.రోహిత్ వర్మ నేతృత్వంలో గురువారం దాడులు నిర్వహించారు.ఈ దాడిలో లిక్విడ్ గంజాయి తయారీ యూనిట్‌తో పాటు యూనిట్ ఉపయోగించే పలురకాల సామాగ్రి, 200కిలోల పొడి గంజాయిని స్వాధినం చేసుకోని పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

హాషిష్(లిక్విడ్ )గంజాయి తయారిలో అంతరాష్ట్ర సంబంధాలు ఉన్నాయని, ఇప్పటికే ప్రాథమిక సమాచారం సేకరించామదర్యాప్తు కొనసాగుతుందని, మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని, ఈ కేసులో కీలక నిందితులను గుర్తించామని వారు తెలిపారు.

## విద్యార్థులు మానసిక ఒత్తిడి, భయం వీడాలి



విద్యార్థులతో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హరిచందన దాసరి

**టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా రాయాలి: మంత్రి పొన్నం**

**హైదరాబాద్ (గోషామహల్), ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** విద్యార్థులు పది పరీక్షలు ప్రశాంత వాతా వరణంలో రాయాలని, మానసిక ఒత్తిడి, భయం వీడి ప్రశాంత వాతావరణంలో పది పరీక్షలకు హాజరుకావాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం స్టానీ బాలికల పాఠశాల ఆడిటోరియంలో విద్యాశాఖ,సంకల్ప్ ఫౌండేషన్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షల సన్నద్ధతపై ప్రేరణాత్మక శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిచందనా దాసరితో కలిసి ముఖ్యఅతిథిగా విచ్చేసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడంతో విద్యార్దులతో మానసిక ఒత్తిడి భయాందోళన తగ్గుతుందని,మోటివేషన్ కార్యక్రమం ఏర్పాటు చేయడంపై జిల్లా కలెక్టర్ హరిచందన దాసరిని ప్రత్యేకంగా అభినందించారు. భయం వీడి ఆరోగ్యంపై శ్రద్ధ, సరైన నిద్ర, ఆహారం తీసుకోవాలని సూచించారు. విద్యార్దుల తల్లిదండ్రుల ఆశలు, గురువుల మార్గదర్శకత్వం, మీకృషి ఇవన్నీ కలిసి మీ విజ యానికి దారి చూపిస్తాయన్నారు.

పరీక్షలో మంచి ఫలితాలు సాధించడం మీలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందన్నారు. రాబోయే పదవ తరగతి పరీక్షల్లో విజయం సాధించా లన్నారు. అందుకు ముందు నూరు శాతం అటెండెన్స్ ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానం చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్దులకు నగదు బహుమతి అందచేశారు. విద్యార్థులకు బిడియం, భయం అలాగే మానసిక ఒత్తిడి లేకుండా ఉండాలని సంకల్ప్ ఫౌండేషన్ సహకారంతో మోటివేషన్ క్లాసులు ఏర్పాటు చేయడం ద్వారా భయం తొలగించడం అభినం దనీయమన్నారు. విద్యార్దులకు పదవ తరగతి పరీక్షలు జీవితంలో తొలిమెట్టు అని మీ జీవితం పదవ తరగతి పరీక్షలపై ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులు, సంవత్సరం కాలంపాటు ఎంతో శ్రమతో చదవడం అలాగే ఉపాధ్యాయులు మంచి విద్యాభోదన అందించడం జరిగిందన్నారు. విద్యార్దులు భయం వీడి చదివిన, ప్రశాంతంగా పరీక్షలు సమాధానాలు రాయడం ద్వారా ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ విద్యాశాఖ అధికారిణి రోహిణి, యువక్రీడాకారిణి నైనా జైస్వాల్, సంకల్ప్ ఫౌండేషన్ ప్రతినిధి రోజీ, మోటివేషన్ స్పీకర్, ప్రధానోపాధ్యాయులు, హైదరాబాద్ జిల్లాలోని పలు పాఠశాల పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

## లొంగిపోతానన్న కమాండర్‌ను హత్యచేసిన మావోయిస్టులు

**కుళ్లిన స్థితిలో అన్వేష్ మృతదేహం లభ్యం**

**హైదరాబాద:, ఫిబ్రవరి 26:** ఒడిశా అడవుల్లో మావోయిస్టుల మధ్య చెలరేగిన అంతర్గత విభేదాలు ఒక ముఖ్యనేత ప్రాణాలు తీసాయి. తుపాకీ పట్టి విప ్లవం బాటలో నడిచిన ఒక మావోయిస్టు కీలకనేత జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధమవడమే ఆయన మరణానికి శాపమైంది. ఛత్తీస్‌గఢ్‌కు చెం దిన మావోయిస్టు నాయకుడు అన్వేష్ అలియాస్ రేణు, తన అనుచరులతో కలిసి పోలీసుల ముందు లొంగిపోయేందుకు సిద్ధమవగా, ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించిన మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు నేత సుక్రు అతడిని అత్యంత దారుణంగా హతమార్చాడు. గత నెల 29న జరిగిన ఈ అడవి రక్తపాతం, పకారి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో అన్వేష్ కుళ్లిపోయిన మృతదేహం లభ్యమవడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అన్వేష్ తలపై రూ. 22 లక్షల భారీ రివార్డు ఉంది. సుదీర్ఘకాలం అజ్ఞాతంలో గడిపిన ఆయన, ఇటీవల తనతోపాటు మరికొందరు కమాండర్లను కలుపుకుని పోలీసులకు లొంగి పోవాలని నిశ్చయించుకున్నాడు. ఈ ప్రతిపాదనను మరో మావోయిస్టు నేత సుక్రుతోపాటు అతడి ప్రధాన అనుచరులు సిలా, జగేష్‌లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలోనే దళం లోపల చెలరేగిన వాగ్వాదం చిలికిచిలికి గాలివానలామారి, అన్వేష్ హత్యకు దారితీసింది. దారింగ్‌బాడి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో దొరికిన మృతదేహం ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఈ విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఈ ఘటన మావోయిస్టు కేడర్‌లో నెలకొన్న తీవ్రఅసహనాన్ని, అంతర్గత విభేదాలను బట్టబయలు చేసింది. లొంగుబాటు నిర్ణయాలు తీసుకునేవారిని సొంత దళ సభ్యులే శత్రువులుగా చూస్తున్నారని ఈ ఉదంతం నిరూపిస్తోంది. ఇదిలా ఉండగా, అన్వేష్ హత్యలో పాలుపంచుకున్నట్లు భావిస్తున్న జగేష్ అనే మావోయిస్టు, ఇటీవల కంధమాల్ జిల్లాలో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు పోలీసులు ధ్రువీకరించారు.

## రాజకీయాల కోసం మూసీ ప్రక్షాళనకు ప్రతిపక్షాలు అడ్డు

**మీడియా కమిటీ ఛైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త:** రాజకీయాల కోసం ప్రతిపక్షాలు మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటున్నాయనీ కాంగ్రెస్ మీడియా కమిటీ ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డిఆరోపించారు. గాంధీ భవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడుతూ మధు పార్క్ అపార్ట్మెంట్ పై అనవసర రాద్ధాంతం చేస్తున్నారనీ విమర్శించారు. గాంధీ ప్రాజెక్టుకి, మధు పార్క్ అపార్ట్మెంట్ కి సంబంధమే లేదనీ ఆయన వివరించారు.

మధు పార్క్ అపార్ట్‌మెంట్ బఫర్ జోన్ లో ఉందనీ ఐనప్పటికి అపార్ట్మెంట్ వాసులపై మేము అధికారం చెలాయించట్లేదనీ చెప్పారు.పైసా పైసా కూడబెట్టుకొని అపార్ట్మెంట్ కొనుకున్న ప్రజల బాధను అర్థం చేసుకుం టున్నామనీ అందుకే




మధు పార్క్ అపార్ట్మెంట్ వాళ్ళకి నష్ట పరిహారం చెల్లిస్తామనీ చెప్పారు. గవర్నమెంట్ వాల్యూ ప్రకారం అక్కడ స్క్వేర్ ఫీట్ కు 3 వేల ధర ఉన్నప్పటికి ప్రభుత్వం 5 వేలు నష్టపరిహారం ఇస్తామని నిర్వాసితులకు తెలిపిందని ఆయన చెప్పారు. కష్టపడి కొనుకున్న వాళ్ళకి నష్టం జరగవద్దని నష్టపరిహారం ఇస్తున్నాం అపార్ట్‌మెంట్ వాళ్లు మూసీ ప్రక్షాళనకు సాను కూలంగా ఉన్నారనీ ఆయన చెప్పారు. నాడు బిఆర్ఎస్ నాయకులు మల్లన్న సాగర్ బాధితులను తరమడానికి ఊర్లోకి నీళ్లను వదిలారనీ సామ రామ్మోహన్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. మధు పార్క్ వెళ్ళిన హారీశ్‌రావు మల్లన్న సాగర్ ఎందుకు వెళ్ళలేదు? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకులే అబద్ధాలతో ఈ రాష్ట్రాన్ని మూసీని మించి కలుషితం చేస్తున్నారనీ ఆవేదన చెందారు. పన్నెండు యేళ్లలో మూసీ ప్రక్షాళనకు మువ్వై రూపాయలు కూడా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీసుకురాలేదనీ ఎద్దేవా చేశారు. హైదరాబాద్ ప్రజలను ముంచాలని బిజెపి, బిఆర్ఎస్ కుట్ర చేస్తున్నాయనీ ఆరోపించారు. హైదరాబాద్ ను వరదల నుండి కాపాడడం మా ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు. బతుకిచ్చిన మూసీ నదిని బతికిద్దాం.. మురికి కూపంగా మారిన మూసీని కాపాడుకోవాలనీ ఆయన పిలుపు నిచ్చారు.

## 40 వేల టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలి

**నిరుద్యోగుల ప్రదర్శనలో ఆర్.కృష్ణయ్య డిమాండ్**

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 40 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అనేకమంది నిరుద్యోగులు గురువారం సైఫాబాద్‌లోని విద్యా శాఖ డైరెక్టర్ కార్యాలయం ఎదుట భారీగా ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ నిరుద్యోగ జెఎసి ఛైర్మన్ నీల వెంకటేష్, బిసి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జి. అనంతయ్య సమన్వయంతో ఈ భారీ ప్రదర్శన జరిగింది. ప్రదర్శనలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ టీచర్ పోస్టులు భర్తీచేయకపోవడంతో 12 వేల పాఠశాలల్లో ఇంగ్లీషు, లెక్కలు, సైన్స్ పాఠాలు చెప్పేవారు లేక విద్యార్థులలో విషయ పరిజ్ఞానం లోపించి చదువులలో వెనుకబడి పోతున్నారని ఆర్.కృష్ణయ్య విచారం వ్యక్తం చేశారు.

## పెద్దపల్లి వ్యవసాయాధికారి సస్పెన్షన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ఎసిబి కేసులో ఇరుక్కున్న మండల వ్యవసాయాధికారిని రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. రాష్ట్రంలోని పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి కే.అలివేణిని సస్పెండ్ చేస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 24వ తేదీన ఏసీబీ అధికారులు జరిపిన ఆకస్మిక తనిఖీల నేపథ్యంలోనే ఆమెను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా పలు జిల్లాల్లో గత కొన్నేళ్లుగా వ్యవసాయ శాఖ అధికారుల మధ్య ఆధిపత్య పోరు కారణంగా సమన్వయం లోపించింది. ఈ క్రమంలోనే వ్యవసాయ అధికారులకు సంబంధించి ఒకదాని తర్వాత మరో సంఘటనలు బయటకొస్తున్నాయని చర్చ వ్యవసాయ వర్గాల్లో వెల్లడవుతోంది. ఏసీబీ విచారణ పూర్తయ్యే వరకు ఆమె సస్పెన్షన్ అమలులో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అంతేకాకుండా అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని ఆదేశించింది.

## మార్చిలో 22వ విడత కిసాన్ సమ్మాన్ నిధులు

**రైతుల ఖాతాల్లో జమ చేయనున్న కేంద్రం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** దేశంలోని అన్నదాతలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం 22వ విడత నిధులు మార్చి నెలలో విడుదలకానున్నాయి. ఈ పథకం కింద ఇప్పటికే 21 విడతల డబ్బులను విజయవంతంగా అందుకున్న రైతులు 22వ విడత కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. మార్చి నెలలో ఈ నిధులు విడుదలయ్యే అవకాశం ఉండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మార్చిలో అన్నదాతల ఖాతాల్లోకి పీఎం కిసాన్ పథకం నిధులు జమ కానున్నాయి. ఈ పథకం కింద ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రూ. 2000 చొప్పున ఏడాదికి రూ. 6000 రైతులకు అందుతాయి. 21వ విడతను ప్రధాని నరేంద్ర మోదీ నవంబర్ 19, 2025న కోయంబత్తూరు వేదికగా విడుదల చేశారు. ఆ తదుపరి నాలుగు నెలల కాల పరిమితి ముగియనుండడంతో ఈ ఏడాది మార్చిలో 22వ విడత నిధులు విడుదలయ్యేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది.

## విద్యుత్ కేంద్రాలను పరిశీలించిన ఎన్టీపిసి ఇడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ థర్మల్ విద్యుత్ కేంద్రాలను నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) దక్షి ణ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆరిందం సిన్హా పరిశీలించారు. రాష్ట్రంలోని రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రంతో పాటు, తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుల్లో రెండు రోజుల పర్యటనల్లో భాగంగా చివరి రోజు గురువారం పర్యటించి వాటి పనితీరును పర్యవేక్షించారు. మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి రామగుండం చేరు కున్న ఆర్ఈడీ సిన్హాకు ప్రాజెక్టు ఈడీ చందన్ కుమార్ సామంత, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఆయన రెండు రోజుల పర్యటనలో భాగంగా రామగుండం ప్రాజెక్టులోని ఏడవ యూనిట్ కంట్రోల్ రూంను పరిశీలించారు. అక్కడ విద్యుత్ ఉత్పత్తిలో ఎదురవుతున్న సమస్యలు, వాటిపై తీసుకున్న చర్యలు, అవి పనిచేస్తున్న విధానం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని కంట్రోల్ రూములను పరిశీలించి అధికారులతో వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు.

## మొబైల్‌ఫోన్‌తో ఎల్‌పిజి ఇ-కెవైసి

**మార్చి 31తో ముగుస్తున్న ఇ-కెవైసి గడువు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం మరి కొద్దిరోజుల్లో ముగియనున్న నేపథ్యంలో మార్చి 31లోపు గ్యాస్ వినియోగదారులందరూ ఆధార్ ఇ-కెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ ప్రకటన జారీ చేసింది. ప్రతీ ఆర్థిక సంవత్సరంలో ఒకసారి గ్యాస్ వినియోగదారులు ఆధార్ బేస్డ్ ఇ-కెవైసి ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు గురువారం ఎక్స్‌లో ప్రజలకు వివరాలు వెల్లడించింది. ఎల్‌పిజి బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ లేదా ఇ-కెవైసిని పూర్తి చేయడానికి కొత్త, సులువైన మార్గాన్ని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆధార్ ఫేస్‌ఆర్‌డి యాప్‌తోపాటు సంబంధిత ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ మొబైల్ యాప్‌ని ఉపయోగించి ఇంటినుండే ఉచితంగా ప్రక్రియ పూర్తి చేసే అవకాశాన్ని కల్పించింది. మరిన్ని వివరాల కోసం సంబంధిత ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్‌ను సంప్రదించాలని సూచించింది. లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1800 2333 555కు ఫోన్ చేయాలని తెలిపింది.

# రైతు భరోసా ఇంకెప్పుడు?

**మరో నెల రోజుల్లో ముగింపునకు యాసంగి సీజన్**

**సాగుకోసం అధిక వడ్డీలకు అన్నదాతల అప్పులు**

**చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేని స్థితిలో కర్షకులు**

**హైదరబాద్, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త:** యాసంగి రైతు భరోసా విడుదలలో నెలకొంటున్న తీవ్ర జాప్యం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రైతు భరోసా వస్తుందన్న ధీమాతో అప్పులు చేసి యాసంగి పంటలు సాగు చేసిన రైతులకు ఇప్పుడు చేసిన అప్పులు, వడ్డీలు ఎలా తీర్చాలో పాలుపోవడం లేదు. దాదాపు మూడు నెలలుగా రైతులు ప్రభుత్వం నుంచి ఈ నిర్ణయం కోసం వేచి చూస్తున్నారు. తాజాగా జరిగిన రాష్ట్ర కేబినెట్ భేటీలో రైతు భరోసా విడుదలపై నిర్ణయం వెలువడుతుందని ఆశించారు. అయినప్పటికీ కేబినెట్ భేటీలో మాత్రం రైతు భరోసాపై ఎలాంటి నిర్ణయం జరగలేదు.

ఈ పరిస్థితుల్లో అసలు ఈ యాసంగి సీజన్‌కు రైతు భరోసా నిధులువిడుదల చేస్తారా..? లేదా... అన్న సందేహాన్ని అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ సీజన్ రైతు భరోసా నిధుల విడుదల మరింత ఆలస్యమవడం ఖాయంగా కనిపిస్తోంది. తాజాగా జరిగిన మంత్రివర్గ భేటీలో ఎలాంటి నిర్ణయం లేకపోవటంతో రాష్ట్ర ప్రభుత్వం నిధుల విడుదల పైన ఆలోచన మారిందనే చర్చ జరుగుతోంది. అధికారుల సమాచారం మేరకు రైతు భరోసా నిధుల విడుదల ప్రక్రియ రెగ్యులర్ ప్రాసెస్ కావటంతో.. కొత్తగా కేబినెట్ లో చర్చ అవసరం ఉండదని చెబుతున్నారు. ఇప్పటికే నిధుల సమీకరణ పూర్తి కావటంతో ఈ నెలాఖరులో నిధులు విడుదల చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. వాస్తవంగా సంక్రాంతి సమయంలోనే నిధులు విడుదల చేస్తారని రైతులు వేచి చూశారు. అయితే ఆ సమయంలో మున్సిపల్ ఎన్నికల హడావుడిలో ప్రభుత్వం ఉండడం, పండగ తర్వాత ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కోడ్ ఎత్తివేసిన వెంటనే రైతుల ఖాతాల్లో నిధులు నిధులు జమ చేస్తారని వార్తలు వచ్చాయి. అయితే, ఇప్పటి వరకు ప్రభుత్వం అధికారికంగా భరోసా నిధుల జమ పైన ఎలాంటి ప్రకటన చేయక పోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారులు మాత్రం ఈ నెలాఖరులోకా నిధుల విడుదలకు అవకాశం ఉందని చెబుతున్నారు.

యాసంగి సీజన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఈ నిధులను ఒకే విడతలో రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు కసరత్తు వేగవంతం చేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ నేపథ్యంలో రైతు భరోసా నిధుల జమ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూల ప్రకటన రాకపోతుందా..? అని అన్నదాతలు వేచి చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రెండు సీజన్లకు కలిపి ఎకరానికి రైతుకు మొత్తం రూ.12 వేల పెట్టుబడి సాయం అందించాలి. అందులో భాగంగా ఈ యాసంగి విడతలో ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. గత ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 69 లక్షల 39 వేల మంది రైతులకు రూ.8,744.13 కోట్ల నిధులను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈసారి కూడా సుమారు 1.46 కోట్ల ఎకరాలకు సాయం అందించాల్సి ఉంది. అయితే ఏప్రిల్ మొదటివారంతో రాష్ట్రంలో యాసంగి వరికోతలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఇప్పటికీ ప్రభుత్వం రైతు భరోసా విడుదల చేయకపోవడం అన్నదాతల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది.



# నిర్ణీత గడువులోగా అన్ని రోడ్లు పూర్తి కావాలి

### అధికారుల సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్గొండ-ప్రతినిధి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లాలో జరుగుతున్న రహదారులు మరియు వంతెనల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మంత్రి క్యాంపు కార్యాలయం 'ఇందిరాభవన్'లో ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధారం, అప్పాజిపేట, బ్రాహ్మణవెల్లంల రహదారి పనుల పురోగతిని పరిశీలించి, రెండు నెలల్లోగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు.సోమనవాగుపై నిర్మాణంలో ఉన్న పగిడిమర్రి వంతెన పనులను మూడు నెలల్లోగా పూర్తి చేయాలి . పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని సూచించారు.కనగల్ జంక్షన్ నుంచి కనగల్ గ్రామం వరకు నాలుగు లేన్ల రహదారి పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. కనగల్- తిమ్మన్నగూడెం రహదారి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మామిడాల, గోదోరిగూడెం, ఎల్లమ్మగూడెం గ్రామాల రహదారి పనులపై కూడా సమీక్ష జరిపి, మామిడాలలో సీసీ రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించాలని స్పష్టంగా పేర్కొన్నారు. నార్కెట్‌పల్లి-మంద్ర రహదారి పనులను వెంటనే ప్రారంభించాలంటూ సంబంధిత కాంట్రాక్టర్‌కు కఠిన ఆదేశాలు జారీ చేశారు. వైటీపీఎస్ రహదారి పనుల పురోగతిని నల్గొండ సూపరింటెండింగ్ ఇంజనీర్‌తో కలిసి మంత్రి సమీక్షించారు.

**డాక్టర్లు మానవత్వంతో పని చేయాలి**

డాక్టర్లు తెల్ల కోటుకు పరిమితం కాకుండా, మానవతా దృక్పథంతో పేదలకు వైద్య సేవలందించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో 'అద్వితీ 2026' పేరున నిర్వహించిన నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని వృత్తుల కన్నా వైద్య వృత్తి పవిత్రమైనదని అన్నారు . నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల అన్ని ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేయబడిందని, వైద్య కళాశాలలో చదివే విద్యార్థులు సబ్జెక్టులతో పాటు, మానవత్వాన్ని కూడా నేర్చుకోవాలని, తెల్ల కోటు బాధ్యతకు"సింబల్ "అని అన్నారు. కళాశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తీర్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని , వైద్య కళాశాల విద్యార్థుల కోసం రెండు ఏసీ బస్సులను మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. నెలలోపు వీటిని మంజూరు చేస్తామన్నారు. ఇటీవలే ఏఐజి ఆసుపత్రి డాక్టర్ నాగేశ్వరరెడ్డిని ప్రభుత్వ వైద్య కళాశాలకు తీసుకురావడం జరిగిందని, నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో చదివిన పి జి విద్యార్థులను పరిశోధన నిమిత్తం తన ఆసుపత్రిలో ప్రతి సంవత్సరం 45 మంది చొప్పున తీసుకునేందుకు అంగీకరించారన్నారరు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాబోయే డాక్టర్లు గ్రామాలలో పేద ప్రజలకు సేవలు అందించాలని కోరారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ వత్తి పవిత్రమైందని, రోగులను చిరునవ్వుతో పలకరించి వారికి వైద్యం చేయాలని సూచించారు. డిప్యూటీ మేయర్ అమీర్ ఆశ్రఫ్ అలీ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి,మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి ,డాక్టర్లు ఆయా వైద్య విభాగాల అధిపతులు, తదితరులు హాజరయ్యారు. మంత్రి కోమటి రెడ్డి, మేయర్లు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

# ఆధిపత్యం చలాయించొద్దు.. సేవా భావంతో పనిచేయాలి

### గ్రూప్-1, గ్రూప్-2 అధికారులకు

### సిఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి26:** తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ ఆధిపత్యాన్ని స్వీకరించరని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. పాలకులకు వ్యతిరేకంగా కొట్లాడేవారు శ్రీమంతులు కాదని పేర్కొన్నారు. సమక్క, సారక్క, కాకతీయులు ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడారని, అందుకే వారు వనదేవతలుగా గౌరవించబడుతున్నారని గుర్తుచేశారు. రాంజీ గోండు,కొమరం భీం రాజ్యాల కోసం పోరాటం చేయలేదు..అధిపత్యం చెలాయిస్తున్న వారిపైన తిరుగుబాటు చేశారని చెప్పారు. సామాజిక న్యాయం, సమానత్వం,స్వేచ్ఛ,సమాన అవకాశాల కోసం వారు అమరవీరులు అయ్యారు. గురువారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ట్రైనింగ్ పూర్తి చేసుకున్న గ్రూప్-1,2 అధికారుల వెలిడిక్టరీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇందులో 271 మంది గ్రూప్-1, 171 మంది గ్రూప్-2 అధికారులు, 51 మంది మిలటరీ ఇంజినీరింగ్ సర్వీస్ ఉద్యోగులు ఉన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. అధికారులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న మీరు ప్రజల ఆకాంక్షలు,అమరవీరుల స్ఫూర్తి గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. మీరు మొన్న విద్యార్థులు,నిన్న నిరుద్యోగులు,ఈ రోజు అధికారులు ..ప్రజా పాలన లో 4 కోట్ల తెలంగాణ ప్రజలకు మీరు సేవలు అందించబోతున్నారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం నల్గొండ పార్లమెంటు నుంచి దివంగత రావి నారాయణరెడ్డి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిచారని, మొదటి ఎన్నికల్లో దేశం లోనే అత్యదిక మెజార్టీ తో గెలిచిన రావి నారాయణ రెడ్డి తెలంగాణ బిడ్డ అని గుర్తు చేశారు.6 లక్షల మంది పోటీపడితే 582 మంది గ్రూప్ 1... 775 మంది గ్రూప్ 2 ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. 15 ఏళ్ల పాటు గ్రూప్ 1 ఉద్యోగాలు భర్తీ చేయలేదు ప్రజా ప్రభుత్వం గ్రూప్ 1 నిర్వహించి ఆకాంక్షలను నెరవేర్చిందని తెలిపారు. గ్రూప్1 పరీక్షలను నిర్వహించి నియామక పత్రాలను అందించామన్న సీఎం ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లలో అమ్మకుండా ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి ఉద్యోగ నియామకాలు చేపట్టామని, గ్రూప్ పరీక్షల పైన అవగాహన ఉన్న వాళ్ళని చైర్మన్ గా,సభ్యులుగా నియమించామని పేర్కొన్నారు. గ్రూప్ 1 నికి ఎంపికైన ఆనందం 24 గంటలు లేకుండా గిట్టని వాళ్ళు కోర్ట్‌కు వెళ్లారు..అభ్యర్థులు ఒక్క తప్పు చేయలేదు,మెరిట్ మీద ఎంపిక అయ్యారని ప్రభుత్వం భావించి సుప్రీంకోర్టు వరకు వెళ్లి కొట్లాడిందని తెలిపారు. హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు అభ్యర్థుల తరపున పోరాటం చేశామని గుర్తుచేశారు. తాము ఇంత పక్కాగా ఉన్నా.. కొందరు ఉద్యోగాలను అమ్ముకున్నామని తమపై తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు. అలాంటి వారికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ఒక్క గ్రూప్1 ఉద్యోగం అయినా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను కుటుంబసభ్యులుగా భావిస్తుందని, తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులనే రాష్ట్ర ప్రతినిధులుగా భావిస్తోందని, వారి ద్వారానే ప్రభుత్వ పథకాలు అమలు అవుతాయని చెప్పారు. ఉద్యోగులే తమ కళ్లు, తమ ప్రతినిధులని కొనియాడారు. తాము ఎన్ని పాలసీలు చేసినా దానిని అమలులో ఉద్యోగులే చాలా ముఖ్యమని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణకు సేవ చేయండి సిఎం పేర్కొన్నారు. మెకానికల్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులను కలవటానికి రాలేదన్న సీఎం ఇదొక భావోద్వేగమని తెలిపారు. చిత్తశుద్ధితో పని చేస్తే ఇందులో నుంచి కొద్ది మందే ఐఎఎస్ ఐపీఎస్‌లుగా అవుతారని మీపై ఉన్న బాధ్యతను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి అప్రోచ్‌తో ఉద్యోగంలో చేరారో రిటైర్మెంట్ అయ్యే వరకు అలాగే ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగంలో మూడు రకాల పరిస్థితులు ఎదురవుతాయని, 1.గరం, 2.నరం, 3.బేషరం మీరంతా మొదటి పరిస్థితి దగ్గరే ఆగిపోతే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. గరం,నరం,బేషరం అనే నానుడి తప్పు అని మీరంతా ప్రూవ్ చేయాలని చెప్పారు. ఉద్యోగులను ఉద్దేశించి మన మూలాలు, నేపథ్యం గుర్తుపెట్టుకుని ప్రజలకు సేవ చేయాలని సూచించారు.అధికారులు అయ్యాక బాధ్యత మరిచి పోయి మనిషిగా పతనం కావద్దని, ఆఫీస్ కు వెళ్ళేముందు ఎస్ ఆర్ శంకరన్ ను తలచుకోవాలని చెప్పారు. పేదవారికి సాయం చేసేముందు తల్లితండ్రులను గుర్తు పెట్టుకోవాలి..తల్లి తండ్రులను గౌరవించాలి అని సూచించారు. ముందుగా నిరుద్యోగుల నుంచి ఉద్యోగులుగా మారిన వారందరూ ఇప్పుడు



తల్లిదండ్రులను మంచిగా చూసుకోకపోతే తన ఆలోచన విఫలం అయినట్లుగానే భావిస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తల్లిదండ్రులను చూసుకోకపోతే వారి జీతాల నుంచి 10 నుంచి 15 శాతం కోత విధించే పాలసీని రాబోయే అసెంబ్లీలో ప్రవేశపెడతామన్నారు. ఈ మధ్య తాను కూడా హార్వర్డ్ యూనివర్సిటిలో స్టూడెంట్‌గా వెళ్లానన్న సీఎం ఎంసీహెచ్ఆర్డీ హార్వర్డ్ మధ్య ఎంవోయూ చేస్తానని ప్రకటించారు. మరో ఆరు నెలల్లో హార్వర్డ్ యూనివర్సిటీ ఎంసీహెచ్ఆర్డీకీ రాబోతుంద న్నారు. హార్వర్డ్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు.

# కాంగ్రెస్ హయాంలో పేదలకు ప్రశాంతత లేదు

### ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు

### ఎల్లమ్మబండలో 7 వేల కోట్ల రూపాయల భూమిని ఎలా దారాదత్తం చేస్తారు?: బిజెపి ఎంపి ఈటల



**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అగ్ర తనేత రాహుల్ గాంధీ మాట మాట్లాడితే పేదలు, ధర్మం, చట్టం, న్యాయం గురించి మాట్లాడుతున్నారు, కానీ మీ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ఏం జరుగుతుంది? రేవంత్ రెడ్డి సర్కారీ చేస్తున్న ఆగడాలు దుర్మార్గాలు ఆపే ప్రయత్నం చేయకపోతే మీ పార్టీని తెలంగాణ ప్రజల భూస్థాపితం చేస్తారని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ హెచ్చరించారు. గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో జరుగుతున్న విషయాలను కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్లలనున్నట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజలకు ప్రశాంతత లేకుండా పోయిందన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రులు గతంలో ఉంటే పేదల కాలనీలు మాయం అయ్యేవి అన్నారు. ఖమ్మంలో ఇళ్ళు కూల్చడం దుర్మార్గం అని, పేదల కన్నీళ్లు చూసి తెలంగాణ ప్రజలు సిగ్గుతో తలదించుకుంటు న్నార న్నారు. మధురిడ్జ్ అపార్ట్‌మెంట్ కూలగొడితే ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. పెద్దవారు కబ్జా పెడితే పట్టించుకోరు, పేదల ఇళ్లయితే కూలుస్తారా ? అని ప్రశ్నించారు. ఎల్లమ్మబండలో 7 వేల కోట్ల రూపాయల భూమి ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేశారని అన్నారు. తెలంగాణ ప్రజలకు ప్రశాంతత లేకుండా పోయిందని, ఎప్పుడు ఎవరి ఇల్లు కూలగొడతారు.

ఎవరి భూములు గుంజు కుంటారు. హైదరాబాద్‌కు శ్రీకాకుళం, విజయనగరం, కరీం నగర్, అదిలాబాద్ నుంచి పొట్ట చేత పట్టుకుని జీవనం కోసం వచ్చి అసైన్మెంట్ భూములలో, దేవాలయ భూములలో, ప్రభుత్వ భూములలో, భూధన్ భూములలో గుడిసెలు వేసుకొని.. 60 గజాలు 80 గజాల్లో ఇల్లు కట్టుకొని 50 ఏళ్లుగా జీవనం కొనసాగిస్తున్నారు. అలాంటి స్థితి ఈరోజు లేకుండా పోయిందన్నారు. ఖమ్మంలో భూధన్ భూములలో బతకడానికి వచ్చిన పేదలు గుడిసెలు వేసుకొని రేకుల షెడ్డులు వేసుకొని జీవిస్తా ఉంటే అకారణంగా, చెప్పాకుండా, నోటీసులు ఇవ్వకుండా ఇంటికి ఒక డిసిఎం పంపించి.. యుద్ధభూమిని తలపించే పద్ధతిలో పదివేల మంది పోలీసులతో ప్రజల మీద చేసిన దాడి ఇల్లు కూలగొడుతున్న తీరు మహిళలు పెట్టిన కన్నీరు పద్ధతి పిల్లలు కూడా మా ఇల్లు కూలగొట్టకండి కార్చిన కన్నీళ్ల సాక్షి గా తెలంగాణ సమాజం సిగ్గుతో తలదించుకుంటుంది.

ఈ ప్రభుత్వానికేనా, ఈ పార్టీకేనా, ఈ ముఖ్యమంత్రికేనా మేము మద్దతు ఇచ్చింది అనే పరిస్థితి వచ్చింది. పెద్దవాళ్ల కోట్లకు పరిగెత్తిన వాళ్ళు ప్రభుత్వ భూములను కోర్టులను మేనేజ్ చేసుకుని తీర్పులు తెచ్చుకొని వేల కోట్ల రూపాయల భూములు ఆక్రమించుకుంటుంటే వాటి మీద మాత్రం చర్యలు ఉండవు. తాను 2007 నుంచి కూకట్‌పల్లి పక్కన ఉన్న ఎల్లమ్మ బండలోని 94 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాను.

రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉండగా అదే సర్వే నెంబర్లు 150 మందికి ఇళ్ల జాగాలు ఇస్తే ఇప్పుడు అదే సర్వే నంబర్‌లో అదే ప్రభుత్వపరమైన భూమిని ప్రైవేటు వ్యక్తికి చెందింది అని తీర్పు తెచ్చుకుంటే ఆనాటి ప్రభుత్వం మళ్ళీ సుప్రీంకోర్టుకి డబుల్ బెంచ్‌కి పోకుండా మిన్నకుండా ఉంది.ఇప్పుడు ఈ ప్రభుత్వం ఏడు వేల కోట్ల రూపాయల విలువైన ఎల్లమ్మబండ 125 ఎకరాల భూమిని పెద్దవారు కబ్జా పెడితే చోద్యం చూస్తున్నారన్నారు.రేవంత్ రెడ్డి సర్కారు చేస్తున్న ఆగడాలు దుర్మార్గాలు ఆపే ప్రయత్నం చేయకపోతే మీ పార్టీని తెలంగాణ ప్రజల భూస్థాపితం చేస్తారని అన్నారు.

# సొమ్ము ప్రజలది.. సోకు రైస్‌మిల్లర్లది

### యథేచ్ఛగా సిఎంఆర్ దుర్వినియోగం

### తాజాగా నల్గొండ జిల్లాలో వెలుగులోకి

### రూ.43 కోట్ల కుంభకోణం

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** బ్యాంకు లోను కొట్టు.. రైస్ మిల్లు పెట్టు.. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) పట్టు.. ప్రయివేటు మార్కెట్‌లో అమ్ము... పైసా పెట్టుబడి లేకుండా కోట్లు గడించు.. అనేవిధంగా రాష్ట్రంలోని రైస్ మిల్లర్ల అక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి. రైస్‌మిల్లు పేరుతో కోట్లలో అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్, రంగారెడ్డి తదితర జిలాల్లో ఏటా రైస్‌మిల్లర్లది ఇదే తంతు. ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా, అధికారులు దాడులు చేస్తున్నా రాష్ట్రంలో రైస్ మిల్లర్లు ఏమాత్రం జకడం లేదు. ఏటా యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతూ సిఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యాన్ని మెక్కేస్తూనే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని సీఎంఆర్‌గా మార్చి ఇచ్చేందుకు ప్రతీ సంవత్సరం రైస్ మిల్లులకు కేటాయిస్తోంది. ప్రభుత్వం కేటాయించిన వరి ధాన్యాన్ని బియ్యంగా మార్చి తిరిగి ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ రైస్ మిల్లర్లు కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యాన్ని బియ్యంగా మరాడించినా ఏళ్ల తరబడి సిఎంఆర్ కోటా బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించడం లేదు. బియ్యాన్ని మాయం చేసి అక్రమంగా ప్రయివేటు మార్కెట్‌కు, అవసరమైతే పొరుగు రాష్ట్రాలకు తరలించి కోట్లు గడిస్తున్నారు. సాక్షాత్తూ తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సొంత జిల్లా నల్గొండలో భారీ సిఎంఆర్ కుంభకోణం వెలుగుచూడడం అడ్డుఅదుపు లేకుండా రైస్‌మిల్లర్లు పాల్పడుతున్న అక్రమాలకు అద్దంపడుతోంది. తాజా కుంభకోణంలో నల్గొండ జిల్లాలోని రైస్ మిల్లర్లు దాదాపు 43కోట్ల మేర సిఎంఆర్ అక్రమాలకు పాల్పడినట్టు తేలింది. కాగా..మూడేళ్ల క్రితం కూడా నల్గొండ జిల్లాలో అక్షరాల రూ.193 కోట్ల సీఎంఆర్ స్కామ్ జరిగినా నేటికీ ఆ అక్రమాల వ్యవహారం లేలకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నల్గొండ జిల్లా రైస్ మిల్లర్ల మాదిరిగానే రంగారెడ్డి జిల్లాలోనూ పెద్ద ఎత్తున సిఎంఆర్ అక్రమాలు జరిగినట్లు మిల్లర్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రంగారెడ్డి జిల్లాలోని దాదాపు 12 రైస్ మిల్లులకు ప్రభుత్వం 2022-23 రబీ సీజన్‌లో 41,305 క్వింటాళ్ల ధాన్యాన్ని అప్పగించగా ఇవ్వాల్సిన 8.253 క్వింటాళ్ల బియ్యంలో ఇప్పటి వరకు 5162 క్వింటాళ్లు మాత్రమే అప్పగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వికారాబాద్ జిల్లాకు చెందిన 30మంది రైస్ మిల్లర్లు 2వేల మెట్రిక్ టన్నుల సిఎంఆర్ బియ్యం బాకీ ఉన్నట్టు తెలుస్తోంది. ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి జిల్లాల తరహాలోనే కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోనూ రైస్ మిల్లర్లు పెద్ద ఎత్తున సిఎంఆర్ బకాయిలు ఉన్నట్టు సమాచారం. సిఎంఆర్ అక్రమాల వ్యవహారంలో అధికారుల ప్రమేయం, మిల్లర్లకు రాజకీయ నేతల అండదండలను కొట్టి పారేయలేమని పలు వినియోగదారుల సమాఖ్యలు విమర్శిస్తున్నాయి. ప్రభుత్వం నిర్వహించిన దాడుల్లో విధి వక్రీకరించి దొరికిపోతే మిల్లర్లు తమ రాజకీయ పరపతిని అడ్డం పెట్టుకొని సిఎంఆర్ బియ్యాన్ని చెల్లించకుండా జాప్యం చేస్తూ వస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై నాన్‌బెయిలబుల్ కేసులు పెడుతున్నామని చెబుతూ పౌరసరఫరాలశాఖ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని, ధాన్యం రికవరీ సంగతి మర్చిపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

### కూకట్‌పల్లి శ్రీచైతన్య సిబిఎస్ఇ నూతన పాఠశాలలో

# ఇఎస్ఐసిలో ఆరోగ్య శిబిరం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి26:**కార్మిక రాజ్య బీమా సంస్థ స్వర్ణోత్సవాలలో భాగంగా కూకట్ పల్లి సిబిఎస్ఈ ని శ్రీ చైతన్య విద్యాసంస్థ నందు ఈఎస్ఐ చందా చెల్లింపు చేయు కార్మికులకు, వారి పైన ఆధారపడిన కుటుంబ సభ్యుల కోసం సంస్థ అభ్యర్థన మేరకు కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసి) మెడికల్ కాలేజ్ డీన్ డాక్టర్ సురేష్ కుమార్ చవాన్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం రాధిక సనత్ నగర్ వార్ల సహకారంతో ఉచిత ఆరోగ్య క్యాంపు, అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది.ఈ క్యాంపు నందు శ్రీ చైతన్య విద్యాసంస్థలలో పనిచేయుచూ నెలసరి ఈఎస్ఐ చందా చెల్లింపు చేయు కార్మికులకు, వారి పైన ఆధారపడిన



కుటుంబ సభ్యులకు ఈఎస్ఐసి మెడికల్ కాలేజ్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, ఇతర సిబ్బంది హాజరై వారికి మధుమేహం, రక్తపోటు, హిమోగ్లోబిన్, కంటి పరీక్షలు మరియు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తగు మందులను కూడా అందజేయడం జరిగింది.ఈ విధంగా కార్మికుల వద్దకు ఇఎస్ఐసి సిబ్బంది వచ్చి కార్మికులకు, వారి పైన ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఆరోగ్యపరీక్ష నిర్వహణ ఎంతో ఉపయుక్తంగా ఉన్నదని ఈ సందర్భంగా ఈఎస్ఐసి మెడికల్ కాలేజ్ డీన్ సురేష్ కుమార్‌చవాన్‌కు, హాస్పటల్ సూపరింటెండెంట్ రాధికకు కార్మికుల తరఫున శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ సీమా, డైరెక్టర్ నాగేంద్ర కుమార్, శ్రీ చైతన్య కూకట్ పల్లి సిబిఎస్ఈ ఏజీఎం శివరామకృష్ణ,రీజనల్ ఇన్చార్జ్ శ్రీమతి వెనిగళ్ళ పద్మజ అడ్మిన్ శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ క్యాంపులో సుమారు 200 మంది కార్మికులు హాజరై క్యాంపును జయప్రదం చేసినట్లు తెలిపారు.

# త్రిభాషా విధానం అమలు చేయాలి

### ఇంగ్లీష్ మీడియంలోనే బోధన ఉండాలి.. ఎప్‌సెట్‌ను రద్దు చేయాలి

### విద్యారంగానికి బడ్జెట్‌లో 18 శాతం నిధులను కేటాయించాలి

### 434 సిఫారసులు చేసిన తెలంగాణ విద్యా కమిషన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** విద్యార్థి కేంద్రంగా తెలంగాణ విద్యా విధానం ఉండాలని, త్రి భాషా విధానం అమలు చేయాలని, ఇంగ్లీష్ మీడియంలోనే బోధన ఉండాలని, విద్యారంగానికి బడ్జెట్‌లో 18 శాతం నిధులను కేటాయించాలని పేర్కొంటూ 434 రికమండేషన్స్‌ను ప్రభుత్వానికి సమర్పించింది తెలంగాణ విద్యా కమిషన్. నూతన తెలంగాణ విద్యా విధానం రూపకల్పన కోసం ప్రతిపాదనలు సమర్పించాలని తెలంగాణ విద్యా కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పర్యటించి పలు విద్యాసంస్థలను పరిశీలించింది. 6 రాష్ట్రాలు, అమెరికా, వియత్నాం, మలేషియా వంటి దేశాల్లోనూ పర్యటించి పలు దేశాల్లో అమలు జరుగుతున్న విద్యా విధానాలను పరిశీలించి, అధ్యయనం చేసిన అనంతరం తెలంగాణ నూతన విద్యా విధానం కోసం 434 సిఫారసులను చేసినట్టు తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ తెలిపారు. తెలంగాణ విద్యా కమిషన్ రూపొందించిన ప్రతిపాదనలను గురువారం కమిటీ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించినట్టు తెలిపారు. కమిటీ సభ్యులు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు, చారుకొండ వెంకటేశ్వరరావు, జ్యోత్స్నతో కలిసి గురువారం మీడియాతో మాట్లాడారు. విద్యా విధానం పూర్తిగా విద్యార్థి కేంద్రంగా ఉండాలని సిఫారసు చేసినట్టు తెలిపారు. ప్రీప్రైమరీని అమలు చేయాలని సూచించామన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయాలని, ప్రతి స్కూల్‌లో 1500 మందికి తగ్గకుండా ఉండాలని సూచించామన్నారు. విద్యతోపాటు పలు క్రీడలను ప్రోత్సహించేలాగా విద్యా విధానం ఉండాలన్నారు. ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు స్కూల్స్‌ను ఆరు కేటగిరీలుగా విభజించాలని సూచించా మన్నారు. 1వ తరగతి నుంచే త్రి భాషా విధానం తెలుగు,ఉర్దూ, ఇంగ్లీష్,హిందీ ఉండేలా చూడాలన్నారు. అలాగే బోధన మొత్తం ఇంగ్లీష్ మీడియంలోనే ఉండాలని సూచించామన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం అమలు చేయాలని పేర్కొన్నామన్నారు. స్కూల్స్‌లో బ్రేక్‌ఫాస్ట్‌ను పెట్టాలన్నారు. ప్రస్తుతం తెలంగాణలో విద్యార్థిపై రూ. లక్ష ఖర్చు చేస్తున్నారని.. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం అమలు చేస్తే రూ. 50వేలతోనే సరిపోతుందని సూచించామన్నారు. దీని కోసం ఏడాదికి రూ. 3700 కోట్లతో ఐదేళ్లకు కలిపి రూ. 36వేల కోట్లతో రోడ్‌మ్యాప్ రూపొందించి ఇచ్చామన్నారు. ప్రస్తుతం అమలు జరుపుతున్న ఎప్‌సెట్ విధానాన్ని రద్దు చేయాలని, ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా ఇంజనీరింగ్ ఇతర కోర్సుల్లో అడ్మిషన్లను చేపట్టాలని సూచించామన్నారు. ప్రస్తుతం ఇంటర్‌లో మొదటి, ద్వితీయ సంవత్సరాలకు బోర్డు ఎగ్జామ్స్ నిర్వహిస్తున్నారని.. ఇంటర్ మొదటి సంవత్సరం(11వతరగతి)కి బోర్డు ఎగ్జామ్ అవసరం లేదని.. 10వతరగతిలో బోర్డు ఎగ్జామ్ ఉంది, 12వ తరగతిలోనూ బోర్డు ఎగ్జామ్ ఉన్నందున.. 11వ తరగతిలో బోర్డు ఎగ్జామ్ అవసరం లేదన్నారు. ప్రస్తుతం ఇంటర్‌కి, ఎస్ఎస్‌సికి రెండు బోర్డులు ఉన్నాయని.. రెండింటికి కలిపి ఒకటే బోర్డు ఉండాలని ప్రతిపాదించామన్నారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థి ఎన్నికలను నిర్వహంచాలని సూచించామన్నారు. ఐఏఎస్‌లను యూనివర్సిటీలకు వీసీలుగా నియమించొద్దని, యూనివర్సిటీలను స్వయంప్రతిపత్తి సంస్థలుగానే కొనసాగించేలా చూడాలన్నారు. ఎయిడెడ్ విద్యా సంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సూచించామన్నారు.

విద్యా హక్కుచట్టం(ఆర్‌టిఈ) ప్రస్తుతం 6 నుంచి 14 సంవత్సరాల వరకు నిర్బంధ ఉచిత విద్య హక్కుగా కొనసాగుతుందని దానిని కాస్త 3 నుంచి 18 సంవత్సరాలుగా అమలు చేయాలని సిఫారసు చేశామన్నారు. రాష్ట్రంలో విద్యారంగానికి ప్రస్తుం బడ్జెట్‌లో 7.4 శాతం నిధులను కేటాయి స్తున్నారని.. దానిని కాస్త 18 శాతానికి పెంచాలని ప్రతిపాదించామన్నారు.

# అర్హులైన ప్రతిపేదకు ఇందిరమ్మ ఇల్లు అందజేత లక్ష్యం: మంత్రి ఉత్తమ్

**హుజూర్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** నియోజకవర్గంలో ప్రతి పేదవానికి ఉండేందుకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇచ్చే లక్ష్యంగా ముందుకె ళ్తున్నానని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసర ఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఫణిగిరి రామ స్వామి గట్టు వద్ద నిర్మిస్తు న్న 2,160 సింగిల్ బెడ్ రూమ్ ఇండ్ల పనులను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తో కలిసి పరిశీలన చేసి అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పేదలకు సొంతగూడు కల్పించడం కోసం 2,160 ఇండ్లను ఒకే చోట నిర్మా ణం చేసి మార్చి నెలలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలకతీ తంగా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేసి పేదలకు అందిస్తామన్నా రు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి రూ 22,500 కోట్ల బడ్జెట్ కేటాయించి వాటి నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. అందులో భాగంగా రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో 125 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల ప్లాట్ల పెండింగ్ పనులను పూర్తిస్థాయిలో వేగవంతం చేసే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని వచ్చే నెలలో పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# నీతిఆయోగ్ కీలక ఖనిజ కమిటీ నిర్ణయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ప్రభుత్వ, ప్రైవేటు ఖనిజ పరిశ్రమలు కలిసి పనిచేస్తేనే కీలక ఖనిజరంగంలో అగ్రస్థానం సంపా దించవచ్చని నీతి ఆయోగ్ కీలక ఖనిజ కమిటీ నిర్ణయించింది. హైదరాబాద్ లో గురువారం కేంద్ర నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ డీ కే. సింగ్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో దేశంలో కీలక ఖనిజాల ఆవశ్యకత, లభ్యత, కీలక ఖనిజాల అన్వేషణ, అందుకు గల అవకాశాలు, వివిధ ప్రభుత్వ మైనింగ్ సంస్థలు తీసుకోవలసిన చొరవ, బాధ్యతలు తదితర అంశాల పైన లోతుగా చర్చించారు. నేటి ఆధునిక ప్రపంచంలో కీలక ఖనిజాలకు అధిక ప్రాధాన్యత ఉందని కమిటీ అభిప్రాయపడింది. కీలక ఖనిజ రంగంలో భారత్ ను స్వయం సమృద్ధి దేశంగా రూపుదిద్దడానికి దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు కలిసి పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కమిటీ వెల్లడించింది. ఈ

# ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతోనే ఖనిజ రంగంలో అగ్రస్థానానికి అవకాశం

సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ సోలార్ విద్యుత్తు, బ్యాటరీలతో నడిచే వాహనాలు, ఎలక్ట్రానిక్ రంగ విస్తరణలో, రక్షణ రంగంలో కీలక ఖనిజాల అవసరం ఎంతో ఉందని తెలిపారు. దేశంలో కీలక ఖనిజాల వనరులు ఉన్నప్పటికీ, వాటి మైనింగ్ జరగటం లేదని దీంతో ప్రస్తుతం విదేశాల నుండి కీలక ఖనిజాలను దిగుమతి చేసుకుంటున్నామని కమిటీ సభ్యులు వెల్లడించారు.

రానున్న కాలంలో కీలక ఖనిజాల వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది కనుక దేశంలో గల కీలక ఖనిజ వనరులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవడానికి ప్రభుత్వ మైనింగ్ సంస్థలు, ప్రైవేటు మైనింగ్ సంస్థలు కలిసి నడవాలని సూచించారు. ఇందులో పాల్గొన్న మిషన్ కమిటీ సభ్యులు సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ ఈ కమిటీ దేశ కీలక ఖనిజ అవసరాలు తీర్చడంలో తమ వంతు కృషి చేస్తుందన్నారు.

దీనికి సింగరేణి సంస్థ తన సంపూర్ణ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ మట్టిలో, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి వెలువడే ఫ్లై యాష్, బాటమ్ యాష్ లలో దాగి ఉన్న క్రిటికల్ మినరల్స్ ను వెలికితీయడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

జాతీయ కీలక ఖనిజ అవసరాలు తీర్చడంలో సింగరేణి సంస్థ తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కమిటీ మెంబర్ సెక్రటరీ, నీతి ఆయోగ్, డిప్యూటీ అడ్వైజర్ మినరల్స్ ఆర్. శరవణభవన్, కమిటీ సభ్యులై ఐఎంఎంటీ, కోల్ ఇండియా, సీఎస్ఐఆర్‌సీఈసీఆర్ఐ(కరైకుడి), గుజరాత్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, అదానీ, వేదాంత, లాయిడ్ మెటల్స్, హిందాల్కో, హిందుస్తాన్ జింక్, సన్ టెక్నాలజీస్ (చెన్నై) తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని వీడని అకాల వర్షాలు

ఆరు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారి... పిడుగులు పడే ప్రమాదం

హెచ్చరించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** వేసవి కాలం ప్రారంభం కాకముందే రాష్ట్రంలో వడగళ్లతో కూడిన అకాల వర్షాలు కురుస్తుండడం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం నాలుగైదు రోజులుగా తెలంగాణ రాష్ట్ర వాతావరణంలో స్పష్టమైన మార్పు కొనసాగుతోంది. రెండు రోజులుగా పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుండి శుక్రవారం ఉదయం వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. అదేవిధంగా మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూలు జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వర్షం కురిసే సమయంలో విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరికలు జారీ చేశారు. పొలాల్లో పనిచేసే వారు పిడుగులు పడే ప్రమాదం ఉననందున జాగ్రత్తగా ఉండాలని, వర్షం మొదలైనప్పుడు పొలాల్లోని చెట్ల కింద ఉండొద్దని, పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని, సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచించింది. మిర్చి, పుచ్చ, మామిడి, కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

# అగ్రశ్రేణి లాజిస్టిక్ హబ్‌గా తెలంగాణ

- 2047 నాటికి ఈ రంగంలో తిరుగులేని శక్తిగా రాష్ట్రం
- ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు
- ట్రాన్స్ పోర్ట్ లాజిస్టిక్ ఇండియా 2026 సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** తెలంగాణను దేశంలోని అగ్రశ్రేణి లాజిస్టిక్ హబ్ లల్లో ఒకటిగా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఆ దిశగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ ఇంటిగ్రేషన్, పాలసీ అండ్ రెగ్యులేటరీ ఫెసిలిటేషన్, సస్టైనబిలిటీ అండ్ గ్రీన్ లాజిస్టిక్స్, స్కిల్ డెవలప్ మెంట్ అండ్ ఇన్నోవేషన్‌తో కూడిన ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో మెస్సే ముంచెన్ ఇండియా(మెస్సే ముంచెన్ జర్మనీ అనుబంధ సంస్థ) నిర్వహిస్తోన్న ట్రాన్స్ పోర్ట్ లాజిస్టిక్ ఇండియా 2026 సదస్సులో గురువారం మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ దేశ ఆర్థిక గమనాన్ని నిర్దేశించే కీలక రంగాల్లో ప్రధానమైన లాజిస్టిక్ రంగంలో 2047 నాటికి తెలంగాణను తిరుగులేని శక్తిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. భౌగోళిక విస్తీర్ణంలో పదకొండు, జనాభాలో పన్నెండో స్థానంలో ఉన్న తెలంగాణ వాటా దేశ జిడిపిలో ప్రస్తుతం 5 శాతంగా ఉందన్నారు. దీనిని 2047 నాటికి 10 శాతానికి పెంచాలనే సంకల్పంతోనే తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌కు శ్రీకారం చుట్టామన్నారు. 3 ట్రిలియన్ డాలర్లకు తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చేర్చాలనే లక్ష్య సాధనలో లాజిస్టిక్ రంగానిదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసుల పునర్నిర్మాణం, ఏఐ ఆధారిత ఇంటెలిజెంట్ లాజిస్టిక్స్, సస్టైనబిలిటీ అనే మూడు ప్రధాన మార్పులు లాజిస్టిక్స్ రంగాన్ని సమూలంగా మార్చేస్తున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో భౌగోళికంగా మనకున్న అనుకూలతలను డిజైన్ అడ్వాంటేజ్‌గా మార్చుకుని సత్తా చాటేలా ముందుకెళ్తున్నామన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో ఫేజ్ – 2, కొత్త ఎయిర్ పోర్టులు, డ్రై పోర్టు, తెలంగాణ లాజిస్టిక్స్ పాలసీ 2.0 లాజిస్టిక్ హబ్స్ తదితర ప్రాజెక్టులు ఈ రంగంలో రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా మార్చుతాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ, ఇతర భాగస్వామ్య పక్షాల సహకారంతో లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన రెడీ టూ వర్క్ ఫోర్స్‌ను తయారు చేస్తున్నామని పునరుద్ఘాటించారు. కేవలం వస్తువులను ఉత్పత్తి చేయడమే కాకుండా, వాటిని ప్రపంచం ఊహించని వేగంతో డెలివరీ చేసి లాజిస్టిక్ పవర్ హౌస్‌గా ఎదిగే సత్తా తెలంగాణకు ఉందని స్పష్టం చేశారు. మల్టీ మోడల్, రైల్ లింక్డ్ అసెట్స్, ఎయిర్ కార్గో, కోల్డ్ చైన్, గ్రేడ్ – ఏ వేర్ హౌజింగ్, ఆటోమేషన్, డిజిటల్ ప్లాట్ ఫామ్స్, గ్రీన్ మొబిలిటీ తదితర కేటగిరీల్లో పెట్టుబడులు పెట్టి తెలంగాణ రైజింగ్‌లో భాగస్వామ్యం కావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. వేగవంతమైన అనుమతులు, పారదర్శకమైన పాలసీలు, ప్రోత్సాహకర విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## చొరబాటుదారుల్ని దేశం నుంచి తొలగిస్తాం..

బీహార్ నుంచే యాత్రపారంభిస్తామన్న అమిత్ షా



**పాట్నా, ఫిబ్రవరి 26:** చొరబాటుదారుల నుంచి విముక్తి అంటే కేవలం ఓటర్ల జాబితా నుంచి వారి పేర్లను తొలగించడమే కాదని భారత నేల నుంచి ప్రతి ఒక్క చొరబాటుదారుడిని తొలగించే కార్యక్రమాన్ని అమలు చేయాలని కేంద్రం నిశ్చయించుకుందని కేంద్రహోంమంత్రి అమిత్‌షా అన్నారు. బీహార్‌లోని సీమాంచల్‌లో అమిత్ షా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో సీమాంచల్ నుంచే చొరబాటుదారులను ఏరివేస్తామని వెల్లడించారు. ఈ రోజు భారత విప్లవకారుడు వీర్ సావర్కర్ వర్ధంతి. వీర్ సావర్కర్ స్వాతంత్ర్య పోరాటంలో అసమాన యోధుడు మాత్రమే కాదు. అపారమైన శక్తిని ప్రదర్శించిన నిర్భయ దేశభక్తుడు కూడా. తన సాహిత్యం ద్వారా దేశవ్యాప్తంగా దేశభక్తిని రగిలించారు. ప్రాథమిక సూత్రాలను ప్రతిబింబించే నాయకుడు. అంటరానితనాన్ని నిర్మూలించినా, భాషల శుద్ధి చేసినా, స్వచ్ఛమైన జాతీయవాద దృక్పథమైనా వీర్ సావర్కరే వీటన్నింటికీ అపారమైన కృషి చేశారు. తన మరణం వరకు అలాగే కొనసాగారు. ఈ రోజు మొత్తం దేశం తరఫున మన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు వీర్ సావర్కర్‌కు నివాళులు అర్పిస్తున్నాను అని అమిత్ పేర్కొన్నారు.

## ట్రంప్ బెదిరింపులతోనే అమెరికాతో ట్రేడ్ డీల్..

కేరళంలోని కన్నూర్‌లో రాహుల్‌గాంధీ



**తిరువనంతపురం, ఫిబ్రవరి 26:** ట్రంప్ బెదిరింపులతోనే అమెరికాతో ప్రధాని మోడీ వాణిజ్య ఒప్పందం చేసుకున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. కేరళంలోని కన్నూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. అమెరికన్ రైతులు భారతదేశంలో సోయాబీన్, మొక్కజొన్న, పండ్లను అమ్మడానికి అనుమతించడం ఏ భారతీయ ప్రధాన మంత్రి కూడా ఇలా అనుమతించరు. భారతదేశ పునాదిని బిజెపి నాశనం చేయబోతోంది. నాలుగు నెలలుగా భారతదేశం, అమెరికా వాణిజ్య ఒప్పందం నిలిచిపోయింది. భారత ప్రభుత్వం అమెరికన్ కంపెనీలకు భారత వ్యవసాయాన్ని తెరవడానికి ఇష్టపడలేదు. కాని అధ్యక్షుడు ట్రంప్ ప్రధానమంత్రి మోడీని బెదిరించారు. దీంతో లొంగిపోయారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగంపై వారు నన్ను మాట్లాడనివ్వలేదు. అమిత్ షా లేచారు. ప్రధానమంత్రి మోడీ నన్ను మాట్లాడనివ్వలేదు. వారు నన్ను ఎందుకు ఆపారు? ఎందుకంటే భారత ప్రధాని మోడీ చిక్కుకున్న రెండు సమస్యల గురించి నేను మాట్లాడబోతున్నానని వారికి తెలుసు. ఎప్‌స్టీన్ ఫైల్స్, అమెరికాలో అదానీ కేసు గురించి అని అన్నారు. అదానీ సాధారణ కంపెనీ కాదు. అదానీ బిజెపికి, భారత ప్రధానమంత్రికి ఆర్థిక మౌలిక సదుపాయాలు. మోడీకి ముప్పు చాలా స్పష్టంగా ఉంది అని అన్నారు.

## సోషల్‌మీడియా వేదికలు కంటెంట్ సృష్టికర్తతో రాబడులు పంచుకోవాల్సిందే..!

కేంద్ర సమాచార మంత్రి అశ్వినివైష్ణవ్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు తమ ఆదాయాన్ని కంటెంట్ సృష్టించేవారితో న్యాయబద్ధంగా పంచుకోవాల్సిందేనని కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. జర్నలిస్టులు, సంప్రదాయ మీడియా సంస్థలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, విద్యావేత్తలు, పరిశోధకులు ఇలా ఎవరైనా సరే, కంటెంట్ సృష్టిస్తే వారికి ఆదాయంలో సరైన వాటా దక్కాల్సిందేనని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్లాట్‌ఫామ్‌లు ఇతరులు అప్‌లోడ్ చేసే కంటెంట్ ద్వారా గణనీయంగా ప్రయోజనం పొందుతున్నాయని, అందుకే కంటెంట్ సృష్టికర్తలకు కూడా వారి సరైన వాటా దక్కాలని ఆయన పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లో ని కంటెంట్ క్రియేటర్ల నుంచి మొదలుకొని, తమ పరిశోధనలను పంచుకునే ప్రొఫెసర్ల వరకు అందరికీ ఈ న్యాయం జరగాలన్నారు. ఆదాయ పంపిణీలో న్యాయబద్ధతను తీసుకురావడం ద్వారా దేశంలో డిజిటల్ కంటెంట్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల జవాబుదారీతనం, పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేస్తున్న తరుణంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ గతేడాది ఐటీ రూల్స్ 2021కి కీలక సవరణలు ప్రతిపాదించింది. పెరిగిపోతున్న డీప్‌ఫేక్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా సృష్టించిన తప్పుడు సమాచారాన్ని అరికట్టడమే ఈ సవరణల లక్ష్యం. ఈ ముసాయిదా నిబంధనల ప్రకారం ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్‌చాట్ వంటి పెద్ద సోషల్ మీడియా సంస్థలు (50 లక్షలకు పైగా వినియోగదారులు ఉన్నవి) ఏఐ ఆధారిత కంటెంట్‌ను స్పష్టంగా లేబుల్ చేయాలి. వీడియోలు లేదా చిత్రాలైతే కనీసం 10 శాతం డిస్‌ప్లేను, ఆడియో అయితే మొదటి 10 శాతం వ్యవధిని ఈ లేబుల్ కవర్ చేయాలి. ఈ కంటెంట్‌కు శాశ్వత మెటాడేటా లేదా ఐడెంటిఫైయర్ జోడించా లని, దానిని మార్చడానికి లేదా తొలగించడానికి వీల్లేదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

# దళితులకు ఉన్నత విద్యా అందించడం సర్కార్ లక్ష్యం

త్వరలో అంబేద్కర్ టవర్

సంక్షేమ శాఖ మంత్రి

అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 26:** రాష్ట్రంలోని దళితులకు ఉన్నత విద్యా అందించడం సర్కార్ లక్ష్యమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. త్వరలో అంబేద్కర్ టవర్‌ను ఏరానపటు చేయనున్నామని, ఎస్సీ విద్యార్థులకు అత్యుత్తమ సివిల్స్, గ్రూప్–1, గ్రూప్–2 కోచింగ్ అందిస్తామని తెలిపారు. ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్ హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి తెలిపారు. ప్రతిభావంతులైన దళిత విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే చదువు ఒక్కటే మార్గమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. దళితులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి తెలిపారు. గురువారం 59 దళిత కులాల సంఘాల నాయకులు లోయర్ ట్యాంక్ బండ్ లోని అంబేద్కర్ భవన్‌ను, కాచిగూడ లోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ భవన్‌ను మోడర్న్ కోచింగ్ హబ్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కాచిగూడ హాస్టల్ కాంప్లెక్స్‌ను రెసిడెన్షియల్ అకాడమిక్ సెంటర్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నట్లు తెలిపారు. సివిల్స్ కోచింగ్ కోరకు తెలంగాణ విద్యార్థులు ఢిల్లీ బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని మంత్రి తెలిపారు. దళిత విద్యార్థులు ఢిల్లీ వంటి ప్రాంతాల్లో కోచింగ్ తీసుకోవడం ఖర్చుతో కూడిన పని కావడంతో.. ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్ సౌకర్యాలను హైదరాబాద్‌లోనే అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో విద్యార్థుల కోసం కొత్త టెక్నాలజీతో డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయడంతో పాటు అనుభవ జ్ఞులైన ఫ్యాకల్టీ, రిటైర్డ్ సివిల్ సర్వెంట్స్ గెస్ట్ లెక్చర్స్ తీసుకోవడంతో పాటు మాక్ టెస్టులు, ఇంటర్వ్యూ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పై ప్రత్యేక శ్రద్ధ పెడతామని తెలిపారు. కోచింగ్ తీసుకునే అభ్యర్థుల కోసం హాస్టల్, మెస్, స్టడీ హాల్స్ వంటి పూర్తి సదుపాయాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు అడ్మిషన్ లలో ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని మంత్రి తెలిపారు. కోచింగ్ సెంటర్ల ఒక హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం కాకుండా తెలంగాణలోని ప్రతి జిల్లాకు విస్తరించేలా దీర్ఘకాలిక ప్రణాళిక చేస్తామని మంత్రి తెలిపారు. ఎస్సీ యువతలో ఆత్మవిశ్వాసం పెంచే విధంగా మార్గదర్శకాలు రూపొందించి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీల ప్రాతినిధ్యం పెరిగే విధంగా ముందుకు సాగుతామని మంత్రి తెలిపారు. కోచింగ్ సెంటర్లను అకాడమిక్ ఎక్సలెన్స్ సెంటర్స్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని మంత్రి అన్నారు. తమిళనాడు మోడల్‌లా అత్యాధునిక సదుపాయాలతో నూతన భవనాలు నిర్మాణం చేస్తామని మంత్రి తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ గారు అలాగే మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్కారు ఆర్థిక క్రమశిక్షణ లోపం బహిర్గతం: ఎన్.వి.సుభాష్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో జీతాలు, పెన్షన్ల భారం ప్రమాదకర స్థాయికి చేరుతుందన్న ప్రతిపక్షాల హెచ్చరికలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు స్వయంగా ధృవీకరించడం, కాంగ్రెస్ సర్కారు ఆర్థిక క్రమశిక్షణారాహిత్యాన్ని అంగీకరించడమేనని బిజెపి తెలంగాణ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి. సుభాష్ అన్నారు. 16వ ఆర్థిక సంఘం చర్చల సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చేసిన వ్యాఖ్యలు, రాష్ట్రంలో గత దశాబ్ద కాలంగా కొనసాగుతున్న ఆర్థిక వైఫల్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చాయని ఆయన పేర్కొన్నారు. 2014లో నెలవారీ జీతాలు, పెన్షన్ల వ్యయం సుమారు రూ.1,500 కోట్లుగా ఉండగా, ప్రస్తుతం అది దాదాపు రూ.6,000 కోట్లకు చేరిందని సుభాష్ తెలిపారు. కేవలం పదేళ్లలోనే నాలుగు రెట్లు పెరిగిన ఈ వ్యయం, వరుస వేతన సవరణలు భత్యాల పెంపుల కారణంగా రాష్ట్ర ఖజానాపై తీవ్ర ఆర్థిక ఒత్తిడిని సృష్టించిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా కేవలం వారి వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి మాత్రమే పాకులాడటంతో రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులకు కారణమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదే అంశాన్ని స్వయంగా అంగీకరించడం గమనార్హం. ఆర్థిక నియంత్రణ లేకుండా, ప్రణాళిక లేని రాజకీయ నిర్ణయాలు రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభానికి దారితీస్తున్నాయని అన్నారు. ఈ పరిస్థితికి బాధ్యత ఎవరిదంటూ ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం జీతభత్యాల పెంపు విషయంలో స్పష్టమైన ప్రణాళిక లేకుండా, అపరిపక్వ విధానాలతో వ్యవహరించటం వల్ల ఆర్థిక సంక్షోభం ఏర్పడిందన్నారు.



## కేరళ ఆరోగ్యమంత్రి వీణాజార్జిపై దాడి..!

ఆసుపత్రిలోచికిత్స పొందుతున్న మంత్రి

**కన్నూర్, ఫిబ్రవరి 26:** కేరళ ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ పై దాడి కేరళ స్టూడెంట్స్ యూనియన్ (కెఎస్‌యు) నల్ల జెండాల ప్రదర్శన పేరుతో జరిపిన ఆందోళనల్లో మహిళా మంత్రి వీణా జార్జ్ మెడ, చేతికి గాయాలై ఆసుపత్రిలో చేరారు. కన్నూర్ రైల్వే స్టేషన్ వద్ద ఈ ఘటన జరిగింది. వందేభారత్ రైలులో ప్రయాణించేందుకు ఈనెల 25 న ఆమె కన్నూర్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. టికెట్ కౌంటర్ వద్ద ఈ దాడి జరిగింది. విద్యార్థి సంఘాలు జరిపిన ఈ ఆందోళనల్లో ఆమెకు గాయాలయ్యాయి. వెంటనే మంత్రి వీణా జార్జ్‌ను కన్నూర్ లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాంతో ఆమె ప్రయాణం రద్దు అయింది. ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ కు వ్యతిరేకంగా గత కొన్ని రోజులుగా కన్నూర్ జిల్లాలోని పలుప్రాంతాల్లో ఆందోళనలు చేపడుతున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న వైద్య నిర్లక్ష్య ఘటనలపై నిరసిస్తూ గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి విభాగం కేరళ స్టూడెంట్స్ యూనియన్‌కు చెందిన విద్యార్థులు నల్ల జెండాలతో ఆందోళన చేపడుతున్నారు. ఈ క్రమంలోనే మంత్రి వీణా జార్జ్ పై విద్యార్థి సంఘాల నాయకులు దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. కెఎస్‌యుకు చెందిన ఐదుగురు విద్యార్థి నేతలపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కేసులు నమోదైన వారిలో రీళీగే జిల్లా అధ్యక్షుడు ఎంసీ అతుల్, జిల్లా ట్రెజరర్ అక్షయ్ మట్టూల్, సీహెచ్ ముబాజ్, బితుల్ బాలన్, మహమ్మద్ యాసిన్ ఉన్నట్లు సమాచారం. మంత్రి వీణా జార్జ్ కన్నూర్ మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్నారు. ఆమె ఆరోగ్యంపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## దేవుడిగా చెప్పకొనే వ్యక్తి బాలిక పట్ల అనుచిత ప్రవర్తన.. కేసు నమోదు



**బెంగళూరు, ఫిబ్రవరి 26:** తనను తాను దేవుడిగా చెప్పుకునే వ్యక్తి ఒక బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. తల్లిదండ్రుల ఎదుటే ఆమె ముద్దుపెట్టు కున్నాడు. ఆ బాలిక అసౌకర్యంగా కనిపించినట్లు పిల్లల సంరక్షణ కమిటీ గుర్తించింది. ఆయనపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. కర్ణాటక లోని యాదిగిర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. షాహ పూర్‌లోని ఒక ఆశ్రమానికి చెందిన మల్లికార్జున ముత్తవ తనను తాను దేవుడిగా చెప్పుకుంటున్నాడు. ఏడేళ్ల బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. తల్లి దండ్రుల ఎదుటే ఆమెను హత్తుకుని ముద్దుపెట్టుకున్నాడు. కాగా, బాలిక తల్లి దండ్రులు దీనిని రికార్డ్ చేశారు. ఈ విడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీంతో ఇది వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో బాలిక పట్ల మల్లికార్జున ప్రవర్తనపై విమర్శలు వెల్లువెత్తాయి. కర్ణాటక రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ దృష్టికి ఇది వెళ్లింది. మల్లికార్జున చర్యల వల్ల ఆ బాలిక చాలా అసౌకర్యంగా కనిపించినట్లు గుర్తించింది. ఆయనపై చర్యలు తీసుకోవాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీని ఆదేశించింది. మరోవైపు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు ఆశ్రమాన్ని సందర్శించారు. మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన ఆ బాలిక, ఆమె తల్లిదండ్రుల స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. అయితే మల్లికార్జున చర్యలు తమకు అనుచితంగా అనిపించలేదని బాలిక తల్లిదండ్రులు చెప్పారు. ఈ నేపథ్యంలో అధికారులు వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆ తర్వాత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ పోలీసులకు నివేదిక ఇచ్చింది. మల్లికార్జున ముత్తవపై కేసు నమోదు చేయాలని సిఫార్సు చేసింది. ఆయనపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాదిగిర్ ఎస్పీ తెలిపారు.

# గాంధీ, పెట్లబుర్జు హాస్పిటల్స్‌లో ఐవీఎఫ్ సెంటర్లు భేష్

డాక్టర్లు, సిబ్బందికి అభినందనలు తెలిపిన మంత్రి దామోదర

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 26:** ఇన్‌ఫర్టిలిటీ సమస్యలకు మెరుగైన వైద్యం అందిస్తూ, ఎన్నో జంటల మాతృత్వపు కలలను సాకారం చేస్తున్న గాంధీ, పెట్లబుర్జు ఐవీఎఫ్ సెంటర్ల డాక్టర్లు, సిబ్బందికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందనలు తెలిపారు. గాంధీ ఐవీఎఫ్ సెంటర్‌లో ఐవీఎఫ్ చేయించుకున్న మహిళ, ఇటీవలే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఐవీఎఫ్ సేవల ద్వారా జన్మించిన తొలి శిశువుగా, పాప పుట్టుకతోనే కొత్త రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో జరిగిన కార్యక్రమంలో గాంధీ హాస్పిటల్ ఐవీఎఫ్ సెంటర్‌లో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బందిని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2024 అక్టోబర్‌లో గాంధీ ఐవీఎఫ్ సెంటర్, డిసెంబర్‌లో పెట్లబుర్జు ఐవీఎఫ్ సెంటర్‌లో ఫర్టిలిటీ వైద్య సేవలు ప్రారంభించుకున్నామన్నారు. ఇప్పటివరకూ సుమారు 27,300 మంది ఈ రెండు సెంటర్ల ద్వారా ఫర్టిలిటీ వైద్య సేవలు పొందారన్నారు. పెరిగిన ఇన్‌ఫర్టిలిటీ సమస్యకు ఈ నంబర్లు అద్దం పడుతున్నాయని, మరింత బాధ్యతాయుతంగా మనం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మాతృత్వపు కలను సాకారం చేసుకునేందుకు, ప్రైవేట్ ఐవీఎఫ్ సెంటర్లకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బంది పడే పరిస్థితులు ఉండకూడదన్నారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను త్వరలో ప్రారంభించబోతున్నామని మంత్రి స్పష్టం చేశారు. అదిలాబాద్ రిమ్స్, కొండాపూర్ ఏరియా హాస్పిటల్, నిజామాబాద్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లోనూ ఐవీఎఫ్ సెంటర్లను ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. ప్రభుత్వంగా మేము బిల్డింగులు కట్టి సౌకర్యాలు కల్పించగలుగుతాం, డాక్టర్లుసిబ్బందిని రిక్రూట్ చేయగలుగుతాం. కానీ, అక్కడ వైద్య సేవలు అందించాల్సింది మీరే(డాక్టర్లు, సిబ్బంది)..మీరు అడిగినట్టుగా ప్రమోషన్లు ఇస్తున్నాం, మీకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నాం. టీవీవీపీని డైరెక్టరేట్‌గా మారిస్తున్నాం, మీరు కూడా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. విధులకు గైర్హాజరవడాన్ని, నిర్లక్ష్యంగా ఉండడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. కొన్ని హాస్పిటళ్లలో అటెండెన్స్ తక్కువగా ఉందన్నారు. గాంధీ ఐవీఎఫ్ సెంటర్ హెడ్, డాక్టర్ శోభ, ప్రోగ్రామ్ ఆఫీసర్, డాక్టర్ సుమిత్ర నాయర్, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ ఫాతిమా రాణి, ఎంబ్రియాలజిస్ట్ శివకృష్ణ, నర్సింగ్ ఆఫీసర్ పద్మావతి మంత్రి సత్కరించి, వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన మూడో విద్యుత్ డిస్కం

ఏప్రిల్ 1 నుండి కార్యకలాపాలు | తొలి సీఎండిగా ఫరూఖీ నియామకం

సంస్థ పరిధిలో 30 లక్షల సర్వీసులు | బదిలీ అయిన రూ.9,032 కోట్ల రుణాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** వచ్చే 2026–27 ఆర్థిక సంవత్సరం నుండి రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు తలపెట్టిన మూడో విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) ప్రారంభం కానుంది. ఇందుకు గాను ఈ పంపిణీ సంస్థకు తొలి సిఎండిగా ముషారఫ్ ఫరూఖీని ప్రభుత్వం నియమించింది. ప్రధానంగా రాష్ట్రంలో ఉచిత విద్యుత్ అమలు చేస్తున్న వివిధ వర్గాల వారికి ప్రత్యేకించి ఈ కొత్త పంపిణీ సంస్థను అందుబాటులోకి తెస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ మూడో ఉచిత పంపిణీ సంస్థ ఏర్పాటు ప్రక్రియ వేగవంతంగా కొనసాగించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఏప్రిల్ 1వ తేదీ నుండి ఈ విద్యుత్ పంపిణీ సంస్థ తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఈ మేరకు దీనికి సంబంధి అధికారులు అవసరమైన కార్యాచరణ రూపొందించారు. గతేడాది డిసెంబర్ నెలలో ఇంధన శాఖ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తెలంగాణలో మూడవ విద్యుత్ పంపిణీ సంస్థ స్థాపనకు పరిపాలనా పరమైన చర్యలు ప్రారంభించబడ్డాయి. ప్రస్తుతం ప్రభుత్వం బిల్లులు చెల్లించే గృహాలకు ఇచ్చే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వ్యవసాయ విద్యుత్ సేవలు, హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డ్, లిఫ్ట్ ఇరిగేషన్ తదితర వాటికి సంబంధించిన దాదాపు 30 లక్షల సర్వీసులు, 489 ఎత్తిపోతల పథకాలు కొత్త డిస్కం పరిధిలోకి రానున్నాయి. అదేవిధంగా సుమారు 2 వేల మంది ఇంజనీర్లు, సిబ్బందిని ప్రస్తుత విద్యుత్ సంస్థల నుండి మూడో డిస్కంకు బదిలీ చేశారు. వ్యవసాయం, లిఫ్ట్ ఇరిగేషన్, మిషన్ భగీరథ వంటి ప్రభుత్వ ఉచిత విద్యుత్ కనెక్షన్ల నిర్వహణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేయనుంది. సరఫరాను మెరుగుపరచడం, పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడం మరియు ప్రస్తుత డిస్కంలపై భారం తగ్గించడం దీని ముఖ్య ఉద్దేశ్యంగా పనిచేయనుంది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలకు సంబంధించిన సుమారు 62,817 కోట్ల రూపాయల అప్పుల్లో కొంత భాగాన్ని, అంటే రూ.9,032 కోట్లను కొత్తగా ఏర్పాటయిన ఈ సంస్థకు బదిలీ చేసే ప్రక్రియ ఇప్పటికే దాదాపు పూర్తయినట్లు విద్యుత్ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

## వంద రోజులలో అన్ని శాఖలు విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలి: కె రామకృష్ణా రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై 100 రోజుల కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రితోపాటు రాష్ట్ర మంత్రులు ప్రజా ప్రతినిధులు పాల్గొనే ఈ వంద రోజుల కార్యక్రమంలో అన్ని శాఖల వారీగా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. సచివాలయంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని సి.ఎస్ నిర్వహించారు. స్పెషల్ సి.ఎస్‌లు జయేష్ రంజన్, వికాస్ రాజ్, సివి ఆనంద్, సంజయ్ కుమార్, మహేష్ దత్ ఎక్కా, సబ్యసాచి ఘోష్, నవీన్ మిట్టల్, దానకిషోర్, అహ్మద్ నదీమ్, తదితరులు హాజరైన ఈ సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, ఈ వంద రోజుల కార్యక్రమంపై ఈ నెల 28వ తేదీన నిర్వహించే కార్యదర్శుల సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతారని తెలిపారు. అదేవిధంగా మార్చ్ 1వ తేదీ ఆదివారం జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మార్చి 2వ తేదీ నుండి జూన్ 9 వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై ప్రతీశాఖ తమ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని, జిల్లా కలెక్టర్ల సమావేశంలో చర్చనీయాంశాలు వెంటనే రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు రాష్ట్ర మంత్రులు ప్రారంభిస్తారని దీనికి సంబంధించి ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ భవనాలను సిద్ధం చేయాలని అన్నారు. ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్, పంచాయితీ రాజ్, వ్యవసాయం, రెవెన్యూ, పర్యాటక, పరిశ్రమలు, మహిళా శిశు సంక్షేమం, గృహనిర్మాణం, రెవెన్యూ, విద్యుత్, కార్మిక తదితర అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సిఎస్ పేర్కొన్నారు. ముఖ్యంగా, పారిశుధ్యం గ్రామీణాభివృద్ధి ఆరోగ్య తదితర కార్యక్రమాలపై నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లకు అవగాహన చైతన్య కార్యక్రమాల మాదిరిగా కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సచివాలయంతోపాటు హెచ్.ఓ.డిలలో ఈ ఆఫీస్‌ను అమలు చేయాలని ఆదేశించారు.

## నాలుగైదు రోజుల్లో మండు వేసవి

మార్చి 2 నుండి 7 వరకు రాష్ట్రంలో మొదటి హీట్ వేవ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ప్రస్తుతం వేసవి రాకముందే వడగళ్ల రూపంలో కురుస్తున్న అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలకు వాతావరణశాఖ (ఐఎండి) మరో షాకింగ్ న్యూస్ చెబుతోంది. నాలుగైదు రోజుల్లో ఎండలు దంచికొడతాయని, మార్చి 2 నుండే భానుడు ప్రతాపం చూపించనున్నాడని తెలిపింది. ఈ ఏడాది వేసవిలో మార్చి నెల నుంచే రాష్ట్రం అత్యంత వేడి ప్రాంతంగా మారే అవకాశం ఉందని హెచ్చరిస్తోంది. దీంతో యాసంగి పంటలకు సాగునీటి కటకట తీవ్రంగా ఉండే ప్రమాదం పొంచి ఉందని వ్యవసాయనిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఐఎండీ హైదరాబాద్ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం. మార్చి 2 నుండి మార్చి 7 వరకు రాష్ట్రం మొదటి విడత హీట్ వేవ్‌ను ఎదుర్కొకుంటుందని సమాచారం. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మార్చి మొదటి వారంలోనే 40 డిగ్రీల మార్కును ఎండలు తాకవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు అధికారులు. తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా రాష్ట్రంలో భారీగా నీటి ఎద్దడి నెలకొనబోతోందని కూడా వాతావరణశాఖ హెచ్చరించింది. భారతదేశం ఈ ఏడాది అత్యంత కఠినమైన వేసవిని ఎదుర్కొబోతోందని భారత వాతావరణ శాఖ తాజాగా హెచ్చరించింది. సాధారణంగా ఏప్రిల్ మధ్యలో కనిపించే ఎండల తీవ్రత ఈ ఏడాది మార్చి మొదటి వారం నుండే మొదలుకానుందని పేర్కొంది. పసిఫిక్ మహాసముద్రంలో బలహీనపడుతు న్న పరిస్థితులు, అలాగే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వేడి అసాధారణ స్థాయిలో నమోదు కానున్నాయని అంచనా వేసింది. ఫిబ్రవరి చివరి నాటికే దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3–5 డిగ్రీలు ఎక్కువగా ఉండటం మండే వేసవి రానుందనడానికి సిగ్నల్ అని పేర్కొంది. ఈ కఠిన వాతావరణ పరిస్థితుల కారణంగ్గా రబీ పంటలు గింజ ముదిరే దశలోనే ఎండిపోయే ప్రమాదం ఉందని, ఇది దేశ ఆహార భద్రతపై ప్రభావం చూపుతుందని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. గాలిలో తేమ తగ్గి పొడి వాతావరణం వల్ల వడగాల్పులు ఎక్కువ కొనసాగే ప్రమాదముందని వాతావరణశాఖ హెచ్చరించింది.

# పనిని నాణ్యతగా చేద్దాం !



ఎంత పనిచేశాం అన్నది ముఖ్యం కాదు.. ఎంత బాగా చేశాం అన్నది ముఖ్యం. మరి ఆఫీసులో, ఇంట్లో గుట్టలుగా పేరుకున్న పనిని పద్ధతిగా, నాణ్యంగా చేయడం ఎలా అని ఎప్పుడైనా ఆలోచించారా? ఆలోచించండి. లేదంటే పనిని ఆస్వాదించడం మానేసి, ఒత్తిడిగా భావిస్తారు.

✦ ఒకదాని తర్వాత మరొకటి చేసుకుంటూ వెళ్లిపోవడం కాకుండా మీపనిని విభజించుకోండి. అరగంటలోపు పూర్తయ్యేవి చిన్నవి. అంతకన్నా ఎక్కువ సమయం పట్టేవి పెద్దవి. ముందు పెద్దవి చేసేస్తే చిన్నవేముంది. చకచకా చేసుకుంటూ వెళ్లొచ్చు అనిపిస్తుంది కదా! కానీ చిన్నవే తొలుత పూర్తిచేయండి. ఏముందిలే అనుకుంటాం కానీ వీటినే త్వరగా మర్చిపోతాం. ✦ మన ఆడవాళ్ల పరిస్థితే విచిత్రం. ఆఫీసులో పని చేయాలి. ఇంటి బాధ్యతలనూ ఓ కంట కనిపెట్టుకోవాలి. ఆ రోజు భర్త, పిల్లలకు గుర్తు చేయాల్సినవి ఏమైనా ఉన్నాయా? ఇంట్లో గమనించుకోవల్సిన విషయాలు, పిల్లలు పూర్తిచేయాల్సిన హోంవర్క్‌లు వంటివి ఏమైనా ఉంటే ముందుగానే వాళ్లకో మెసేజ్ పెట్టేయండి. పని మీద నుంచి దృష్టి పక్కకు మళ్లదు. ✦ ఆఫీసులో కొన్ని మీరే పూర్తి చేయాలి. వాటితో సమస్య ఉండదు. మరికొన్ని ఇతర విభాగాలతో కలిసి చేసేవి ఉంటాయి. ఇలాంటి వాటి విషయంలో వాళ్లతో ఎలా చేయాలన్నది ముందుగానే మాట్లాడండి. ఆఖరి నిమిషంలో హడావుడి, పొరపాట్లకు తావుండదు. మర్చిపోతామని జాబితాగా రాసుకుని పెట్టుకోవడం చాలామందికి అలవాటే! మంచిదే కానీ అది కళ్ల ముందు కనిపిస్తోంటే తెలియకుండానే ఒత్తిడి పెరుగుతుందట. కాబట్టి, పక్కన పెట్టేయండి.

## ముఖం అందంగా ఉండాలంటే ..



ముఖం అందంగా ఉండాలంటే పార్లర్ల వద్దకే వెళ్లాల్సిన పనిలేదు. మన ఇంట్లో దొరికే వాటితోనే చక్కటి నిగారింపును సొంతం చేసుకోవచ్చు. పైగా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. అందుకోసం ముఖంపై కాస్త శ్రద్ధ పెట్టి ఇంట్లో ఉంటే సహజసిద్ధమైన వాటిని అప్లై చేసి మచ్చలేని చందమామలా ఉండే ముఖాన్ని సొంతం చేసుకుండి. అందుకు ఈ సింపుల్ రెమిడీస్‌ని ఫాలోకండి. ● రోజూ పెదవులకు కాస్తంత మీగడ రాసిన సున్నితంగా మర్దన చేస్తే పదవులు పగడలకుండా గులాబీ రేకుల్లా మెరుస్తాయి. ● ముఖాన్ని రోజుకు రెండు మూడుసార్లు గోరువెచ్చటి నీటితో కడుక్కుని పొడి టబల్‌తో చక్కగా తుడిచేస్తే మొటిమల వంటివిరావు. ● లేత కొబ్బరిని మెత్తగా మెదిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకుని, ఆరిన తర్వాత కడిగేసుకుంటూ ఉండాలి. ఇలా చేస్తుంటే ముఖం చక్కగా అందంగా కనబడుతుంది. ●. రకరకాల షాంపూల బదులు కుంకుడు కాయరసం లేదా సీకాయ పొడితో తలస్నానం చేయడం వల్ల చుండ్రు, కేశ సంబంధమైన సమస్యలు రాకుండా జుట్టు ఆరోగ్యంగా నిగనిలాడుతుంది. ●. తల స్నానం పూర్తయిన తర్వాత, చివరి మగ్గు నీటిలో కొంచెం నిమ్మరసం కలిపి తలమీద పోసుకుంటే జుట్టు, చర్మ

## చిన్న వయస్సులో పీఠాధిపతి

శృంగేరీ 34వ పీఠాధిపతి చన్ద్రశేఖర భారతీ తీర్థ మహాస్వామి. కర్ణాటకలోని శృంగేరీ వాస్తవ్యులు గోపాలశాస్త్రీ, లక్ష్మమ్మ దంపతుల 14వ సంతానం చంద్రశేఖర భారతీస్వామి. అసలు పేరు నరసింహ శాస్త్రి, మిగిలిన 13 మంది అనారోగ్యంతో బాల్యదశలోనే చనిపోయారు. ఈ బాలుడైనా బతికితే చాలనుకున్న తల్లిదండ్రులు.. తాము పెంచకుండా శృంగేరీ మఠాధిపతి శ్రీ కంఠశాస్త్రికి అప్పజెప్పారు. అతడు చిన్నతనంలోనే దైవంపట్ల అపార భక్తితో ఉంటూ ఎక్కువ సమయం దేవాలయంలోనే ఏకాంతంగా గడిపేవాడు. శృంగేరీలో విద్యనభ్యసిస్తున్న ఆ బాలుడిపై అప్పటి పీఠాధిపతి సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీ స్వామి దృష్టి పడింది. ఆయన సూచన మేరకు శృంగేరీ పీఠం నిర్వహిస్తున్నారు వేద పాఠశాలలో చేర్చారు. అక్కడ వేదాధ్యయనం పూర్తయిన తర్వాత, తర్క, మీమాంస శాస్త్రాలు అభ్యసించేందుకు వారి ఆధ్వర్యంలో బెంగళూరు వేద పాఠశాలకు పంపారు. అతడి అపార తెలివితేటలను గుర్తించిన పీఠాధిపతి తదుపరి ఉత్తరాధికారిగా నియమించాలని నిర్ణయించారు. ఈలోగా పీఠాధిపతి సచ్చిదానంద శివాభినవ నృసింహభారతీ స్వామి తమకి నిర్యాణ కాలం సమీపిస్తున్నదని గ్రహించారు. వెంటనే నరసింహ శాస్త్రిని బెంగళూరు నుంచి తీసుకురమ్మని వర్తమానం పంపారు. ఆయన వచ్చేలోగా ఉత్తరాధికారిగా నియమిస్తున్నట్లు మైసూర్ మహారాజుకు, తల్లిదండ్రులకు, పీఠంలోని మఠాధిపతికి సమాచారం ఇచ్చారు. బతికివున్న ఒక్కగానొక్క కొడుకును దైవ సేవకు అంకితం చేయడం తల్లిదండ్రులకు బాధకలిగించినా వ్యతిరేకించలేదు. నరసింహ భారతీ తీర్థ స్వామి పొందారు. ఆయన అంత కుముందే తన నిర్ణయం వెల్లడించినందున సమస్య ఉత్పన్నం కాలేదు.



వినయన

పెన్ను సరిగ్గా పట్టుకుని నాలుగు అక్షరాలు రాయలేదు. కానీ, ప్రేమ... కలలు... లక్ష్యాలు... ఇలా ఆమె కవితల్లో జాలువారే అంశాలెన్నో! నాలుగు అడుగులు వేయాలన్నా కష్టమే. అయితేనేం తన కలలకు రెక్కలు కట్టి, కావాల్సిన తీరాలకు తీసుకెళ్లగలదు. మాట సరిగ్గా రాదు... కానీ ఎంతోమందిలో స్థైర్యం నింపగలదు. వినయనా ఖురానా... స్ఫూర్తికి చిరునామా ఆమె!

ప్రతి ఒక్కరికీ జీవితంలో సవాళ్లు ఉంటాయి కదా! నా విషయంలో మాత్రం జీవితమే సవాలు అంటుంది వినయన. అవును మరి నడవలేదు. చేతులతో ఏది సరిగ్గా పట్టుకోలేదు. అంతెందుకు, మాట కూడా స్పష్టంగా చెప్పలేదు. దీనికి తోడు జాలి చూపులు, ఈ అమ్మాయి ఎలా బతుకుతుంది? ఎవరు పెళ్లి చేసుకుంటారంటూ మాటలు. వినయనాకి సెరిబ్రల్ పాల్సీ అయితేనేం, అది నన్ను ఆపలేదు అంటుందీమె. వినయనది ఢిల్లీ. సెరిబ్రల్ పాల్సీ కారణంగానే కాళ్లు, చేతులూ, మాట సమస్యలు. చిన్నప్పుడు నడవడం అసాధ్యం అన్నారు డాక్టర్లు. అలాగని ప్రయత్నించకుండా ఉండలేక పోయాను. రోజూ గోడ కుర్చీ పట్టుకుని సాధన చేసేదాన్ని. ఇప్పటికీ అడుగులు వేయ గలను కానీ, ఎక్కువ దూరాలు నడవలేను. 11ఏళ్ల కష్టమది. అంటే... ప్రయత్నించే ఏదైనా మార్చొచ్చు అనేగా! కన్ను, చేయి సమన్వయం కష్టమే అయినా తినడం, తాగ డం, రాయడం ప్రయత్నిస్తుంటా. రాయడం కష్టమవుతోందని కంప్యూటర్ వాడినా... చాలా త్వరగా అలసిపోతుంటా. ఎందుకంటే వేళ్లతో సాధ్యం కాదని ముక్కునీ ఉపయోగిస్తే నొప్పికి తోడు కీబోర్డు మీద ఒక్కో అక్షరం చూసుకుని నొక్కడానికి చాలా సమయం తీసుకుంటుంది. దాంతో విపరీతంగా కోపమొచ్చేది. అయినా పట్టుదలగా కొనసాగిస్తా. అప్పుడే నా ఆలోచనలు, భావోద్వేగాలు ప్రపంచానికి తెలియజేయగలిగేది అనే వినయన... కవితలు, చిన్న కథలు బాగా రాస్తూ పేరు తెచ్చుకుంది. పుస్తకాలూ రాసింది. తన రచనల్ని లోక్ సభలోనూ చదివి

## తన రచనల్ని లోక్ సభలో చదివి వినింపించారు !

వినిపించారు. టీవీ ద్వారా అవి అందరికీ చేరువైనప్పుడు సాధించా అనకుండట వినయన. ఆ క్షణం నిస్సహాయత ఆవరించింది. తనకంటూ గుర్తింపు తెచ్చుకుంటున్నా అనుకున్నప్పుడు మరో దెబ్బ. ఈసారి అనారోగ్యంతో మంచానికే పరిమితమైందామె. వినయనకి ఆ క్షణం నిస్సహాయత ఆవరించేసిందట. ఒఅప్పుడు తల్లి తనకు అండగా నిలిచింది. తన ఆలోచనలకు అక్షర రూపమిచ్చింది. ఈ స్థితిలోనూ చదువుని ఆపలేదు వినయన. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ, ఎంఏ, ఇంగ్లిష్‌లో ఎంఫిల్ పూర్తి చేసింది. తన కాళ్లమీద తను నిలబడాలను కుంది. ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్లినప్పుడు మీరొక్కరే వచ్చారా? ఈ లోపం నుంచి బయట పడగలరా? సాయం లేకుండా పనులు చేయగలరా? జీతం తక్కువైనా పర్లేదు కదా? వంటి ప్రశ్నలు అడుగుతుంటారు. ప్రతి ఒక్కరూ నా అంగవైకల్యాన్ని చూసేవారు తప్ప నా సామర్థ్యాలను కాదు. అయితే ఇది నా ఒక్కదాని సమస్యే కాదు, నాలాంటి చాలామందికి అర్థమైంది అనే వినయన తరవాత లైఫ్ కోచ్‌గా మారింది. అందరిలోనూ ఆత్మవిశ్వాసం నింపడమే కాదు. తనలాంటి వాళ్లకి ధైర్యమిస్తోంది. యూనిసెఫ్ నుంచి ఆహ్వానం, అక్కడ ప్రసంగించింది. రాష్ట్రపతి ప్రత్యేకంగా తనని పిలిపించుకుని మరీ మాట్లాడారు. ఢిల్లీ యూనివర్సిటీలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తోంది. ఎంతోమందికి మెంటారింగ్ చేస్తోంది. సోషల్ మీడియా ద్వారా స్ఫూర్తిని నింపుతుంది. ఈ అవార్డులూ రాష్ట్రపతి ప్రత్యేకంగా తనని పిలిపించుకుని మరి మాట్లాడారు. అందుకుంది. అవును పెన్ను పట్టుకోలేను. ఏకధాటిగా మాట్లాడలేను. అయితేనేం, నాకంటూ ఆలోచనలున్నాయి. సృజనాత్మకత ఉంది. అంతకుమించి నాపై నాకు నమ్మకం, సాధించాలన్న తపన ఉంది. నిజానికి ఎవరికైనా ఇవి చాలు... కోరుకున్నదేదైనా సాధించొచ్చు. నేను చెప్పేదీ ఇదే నాంటోన్న వినయన అందరికీ స్ఫూర్తిదాయకమే అంటే కాదనగలమా?

## తినేటప్పుడు ఫోన్ చూస్తున్నారా..



ఈ రోజుల్లో చాలామంది తల్లులు పిల్లలకు ఫోన్ చూపిస్తూ అన్నం తినిపిస్తుంటారు. క్రమంగా ఈ అలవాటే వ్యసనంగా మారి, వారిలో కొన్ని రకాల మానసిక సమస్యలు తలెత్తుతాయని హెచ్చరిస్తున్నారు నిపుణులు. ✦ అదే పనిగా ఫోన్‌చూస్తుండడం వల్ల కళ్లు బలహీనంగా మారతాయి. రెటీనాపై ప్రభావం పడి, చిన్నవయసులోనే దృష్టిలోపాలు వచ్చే అవకాశం ఉంది. ఫోన్‌చూస్తూ తింటుంటేసరిగ్గా నమలకుండా తొందరగా మింగేస్తుంటారు పిల్లలు. దానివల్లఆహారం తేలిగ్గా జీర్ణమవదు. తద్వారాగ్యాస్, మలబద్ధకం, కడుపుబ్బరం వంట సమస్యలు తలెత్తుతాయి. ✦ పిల్లలు ఫోన్ చూస్తూ తినడం వల్ల ప్లేట్‌లో ఏముందో కూడా అంతగా పట్టించరుకోరు. అవసరానికి మించి తింటుంటారు. దీని వల్ల ఊబకాయంవచ్చే ముప్పంది. ఎప్పుడైనా పిల్లలు ఏం తింటున్నాం. ఎంత తింటున్నా అన్న స్పృహతో తిన్నప్పుడే వారు ఆరోగ్యంగా ఎదుగుతారు. లేదంటే ఫోన్ మాయలో పడి చుట్టూ ఏం జరుగుతున్నా పట్టనట్లు ఉంటారు. ఎవరితోనూ కలవడానికి ఒప్పుకోరు. ఈ అలవాటు మంచిది కాదు. ఇదే కొనసాగితే భవిష్యత్తులోనూ ఒంటరితనాన్నే కోరుకుంటారు. అందుకే భోజనం చేసేటప్పుడు కుటుంబం మొత్తంకలిసి తినేలా చూసుకోండి.

## బొప్పాయి కూట్



**కావల్సిన పదార్థాలు:** సగం పండిన బొప్పాయి ఒకటి కందిపప్పు: చిన్న కప్పుధనియాలు: ఒక టేబుల్ స్పూన్పచ్చి కొబ్బరి: కొద్దిగా జీలకర్ర: అర స్పూనుమిరియాలు: అర స్పూను పల్లీలు: అర కప్పుఎండు మిరపకాయలు: నాలుగైదుఆవాలు: అర స్పూనుఇంగువ: చిటికెడునూనె: నాలుగు టేబుల్ స్పూన్లు ఉప్పు: రుచికి తగినంత. **తయారీ :** ముందుకు బొప్పయిని చెక్కు తీసి చిన్న చిన్న ముక్కలుగా తరుక్కోవాలి. పల్లీలను వేయించి పక్కకు పెట్టుకోవాలి. పప్పును ఉడికించుకోవాలి. ఇప్పుడు మిక్సీ జార్‌లో పచ్చికొబ్బరి, ధనియాలు, జీలకర్ర, మిరియాలు, ఎండు మిరపకాయలు, వేయించిన పల్లీలు వేసి మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. దీంతోపాటు నాలుగైదు బొప్పాయి ముక్కల్ని కూడా మిక్సీ తిప్పుకొని ఆ ముద్దను పక్కకు పెట్టుకోవాలి. బాణట్లో కొద్దిగా నూనె వేసి తరిగిన బొప్పాయి ముక్కలు వేసి కొద్దిగా నీళ్లు చల్లి మూత పెట్టి మగ్గనివ్వాలి. తర్వాత ఇందాక పట్టి పెట్టుకున్న మసాలా ముద్ద, పసుపు, సరిపడా ఉప్పు, ఉడికించి పెట్టుకున్న పప్పుతో పాటు ఒక గ్లాసుడు దాకా నీళ్లు పోసి బాగా మరగనివ్వాలి. చివర్లో జీలకర్ర, ఆవాలతో ఇంగువ పోపు వేస్తే కర్ణాటక స్టయిల్ బొప్పాయి కూట్ సిద్ధమైపోతుంది.

## నాగార్జున శోభు మిహిరా విజువల్ ల్యాబ్స్



హాలీవుడ్ టెక్నాలజీ ఫిల్మ్ డిజైన్‌తో కలిసి స్థాపించిన A M మోషన్ క్యాప్చర్ ఫెసిలిటీని లాంచ్ చేసిన ఎస్.ఎస్ రాజమౌళిఅన్నపూర్ణ స్టూడియోస్‌లో భారతీయ సినీ పరిశ్రమకు కొత్త అధ్యాయం ప్రారంభ మైంది. దేశంలో అత్యాధునిక మోషన్ క్యాప్చర్ సదుపాయాన్ని ఆవిష్కరిస్తూ, భారతీయ సినిమాల సృజనాత్మకతకు, సాంకేతికతకు కొత్త దిశను చూపింది. కింగ్ అక్కినేని నాగార్జున అన్నపూర్ణ స్టూడియోస్, విజనరీ ప్రొడ్యూసర్ శోభు యార్లగడ్డ స్థాపించిన మిహిరా విజువల్ ల్యాబ్స్ కలిసి ఏర్పాటు చేసిన ఈ ఫెసిలిటీకి A M MoCap Lab అని పేరు పెట్టారు. హాలీవుడ్‌లో ప్రముఖ మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ భాగస్వామి అయిన Animatrik Film Design ఈ ల్యాబ్‌కు సాంకేతిక శక్తిని అందించింది. ఫిబ్రవరి 20న ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి చేతుల మీదుగా ఈ ఫెసిలిటీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా మహేష్ బాబు, ప్రియాంక చోప్రా జోనాస్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కు తున్న తన కొత్త చిత్రం 'వారణాసి'లో కీలక సన్నివేశాలను ఈ మోషన్ క్యాప్చర్ టెక్నాలజీతో చిత్రీకరించినట్టు ఆయన వెల్లడించారు.

## 'సన్ ఆఫ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత, హీరో సాయి సింహాద్రి..



సాయి సింహాద్రి సైన్మా బ్యానర్ మీద సాయి సింహాద్రి హీరోగా, నిర్మాతగా చేసిన చిత్రం "సన్ ఆఫ్. ఈ మూవీని బత్తుల సతీష్ తెరకెక్కించారు. ఈ సినిమాని ఫిబ్రవరి 27న రిలీజ్ చేయబోతో న్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మాత, నటుడు అశోక్ కుమార్, రామ సత్య నారాయణ రాజు, లైన్ వెంకట్, కన్నా రవి, రామకృష్ణ గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో....నిర్మాత, హీరో సాయి సింహాద్రి మాట్లాడుతూ.. .."సతీష్ గారు సన్ ఆఫ్ కథను నాకు చెప్పినప్పుడు షాక్ అయ్యాను. ఆయన చెప్పిన కథను విన్న తరువాత నా జీవితంలో జరిగినట్టుగానే ఉంది కదా అని అనిపించింది. యదార్థ ఘటనలతో ఈ మూవీని తెరకెక్కించారని కూడా చెప్పుకోవచ్చు. ..నటుడు, నిర్మాత అశోక్ కుమార్ మాట్లాడుతూ.. .. సన్ ఆఫ్ టైటిల్ చాలా బాగుంది. అందరికీ కనెక్ట్ అవుతుంది. తండ్రీ కొడుకుల సెంటిమెంట్‌తో సినిమా ఉంటుందని టైటిల్ చూస్తేనే తెలుస్తోంది. అన్నారు... డిస్ట్రిబ్యూటర్ శోభా రాణి మాట్లాడుతూ.. .. సాయి సింహాద్రి సన్ ఆఫ్ రిలీజ్ విషయంలో ఇబ్బంది పడ్డాడు. ఆ టైంలో సింహాద్రి నా వద్దకు వచ్చాడు. ఐదు థియేటర్లో రిలీజ్ చేస్తే చాలు అని సింహాద్రి అన్నాడు. కానీ ఇప్పుడు ఈ చిత్రాన్ని 300 థియేటర్లలో విడుదల చేస్తున్నాం.

తెర







## వాళ్లిద్దరూ... ఒక్కటయ్యారు!

### ఉదయ్‌పూర్‌లో వైభవంగా విజయ్ దేవరకొండ-రష్మికల వివాహం

మన టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ అలాగే నేషనల్ క్రష్ రష్మిక మందన్నల వివాహం రోజు సినీ వర్గాలు ఇంకా సోషల్ మీడియాలో హడావుడి జరుగుతున్న సంగతి అందరికీ తెలిసిందే. ఇక ఈ ఫిబ్రవరి 26 ఉదయం ఎట్టకేలకి ఈ జంట భార్యాభర్తలుగా ఒక్కటయ్యారు. అయితే ఈ వార్తలు బయటకి వచ్చేసాయి.చిన్న లీక్ కూడా బయటకి రాకపోవడంతో వారి పెళ్లిలో ఆనంద క్షణాలు చూడాలని ఎదురు చూస్తున్న వారికి మరింత సస్పెన్స్‌గా మారింది. కానీ ఫైనల్‌గా విజయ్ దేవరకొండ తమ పెళ్లిలో మధుర క్షణాలని పంచుకున్నాడు. రష్మికతో కలిసి ఏడడుగులు నడిచిన ఆ ఎమోషనల్ మూమెంట్స్‌ని సోషల్ మీడియాలో పంచుకోవడంతో అభిమానులు మరింత ఎమోషన్ అవుతున్నారు. ఇక ఈ ఫోటోలలో ఇద్దరి నడుమ భావోద్వేగం కూడా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. దీనితో ఈ ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి.

## 'వృషకర్మ' ఫస్ట్ గ్లింప్స్ మార్చి 5న రిలీజ్



తండేల్ బ్లాక్ బస్టర్ విజయంతో అద్భుతంగా సాగుతున్న యువ సామ్రాట్ నాగ చైతన్య, తన తొలి బ్లాక్‌బస్టర్ ఖివిరూపాక్షఖితో ఆకట్టుకున్న ఫిల్మ్ మేకర్ కార్తీక్ దండుతో కలిసి ప్రతిష్టాత్మక మిథికల్ థ్రిల్లర్ ఖివృషకర్మఖి చేస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని శీజుదిది, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి, బాపినీడు ఈ ప్రాజెక్ట్‌ను సమర్పిస్తున్నారు. బిహైండ్ ది సీన్ వీడియోలు, ఫస్ట్ లుక్ తో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. మేకర్స్ సినిమా ఫస్ట్ గ్లింప్స్ గురించి అప్‌డేట్ ఇచ్చారు. గ్లింప్స్ వృషకర్మ ఆధ్యాత్మిక ప్రపంచంలోకి మొదటి స్నీక్ పీక్ ఇవ్వడానికి మార్చి 5న విడుదల కానుంది. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో నాగ చైతన్య ఒక చీకటి గుహలో నిలబడి, పైనుండి దూసుకు వస్తున్న పదునైన కాంతి కిరణాలతో తడిసి ముద్దవుతున్నట్లు కనిపిస్తోంది. అతని కండలు తిరిగిన శరీరం, ఇంటెన్స్ లుక్ అద్భుతంగా వుంది. నడుముకు కట్టుకున్న క్లైంబింగ్ గేర్, చేతిలో ఉన్న తవ్వే ఆయుధం అతని పాత్ర ఎంత ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళ్లిందో సూచిస్తున్నాయి. చుట్టూ ఉన్న రాళ్లు, తాళ్లు, అసమానమైన భూభాగం ఈ కథలో అడ్వెంచర్, థ్రిల్ స్థాయిని మరింత పెంచుతున్నాయి. ఈ పాత్ర కోసం నాగ చైతన్య మ్యాసీవ్ ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. రా, రగ్గడ్ లుక్ కోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకుని, అనేక థ్రిల్లింగ్ స్టంట్స్ ను స్వయంగా చేస్తున్నారు. దర్శకుడు కార్తిక్ దండు తన బ్లాక్‌బస్టర్ డెబ్యూ తర్వాత వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఉన్న అంచనాలను దృష్టిలో పెట్టుకుని, వృషకర్మను మరింత ఇమర్సివ్‌గా తీర్చిదిద్దడంపై ప్రత్యేక శ్రద్ధ వివీ తీసుకుంటున్నారు.

## 'హేబల్‌వంత్' చిత్రం బ్రేక్ ఈవెన్ సాధించింది



ప్రామి సింగ్ కథా నాయకుడు సుహాస్, శివానీ నాగారం జంటగా రూపొందిన హిలేరియస్ ఎంటర్‌టైనర్ 'హే బల్‌వంత్'. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడి యోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసు కొచ్చారు. ఈనెల 20న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల అభినందనలతో పాటు, విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ బ్లాక్‌బస్టర్ టాక్‌తో దూసుకపోతుంది. నిర్మాత బి.నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ మా బ్యానర్‌లో వచ్చిన తొలి సక్సెస్ ఇది. చూసిన ప్రతి ఒక్కరూ ఎంతో సంతృప్తి చెందారు. ఓ మంచి సినిమా తీశానని అభినందించారు. కొన్ని థియేటర్స్‌కి వెళ్లి నేను ఆడియన్స్ మధ్యలో సినిమా చూశాను. సినిమా ను అందరూ ఎంతగానో ఎంజాయ్ చేస్తు న్నారు. దర్శకుడు గోపీ అచ్చెర మాట్లాడుతూ ఈ మూవీ చూసిన అందరూ ప్రశంసలు కురిపిస్తుంటే ఆనందంగా ఉంది. హీరోయిన్ శివానీ నాగారం మాట్లాడుతూ ఈ సినిమాకు విజయం అందించిన ప్రేక్షకులకు కృత జ్ఞాతలు. సుహాస్ మాట్లాడుతూ అంబాజీ పేట సినిమా తరువాత నా సినిమాల కలెక్షన్లు మినిమమ్ నెంబర్లు కూడా కనబడకపోవడంతో భయమేసింది. వంశీ నందిపాటి మాట్లాడుతూ చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమాకు బ్రేక్ ఈవెన్ కావడం నాకు ఎంతో హ్యాపీనెస్ ఇచ్చే విషయం.

## 'విష్ణు విన్యాసం' ష్యూర్ షాట్ హిట్: శ్రీవిష్ణు



కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు హిలేరియస్ జాయ్‌రైడ్ 'విష్ణు విన్యాసర్గో అలరించబోతున్నారు. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ చిత్రంలో శ్రీ విష్ణు సరసన నయన్ సారిక హీరోయిన్ గా నటిస్తోంది. ఇపటికే ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఫిబ్రవరి 27న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ లో కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం, విష్ణు విన్యాసం సినిమా మొదలవడానికి మొదటి కారణం చారి గారు. ఆయన ద్వారానే మారుతి పరిచయమయ్యారు. కథ చెప్పినప్పుడు నాకు చాలా నచ్చింది. అలాగే మన నిర్మాతలు సుబ్రమణ్యం గారు సుమంత్ గారు సినిమాని అద్భుతంగా ప్రొడ్యూస్ చేశారు.హీరోయిన్ నయన్ సారిక మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా బ్యాక్ బోన్ నిర్మాతలు.

ఆట



# గెలిచి నిలిచారు!

## ధనాధన్ బ్యాటింగ్ ● జింబాబ్వేపై ఘనవిజయం ● సెమీస్ ఆశలు సజీవం



*గెలిస్తేనే నిలుస్తాం... ఇది టీమిండియాకు పక్కా తెలుసు. అందుకే జింబాబ్వేపై మూకుమ్మడిగా దాడి చేశారు. అభిషేక్ నుంచి మొదలుకుంటే సంజూ శాంమ్సన్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ వరకు అందరిదీ హిట్టింగ్ మంత్ర. వచ్చిన వాళ్లు వచ్చినట్టే.. వచ్చిన బంతిని వచ్చినట్టే ఫోర్ లేదంటే సిక్స్.. ఏ బౌలర్‌ను వదల్లేదు. చూస్తుండగానే 250 ప్లస్... 17 ఫోర్లు మరో 17 సిక్స్‌లు.. బౌండరీల రూపంలోనే 170 రన్స్. ఇలా బాదితేనే ఉంటామన్నది తెలుసు కాబట్టి అందరూ తమ రోల్ చక్కగా పోషించారు. కొండంత లక్ష్యాన్ని జింబాబ్వేల ముందు ఉంచి వారికి ఉక్కిరిబిక్కిరి చేశారు. ప్లాన్ పక్కా వర్కవుట్ చేసి మెన్ ఇన్ బ్లూ అనుకున్నది సాధించారు. గెలిచి నిలిచారు. టీమిండియా ముందు సంచలనాల జింబాబ్వే పప్పులు ఉడకలేదు.*

**చెన్నై:** చావోరేవో పోరులో భారత జట్టు జూలు విదిల్చింది. టాపార్డర్ ఆకాశమే హద్దుగా చెలరేగి రికార్డు స్కోరందించగా..ఆ తర్వాత జింబాబ్వేను 184 రన్స్ బౌలర్లు కట్టడి చేశారు. 72 రన్స్‌తో నెగ్గి సెమీస్ ఆశలు సజీవం చేసుకుంది.

లక్ష్య ఛేదనలో జింబాబ్వే ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్(97 నాటౌట్), మరుమని(20)లు దూకుడుగా ఆరంభించారు. పవర్ ప్లేలో వీరిద్దరూ 40 రన్స్ చేశారు.అయితే.. అక్షర్ పటేల్ ఓవర్లో మరుమని షాట్ ఆడి ఇషాన్ చేతికి చిక్కాడు. కాసేపటికే డియన్ మైయర్స్(6)ను వరుణ్ చక్రవర్తి వెనక్కి పంపాడు.

అనంతరం కెప్టెన్ సికిందర్ రజా(31) జతగా బెన్నెట్ భారీ షాట్లు ఆడాడు. వీరిద్దరూ సిక్సర్లతో అలరిస్తూ అర్ధ శతకం భాగస్వామ్యం నెలకొల్పారు. రజాను అర్ష్‌దీప్ ఔట్ చేయగా.. మున్యోగా( 11), ముసెకివా(7)లు త్వరగానే పెవిలియన్ చేరారు. ఓవైపు వికెట్లు పడుతున్నా బెన్నెట్ మాత్రం తగ్గేదేలే అన్నట్టు చెలరేగి సెంచరీకి చేరువయ్యాడు. కానీ.. చివరి ఓవర్లో సిక్స్, ఫోర్ రావడంతో జింబాబ్వే 184కే పరిమితమైంది.

ఈ పరిస్థితుల్లో చివరి నాకౌట్ పోరు భారత్, కరేబియన్ జట్టుకు కీలకం కానుంది. గెలిచిన జట్టు ముందంజ వేస్తుంది.ఒకవేళ మ్యాచ్ రద్దైతే.. మెరుగైన రన్‌రేటుతో విండీస్ సెమీస్ చేరుతుంది.

**సంక్షిప్త స్కోర్లు**

**భారత్-256/4(20 ఓవర్లలో)** (అభిషేక్ 55, పాండ్య 50, తిలక్ 44, ఇషాన్ 38, సూర్య 33, సంజూ 24, సికిందర్ రజా 1/29)

**జింబాబ్వే-184/6 (20 ఓవర్లలో)** (బెన్నెట్ 97, సికిందర్ రజా 31, అర్షదీప్ 3/24, వరుణ్ 1/35, అక్షర్ 1/35, దూబే 1/46)

### హార్దిక్, తిలక్ విధ్వంసకర బ్యాటింగ్

టీమిండియా ఇన్నింగ్స్‌లో మరో హైలైట్ హార్దిక్ పాండ్యా(23 బంతుల్లో 50),తిలక్ వర్మ(16 బంతుల్లో 44) విధ్వంసకర బ్యాటింగ్. 172 రన్స్ వద్ద సూర్య అవుటైన తర్వాత హార్దిక్‌తో కలిసిన హైదరాబాదీ వస్తూనే బౌండరీతో ఖాతా తెరిచాడు. ఇద్దరూ పోటీపడుతున్నట్లుగా సిక్స్‌లు, బౌండరీలతో జింబాబ్వే బౌలర్లకు చుక్కలు చూపారు. ఎంతగా అంటే కేవలం 31 బంతుల్లోనే 81 పరుగుల మెరుపు భాగస్వామ్యం. ఫస్ట్ డౌన్ బదులు ఫోర్త్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన తిలక్ మెరుపులు మెరిపించాడు. వీరిద్దరి ధాటికి 18 ఓవర్లో ముజర్బానీ 19 రన్స్,19వ ఓవర్లో గరవ 21 రన్స్, 20వ ఓవర్లో ఇవాన్స్ 15 రన్స్ ఇచ్చుకున్నారు. ఇవాన్స్ చివరి రెండు బంతులను హార్దిక్స్‌లుగా మలిచి హాఫ్ సెంచరీ కంప్లీట్ చేశాడు. హార్దిక్ రెండు ఫోర్లు, 4 సిక్స్‌లు బాదితే.. తిలక్ బ్యాట్ నుంచి మూడు ఫోర్లు, 4 సిక్స్‌లు వచ్చాయి. దీంతో భారత్ స్కోరు 250 మార్కు దాటింది.

### రైట్ టైమ్.. రైట్ పంచ్

విధ్వంసక ఓపెనర్ రైట్ టైమ్‌లో రైట్ పంచ్ ఇచ్చాడు. వరుసగా వైఫల్యాలకు చెక్ పెడుతూ ఎట్టకేలకు మునుపటి మెరుపులు మెరిపించాడు. రెండు ఓవర్ల వరకు అభిషేక్‌కు ఛాన్స్ ఇవ్వకుండానే సంజూ 23 రన్స్ చేశాడు. ఎట్టకేలకు మూడో ఓవర్‌లో బ్యాటింగ్ ఛాన్స్ వచ్చిన అభిషేక్.. మొదటి బంతిని డాట్‌గా ఆడాడు. ఆ వెంటనే ట్రాక్‌లోకి వచ్చి మపోసా బంతికి సిక్స్ బాదేశాడు. ఇక అక్కడి నుంచి అభి బ్యాటింగ్ టాప్ గేర్‌లోకి చేరింది. మధ్యలో లైఫ్ లైన్ తీసుకుని 30 బంతుల్లోనే నాలుగు ఫోర్లు మరో నాలుగు సిక్స్‌లతో 55 రన్స్ చేశాడు. సంజూతో ఫస్ట్ వికెట్‌కు 48 రన్స్, ఇషాన్ కిషన్‌తో సెకండ్ వికెట్‌కు 72 రన్స్, సూర్యతో మూడో వికెట్‌కు 30 రన్స్ జోడించాడు. అభిషేక్ దెబ్బకు మొదటి ఆరు ఓవర్లలో భారత్ ఖాతాలో 80 రన్స్ చేరితే.. 13వ ఓవర్‌కు 150 మార్క్ దాటింది.

## సఫారీల గర్జన : విండీస్ చిత్తు



**అహ్మదాబాద్:** టీ20 ప్రపంచకప్‌లో సఫారీలు ఎదురులేకుండా కొనసాగుతున్నారు. సూపర్-8 గ్రూప్-1లో మరో ఘనవిజయం ఖాతాలో వేసుకుంది. తొలి మ్యాచ్‌లో టీమిండియాను 76పరుగులతో చిత్తుచేసిన దక్షిణాఫ్రికా...రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ భరత పట్టింది. ఏకంగా 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా సెమీస్ బెర్త్ దాదాపు ఖాయం చేసుకుంది.జింబాబ్వేపై చెలరేగిన విండీస్ బ్యాటింగ్ సఫారీల బౌలింగ్ ముందు తేలిపోయింది.

విండీస్ ఉంచిన 177 పరుగుల లక్ష్యాన్ని సఫారీలు 16.1 ఓవర్లలోనే ఉఫ్ మనేశారు. ఇందుకోసం ఒకే ఒక వికెట్ కోల్పోయింది. ఓపెనర్లు మార్క్‌రమ్,డీకాక్ ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. తొలి ఓవర్‌నుంచే ఇద్దరూ విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. తొలి ఓవర్లో 11, రెండో ఓవర్లో 12 రన్స్.. ఇలా ఓవర్‌కు పదికి పైగా పరుగులు రాబట్టారు. సిక్స్‌లు, ఫోర్ల వర్షం కురిపిస్తూ తొలి వికెట్‌కు 8 ఓవర్లలోనే 95 రన్స్ జోడించి విజయానికి బాటలు వేశారు.ఈ దశలో 24బంతుల్లో 47 రన్స్ చేసిన డీకాక్‌ను ఛేజ్ అవుట్ చేశాడు. క్రీజ్‌లోకి వచ్చిన రికల్టన్ కూడా జోరు చూపడంతో పరుగులు వరదలా పారాయి.మరో 23 బంతులు ఉండగానే ఇద్దరూ విజయాన్ని అందించారు. ఈ క్రమంలో మార్క్‌రమ్ 82, రికల్టన్ 45 రన్స్‌తో అజేయంగా నిలిచారు.

అంతకుముందు విండీస్ ఇన్నింగ్స్‌ను బ్రాండెన్ కింగ్, షాయ్ హోప్ ధాటిగా ఆరంభించారు. రెండు ఓవర్లలోనే 29 రన్స్ చేశారు. రబడ ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసి కట్టడి చేశాడు. మొదట హోప్(16), ఆ తర్వాత హెట్‌మైర్(2)ను అవుట్ చేశాడు.వస్తూనే ఎంగిడి.. కింగ్స్(21)ను పెవలియన్ చేరాడు. ఆఓవర్ చివరి బంతికి ఛేజ్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. అదే ఊపులో పావెల్(9)ను కూడా తక్కువ పరుగులకే ఎంగిడి పెవిలియన్‌కు పంపాడు. మరోఎండ్‌లో బాచ్ కూడా వెంట వెంటనే రూథర్‌ఫోర్డ్(12), మాథ్యూ ఫోర్డ్(11)లను అవుట్ చేయడంతో వెస్టిండీస్83 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది.

కష్టాల్లో పడ్డ విండీస్‌ను జేసన్ హోల్డర్, రొమరియో షెపర్డ్ ఆదుకున్నారు. ఇద్దరూ ధనాధన్ ఇనింగ్స్ ఆడడంతో విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 176 పరుగుల పటిష్టస్కోరు చేసింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో లుంగిడి ఎంగిడి 3, రబాడ 2, బాచ్ 2 వికెట్లు పడగొట్టారు.

**సంక్షిప్త స్కోర్లు**

**వెస్టిండీస్-176/8(20 ఓవర్లలో)** (హోల్డర్ 49, షెపర్డ్ 52, బ్రాండన్‌కింగ్ 21, ఎంగిడి 3/30. రబాడ 2/22, బాచ్ 2/31);**దక్షిణాఫ్రికా- 177/1 (16.1 ఓవర్లలో)** (మార్క్‌రమ్ 82నాటౌట్, డీకాక్ 47, ర్యాన్ రికల్టన్ 45 నాటౌట్, ఛేజ్ 1/46

## రోనాల్డో మరో ఇన్నింగ్స్

**స్పెయిన్:** ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో... మరో క్లబ్‌కు యజమాని అయ్యాడు. స్పానిష్ క్లబ్ యుడ్ అల్మేరియాలో 25 శాతం వాటాను కొనుగోలు చేశాడు. ప్రస్తుతం ఈ క్లబ్ సౌదీ అరేబియా ఇన్వెస్టర్ల ఆధీనంలో ఉంది. 41 ఏళ్ల క్రిస్టియానో రోనాల్డో... 2022 నుంచి సౌదీ అరేబియాకు చెందిన అల్ నసర్ తరపున ఆడుతున్నాడు. అయిదుసార్లు ప్రతిష్టాత్మక బాలెన్ అందుకున్న రోనాల్డో... క్లబ్‌లో వాటాలు పెట్టడానికి ముందుకు వచ్చాడు. క్రిస్టియానో తమ క్లబ్‌ను ఎంచుకోవడం ఆనందంగా ఉందని యుడ్ అల్మేరియా యజమాని పేర్కొన్నాడు. ప్రస్తుతం అల్మేరియా క్లబ్ స్పానిష్ సెకండ్ డివిజన్ టోర్నీలో మూడో స్థానం పొందింది.



## మయాంక్ అగర్వాల్ అజేయ సెంచరీ



**హుబ్లీ:** ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీ ఫైనల్లో జమ్మూ కశ్మీర్ జోరు చూపుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 584పరుగుల భారీస్కోరు చేసిన జమ్మూ కశ్మీర్... ఆ తర్వాత కర్ణాటకు కట్టడి చేసింది. మయాంక్ అగర్వాల్ అజేయ శతకంతో మూడో రోజు ఆటముగిసేసరికి కర్ణాటక తొలి ఇనింగ్స్‌లో 5 వికెట్లకు 220 రన్స్ చేసింది. కర్ణాటక ఇంకా 364 పరుగులు వెనకబడి ఉంది. చేతిలో 5 వికెట్లు ఉన్నాయి. ఓవర్ నైట్ స్కోరు ఆరు వికెట్లకు 527 పరుగులతో మూడోరోజు ఆటకొనసాగించిన జమ్మూ కశ్మీర్ మిగతా 4 వికెట్లకు 47 పరుగులు జోడించింది. 584 పరుగుల భారీ స్కోరు వద్ద ఆలౌటైంది. సాహిల్ లోత్రా అర్ధసెంచరీతో రాణించగా,యుధీవర్ వేగంగా 30 రన్స్ చేశాడు. కర్ణాటక బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ 5వికెట్లు పడగొట్టాడు.

తర్వాత తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్ణాటక ఆరంభంలో తడబడింది. లంచ్‌కు ముందు రాహుల్ వికెట్ కోల్పోయిన కర్ణాటక.. టీవిరామానికి మరో మూడు వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ పడిక్కల్(11) నిరాశపరచగా, కరుణ్ నాయర్, స్మరణ్ డకౌట్‌లుగా వెనుదిరిగారు. దీంతో 57 రన్స్‌కే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. టీ తర్వాత మయాంక్ జోరు చూపాడు. తనే ఎక్కువగా బ్యాటిగ్ చేస్తూ శ్రేయాస్ గోయల్(27) తో కలిసి 5వ వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం, కృతిక్ కృష్ణ (27)తో కలిసి 6వ వికెట్‌కు అజేయంగా 58రన్స్ జోడించాడు.ఈ క్రమంలో శతకం పూర్తి చేసిన మయాంక్ 130 పరుగులతో అజయంగా క్రీజ్‌లో ఉన్నాడు. జమ్మూ కశ్మీర్ బౌలర్లలో అకిబ్ నబీ 3 వికెట్లు పడగొట్టాడు.

# వాణిజ్యం

## రూ.7400 తగ్గిన వెండి

### రూ.1300 సడలిన పసిడి ధరలు



**ముంబయి, ఫిబ్రవరి 26:** బంగారం వెండిధరలు స్వల్పంగా తగ్గి కస్టమర్లకు ఊరటనిచ్చాయి. కిలో వెండిధరలు రూ.7400 తగ్గి రూ.2.70 లక్షలకు చేరితో బంగారం ధరలు కూడా పదిగ్రాములకు రూ.1300 తగ్గి రూ.1.62 లక్షల రూపాయలకు చేరింది. అఖిలభారత సరాఫా అసోసియేషన్ వివరాలను చూస్తే వెండిధరలు 3శాతం తగ్గి రూ.2,70,500కి చేరాయి. అంతకుముందురోజు కిలో ఒక్కింటికి రూ.2,77,900గా నడిచింది. బంగారంధరలు 99.9శాతం స్వచ్ఛత కలిగిన బంగారం రూ.1300 తగ్గింది. అంటే ఒకటిశాతం క్షీణించి పదిగ్రాములు రూ.1,62,900కి చేరింది. అంతకుముందురోజు మార్కెట్లలో పదిగ్రాములు రూ.1,64,200గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలో స్పాట్ ధరలు వెండి 1.91 డాలర్లు క్షీణించి ఔన్స్ ఒక్కింటికి 87.28 డాలర్లుగా నిలిచింది. అలాగే బంగారం కూడా ఔన్స్ ఒక్కింటికి 5176.21 డాలర్లుగా కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీనపరడిన ధోరణులు స్వల్పంగా లాభాల స్వీకరణలతో ధరలు కొంతమేర తగ్గాయి. ఈ వారంలోనే ఒకదశలో ధరలు మూడువారాల గరిష్టాన్ని కూడా చేరాయి. ఇక 22 క్యారెట్ల బంగారందరలు పదిగ్రాములు రూ.1,47,600గా కొనసాగాయి. రూ.800 మార్పు కనిపించింది. చెన్నైలో రూ.1,49,200గాను, ముంబయిలో 1,47,600గాను కొనసాగితే 24 కేరట్ల బంగారం చెన్నైలో 1,62,770 గాను కొనసాగాయి. ఇక హైదరాబాద్‌లో అయితే 24 కేరట్ల బంగారం రూ.1,61,020గాను, 22 కేరట్ల ధరలు 1,47,600గాను కొనసాగాయి.



## ఇడి ముందు హాజరయిన అనిల్ అంబాని

### మరోవైపు ఇల్లు, ఆఫీసుల్లో సిబిఐ సోదాలు

**ముంబయి, ఫిబ్రవరి 26:** రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి కష్టాలు ముదురుతున్నాయి. మనీలాండరింగ్, బ్యాంక్ లోన్ల మోసం కేసులో గురువారం ఆయన ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. సరిగ్గా ఒకరోజు ముందే ముంబైలోని ఆయన విలాసవంతమైన నివాసం అబోడ్‌ను ఈడీ జప్తు చేయడం గమనార్హం. ముంబైలోని పాలి హిల్ ప్రాంతంలో ఉన్న 17 అంతస్తుల ఈ భవనం విలువ సుమారు రూ.3,716 కోట్లు ఉంటుందని అంచనా. రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) సంస్థకు సంబంధించిన బ్యాంక్ రుణాల మళ్లింపు, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై 66 ఏళ్ల అనిల్ అంబానీని అధికారులు రెండో విడత విచారించారు. ఒకప్పుడు ప్రపంచ కుబేరులలో ఒకరిగా ఉన్న అనిల్ అంబానీ, గత రెండు దశాబ్దాలుగా తన వ్యాపార సామ్రాజ్యంలో వరుస నష్టాలను ఎదుర్కొంటున్నారు. విద్యుత్ నుండి రక్షణ రంగం వరకు విస్తరించిన ఆయన వ్యాపారాలు ప్రస్తుతం దర్యాప్తు సంస్థల నిఘాలో ఉన్నాయి. తాజాగా ఈడీ జరిపిన ఈ ఆస్తుల అటాచ్‌మెంట్ మరియు సుదీర్ఘ విచారణ పారిశ్రామిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముకేశ్ అంబానీ తమ్ముడిగా అందరికీ తెలిసిన అనిల్ ఇప్పుడు తన ఉనికిని కాపాడుకునేందుకు న్యాయపరమైన పోరాటం చేస్తున్నారు. ఈ కేసులో తదుపరి చర్యలు ఎలా ఉంటాయనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. ఇదిలా ఉండగా సిబిఐ అధికారులు అనిల్‌అంబాని ఇల్లు, హెడ్డాఫీసు, ఇతర కార్యా లయాలన్నింటిలోనూ తనిఖీలుచేసారు. బ్యాంక్ ఆఫ్ బరోడాను మోసంచేసారని 2223.17 కోట్లు రుణాలు ఎగవేసారన్న అభియోగాలపై సిబిఐ కేసునమోదుచేసిన సంగతి తెలిసిందే.

## ట్రేడింగ్ ఆసాంతం ఒడిదుడుకులే!

### స్వల్ప నష్టాలతో సరిపెట్టుకున్న సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, ఫిబ్రవరి 26:** రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనై స్టాక్ మార్కెట్లు చివరికి నిలకడగా ముగిశాయి. హెల్త్‌కేర్, పీఎస్‌యూ బ్యాంకుల షేర్లు లాభపడగా, మీడియా, ఎఫ్‌ఎంసీజీ షేర్లు నష్టాలను చవిచూశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బెంచ్‌మార్క్ నిఫ్టీ 14.05 పాయింట్ల స్వల్ప లాభంతో 25,496.55 వద్ద స్థిరపడింది. మరోవైపు, సెన్సెక్స్ 27.46 పాయింట్లు నష్టపోయి 82,248.61 వద్ద ముగిసింది. రంగాల వారీగా చూస్తే, హెల్త్‌కేర్ రంగం మార్కెట్‌లో మంచి పనితీరు కనబరిచింది. నిఫ్టీ హెల్త్‌కేర్ ఇండెక్స్ 1.24 శాతం, నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 1.08 శాతం మేర లాభపడ్డాయి. పిఎస్‌యు బ్యాంకుల షేర్లలో సానుకూల ధోరణి కనిపించింది. అయితే మీడియా, ఎఫ్‌ఎంసీజీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. నిఫ్టీ మీడియా ఇండెక్స్ 0.68 శాతం, నిఫ్టీ ఎఫ్‌ఎంసీజీ ఇండెక్స్ 0.16 శాతం మేర నష్టపోయాయి. బీఈఎల్, సన్ ఫార్మా, అదానీ పోర్ట్స్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడగా, ట్రెంట్, పవర్ గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బ్రాడర్ మార్కెట్లు కూడా మిశ్రమంగానే ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.58 శాతం క్షీణించగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ దాదాపు ఫ్లాట్‌గా 0.01 శాతం నష్టంతో ముగిసింది. మరోవైపు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐ), దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (డీఐఐ) మార్కెట్లకు అండగా నిలిచారు. ఫిబ్రవరి 25న ఎఫ్ఐఐలు రూ. 3,024.50 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేయగా, డీఐఐలు రూ. 3,639.97 కోట్ల విలువైన ఈక్విటీలను కొన్నారు. మార్కెట్ పరిమిత శ్రేణిలో కదలాడిందని, హెల్త్‌కేర్ వంటి డిఫెన్సివ్ రంగాలలో మాత్రమే ఎంపిక చేసిన కొనుగోళ్లు జరిగాయని విశ్లేషకులు తెలిపారు. అంతర్జాతీయ సానుకూల సంకేతాలతో మార్కెట్ ఉదయం లాభాలతో ప్రారంభమైనప్పటికీ, అధిక స్థాయిలలో లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు ఒత్తిడికి గురయ్యాయని పేర్కొన్నారు. టెక్నికల్‌గా నిఫ్టీ 25,700 స్థాయిని గట్టిగా దాటితేనే మార్కెట్ గమనంలో మార్పు వస్తుందని, అంతవరకు 25,400 మద్దతుగా ఉన్నంతకాలం దిగువ స్థాయిలలో కొనుగోళ్లు కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## యెస్ బ్యాంకులో కస్టమర్ల క్రెడిట్ కార్డు డేటా చోరీ!



**ముంబయి, ఫిబ్రవరి 26:** ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో డేటా లీక్, మోసపూరిత లావాదేవీలు పెరుగుతున్నాయి. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో ప్రభుత్వ అకౌంట్లలో నగదు అక్రమ బదిలీ ఉదంతం మరవకముందే మరో ప్రైవేట్ బ్యాంకులో అనధికారిక లావాదేవీలు జరిగినట్లు వెలుగుచూసింది. బుక్ మైఫారెక్స్ తో కలిసి యెస్ బ్యాంక్ జారీ చేసిన ఫారెక్స్ కార్డుల్లో అక్రమ లావాదేవీలు జరిగినట్లు బ్యాంక్ గుర్తించింది. కస్టమర్ల సీవీవీ చోరీ చేసి అనధికారికంగా ట్రాన్సాక్షన్లు చేసినట్లు బ్యాంక్ ప్రకటించింది. ఈ ఘటనపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వివరణ కోరినట్లు తేలింది. యెస్ బ్యాంకు జారీ చేసిన మల్టీ కరెన్సీ ప్రీపెయిడ్ ఫారెక్స్ కార్డులను ఉపయోగించి దాదాపు 2,80,000 డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.2.35 కోట్లు విలువైన ట్రాన్సాక్షన్లు జరిగినట్లు బ్యాంక్ గుర్తించింది. ఐదువేల మంది కస్టమర్లకు చెందిన కార్డుల వివరాలను ఉపయోగించి ఈ ట్రాన్సాక్షన్లు జరిగినట్లు ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. లాటిన్ అమెరికా దేశం నుంచి ఫిబ్రవరి 24వ తేదీ ఉదయం 3.30 నుంచి 8.30 గంటల వరకు 15 మర్చంట్ అకౌంట్ల నుంచి ఈ ట్రాన్సాక్షన్లు జరిగాయి. ఆ దేశంలో ఇకామర్స్ ట్రాన్సాక్షన్లకు 2ఫ్యాక్టర్ అథెంటికేషన్ లేకపోవడం ఈ మోసానికి మూల కారణమని తెలిపింది. మోసం ఘటన వెలుగు చూసిన వెంటనే లాటిన్ అమెరికా దేశం నుంచి ఇకామర్స్ ట్రాన్సాక్షన్లు జరగకుండా యెస్ బ్యాంక్ నిలిపివేసింది. ఆపై కూడా అనధికార ట్రాన్సాక్షన్ల కోసం 688 ప్రయత్నాలు జరిగినట్లు యెస్ బ్యాంక్ తెలిపింది. మోసానికి గురైన కస్టమర్లకు ఎలాంటి ఆర్థిక నష్టం ఉండబోదని తెలిపింది. బ్లాక్ చేసిన కార్డుల స్థానంలో కొత్త ఫారెక్స్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపింది.



## విమాన ప్రయాణీకులకు డిజిసిఎ గుడ్‌న్యూస్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** విమాన ప్రయాణికులుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఉపశమనం కల్పించింది. విమాన టికెట్ రద్దు నిబంధనలను సవరించింది. టికెట్ రీఫండ్, మార్పులకు సంబంధించి ఈ రూల్స్ ఎయిర్ ఫ్లైయర్స్‌కు ఎంతో ఊరటనివ్వనున్నాయి. విమాన ప్రయాణీకులు ఇప్పుడు టికెట్ బుకింగ్ చేసిన 48 గంటలలోపు అదనపు ఛార్జీలు చెల్లించకుండా వారి టిక్కెట్లను రద్దు చేసుకోవచ్చు లేదా సవరించవచ్చు. బుకింగ్ చేసిన 24 గంటల్లోపు ఏదైనా తప్పు జరిగితే, ప్రయాణికుడు తన పేరును సరిదిద్దుకోవడానికి విమానయాన సంస్థకు అదనపు ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ సౌకర్యం విమానయాన సంస్థ వెబ్‌సైట్ నుంచి నేరుగా టికెట్ బుక్ చేసుకున్న వారికి మాత్రమే వర్తిస్తుంది. ఒక వేళ ప్రయాణికుడు ట్రావెట్ ఏజెంట్ లేదా మేక్‌మై ట్రిప్, ఈజీమైట్రిప్ వంటి థర్డ్ పార్టీ పోర్టల్స్ ద్వారా బుక్ చేసుకున్నా, రీఫండ్ ఇచ్చే బాధ్యత విమాన సంస్థలదే అని, ఎందుకంటే వీరు విమానయాన సంస్థ ప్రతినిధులుగా పనిచేస్తున్నారని డీజీసీఏ కొత్త రూల్స్‌లో పేర్కొంది. ఈ రీఫండ్ 14 వర్కింగ్ డేస్‌లో పూర్తి చేయాలని చెప్పింది.

## వచ్చే యేడాది భారత్ వృద్ధిరేటు 7.2%

### ఎర్నెస్ట్ అండ్ యంగ్ అంచనా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** భారత్ స్థూలదేశీయోత్పత్తి అంటే జిడిపి వృద్ధిరేటు వచ్చే ఆర్థికసంవత్సరంలో 6.8 నుంచి 7.2శాతానికి పెరుగుతుందని ఎర్నెస్ట్ ఎంగ్ ఎకానమీ వాచ్‌నివేదిక విడుదలచేసింది. వికసిత్‌భారత్ లక్ష్యాలు 2047కల్లా సాధించేదిశగా భారత్ జిడిపి ప్రగతిబాటలోకి వెళుతుందని, పన్నులు జిడిపి నిష్పత్తిని పెంచుకోవాలనిచూస్తోంది. పన్నులరంగంలో తెచ్చిన సంస్కరణల కారణంగా ప్రత్యక్ష, పరోక్షపన్నుల వసూళ్లు ఈసారి భారీగా పెరగనున్నట్లు అంచనా. భారత్ వివిధ దేశాలతో చేసుకున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు మరింత దోహదంచేస్తాయని, భారత వాస్తవ జిడిపి వృద్ధి వచ్చే ఏడాది అంటే 2027 ఆర్థికసంవత్సరంలో 6.8 నుంచి 7.2శాతంగా ఉంటుందని ఈవై ఇండియా ప్రధాన పాలసీ అడ్వయిజర్ డికె శ్రీవాస్తవ అన్నారు. కేంద్ర స్థూల పనున రాబడులు బడ్జెట్ అంచనాలకంటే కొంత తగ్గేటట్లు కనిపిస్తున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.